ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ప్రకాశం 5
జిల్లా వార్తలు
మంగళవారం 7, మే 2024



కులవృత్తులు కుదేలు

జగన్ ప్రభుత్వం రెక్కాడితేగాని డొక్కాడని బడుగుజీవుల పొట్టగొట్టింది. పేదల ప్రభుత్వం అంటూ ప్రతిసారీ గొప్పలు పోయే వైసీపీ నేతలు ఒక్కసారైనా చేతివృత్తుల వారి పరిస్థితి గురించి ఆలోచించలేదు. వారి సంక్షేమం కోసం చిల్లిగవ్వ విడుదల చేయలేదు. కనీసం రుణాలు పొందే వీలు కూడా లేకుండా చేశారు. టీడీపీ హయాంలో 'ఆదరణ' ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజికవర్గాల్లోని చేతివృత్తుల వారి ఆర్థికాభివృద్ధి కోసం యంత్రాలు, పరికరాలు ఇచ్చి అండగా నిలిచింది. కానీ ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం ఆ పథకాన్ని దుర్మార్గంగా రద్దుచేసింది. ఆయా కార్పొరేషన్లకు ఒక్కపైసా నిధులు లేకుండా చేసి, ఉపయోగం లేని పదవులు కట్టబెట్టింది. కానీ వారిని ఉద్ధరించినట్లు చెప్పుకోవడంపై ఆయా సామాజిక వర్గాలు మండిపడుతున్నాయి.

- జగన్ పాలనలో అంతా ఆర్భాటమే
- ఐదేళ్లలో చేతివృత్తులకు మొండిచేయి
- ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్‌లలో నిధులు నిల్
- పెరిగిన ధరలతో సగటు జీవి బతుకు భారం
- వైసీపీ మళ్లీ వస్తే ఊరొదిలి పోవాల్సిందే!

పెట్టుబడి కూడా రావడం లేదు



గతంలో రోజంతా పనిచేస్తే పెట్టుబడి పోను, ఇంట్లో ఖర్చులు వచ్చేవి. అంతే కాకుండా పిల్లల చదువుల కోసం ఎంతో కొంత దాచుకునేవాళ్లం. ఇప్పుడు మిగలడం సంగతి దేవుడెరుగు కనీసం రోజువారీ పెట్టుబడి కూడా రావడం లేదు. ప్రభుత్వ పరంగా రుణాలు లేవు. ఐదేళ్లుగా మేదర వృత్తికి ఆదరణ కరువైంది. ఇలాంటి పరిస్థితులు ఇదివరికెన్నడూ చూడలేదు. ప్రభుత్వాలు మారితే తప్ప మాలాంటి వారి జీవితాలకు మేలు జరగదు.

- జి.ప్రసాద్, మేదర వృత్తిదారుడు

రూ.10వేలు రుణం కూడా రాలేదు

ఇరవై ఏళ్లుగా మేదర వృత్తి చేసుకుంటున్నా. ప్రభుత్వాలు మారుతున్నాయే తప్ప మా బతుకుల్లో మార్పు లేదు. పేదల కోసం పథకాలంటున్నారు కానీ ఒక్కటీ మాకు తెలియదు. కనీసం ఎలాంటి హామీలు లేని ముద్ర లోను కూడా ఇవ్వ లేదు. పేరుకే ప్రభుత్వ పథకాలు, పేదలకు కాదు అని అర్థం అవుతుంది. వ్యాపారాభివృద్ధి కోసం ఏళ్లతరబడి లోను కోసం బ్యాంకుల చుట్టూ తిరిగి వేసారి పోయా.

- పెట్లూరి శ్రీనివాసరావు, కుండల వ్యాపారి



ఒంగోలు (కార్పొరేషన్) మే 6 : చేతివృత్తులపై ఆధారపడి జీవించేవారి పరిస్థితి వైసీపీ ప్రభుత్వంలో దారుణంగా తయారైంది. మేదర, కుమ్మరి, కంసాలి, రజకులు, క్షురకులు, స్వర్ణకారులు, కార్పెంటర్లు, చెప్పులు కుట్టేవారు, ఎలక్ట్రీషియన్లు ఇలా ఒకటేమిటి అన్ని చేతివృత్తిదారుల కుటుంబాల పరిస్థితి దయనీయంగా మారింది. ఒక్క చాన్స్ అంటూ ఓటేస్తే బాగానే ఉద్ధరించాడని వాపోతున్నారు. ఒక్క ప్రభుత్వ పథకమూ అమలు చేయకపోగా, పైసా రుణం కూడా ఇవ్వలేదని ప్రభుత్వంపై వారు మండిపడుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే తమకు మేలు జరిగిందని బహిరంగంగానే చెబుతున్నారు. చేతివృత్తిదారులకు పరికరాలు ఇవ్వడంతోపాటు, ఆయా కార్పొరేషన్ల ద్వారా రుణాలు అందించి అండగా నిలిచారని తెలిపారు. ఈసారి జగన్‌ను నమ్మి ఓటేస్తే ఇక నట్టేట మునిగిపోవాల్సిందేనన్నారు. ఊరూవాడా వదిలి వలసలు పోయే పరిస్థితికి తీసుకొస్తాడని, వద్దు బాబోయ్.. జగన్ పాలన మాకొద్దు అంటున్నారు.

చర్మకారుల సంక్షేమాన్ని పట్టించుకోలేదు



వైఎస్ పాలన చూశాం. కొన్ని పథకాలు మాలాంటి పేదవారికి అందాయి. తండ్రి లాంటి మనస్తత్వం అనుకున్నాం. కానీ జగన్ అలాంటి వారు కాదు. పూర్తిగా వ్యాపారం, డబ్బు సంపాదన మీదనే ఆయన దృష్టి ఉంది. ఇప్పటి వరకూ చాలా ప్రభుత్వాలను చూశాను. ఇలాంటి పాలన ఎన్నడూ చూడలేదు. మాలాంటి చేతి వృత్తిదారులను ఘోరంగా మోసం చేశారు. ఎస్సీ కార్పొరేషన్ ఉన్నా ఉపయోగం లేకుండాపోయింది. రుణాలు లేవు. పథకాలు రావు. మరోసారి జగన్ గెలిస్తే కచ్చితంగా ఇతర రాష్ట్రానికి వెళ్లి ఏదో ఒక పని చేసుకోవాల్సిందే.

- పాలపర్తి దావీదు, చర్మకారుడు

పేదలకు చేరని ప్రభుత్వ పథకాలు

టీడీపీ హయాంలో పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలను వైసీపీ ప్రభుత్వం రాగానే దూరం చేసింది. చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో అన్నివర్గాల ప్రజలకు ఆర్థిక చేయూత నిచ్చేందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, కాపు, బ్రాహ్మణ కార్పొరేషన్‌ల ద్వారా రుణ సౌకర్యం కల్పించారు. ఆర్థికంగా అండగా నిలిచారు. అయితే గడిచిన ఐదేళ్లలో పలు పథకాల కోసం దరఖాస్తు చేసుకున్నా, పాలకులు హామీలు ఇస్తున్నా బ్యాంకులు మాత్రం ముందుకు రావడం లేదు. ఎలాంటి హామీలు లేకుండానే ప్రభుత్వం అందించే ముద్ర రుణాలు కూడా దక్కని పరిస్థితులు ఉన్నాయి.

కడుపు నింపని కుల వృత్తి

తరతరాలుగా కులవృత్తిపై ఆధారపడిన మేదరలు నేడు దానికి దూరమైపోతున్నారు. రోజంతా కష్టపడి పనిచేసినా కనీసం కడుపునిండా కూడు తినలేని పరిస్థితులను నేడు చూస్తున్నారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలు వారి దాకా చేరడం లేదు. గత టీడీపీ హయాంలో పథకాలు అందరికీ అందేవని, ధరలు అదుపులో ఉండటంతో రోజూ సంపాదించిన దాంతో సంతోషంగా జీవించామని వారు అంటున్నారు. కొంత ఆదా కూడా చేసుకునే పరిస్థితులు ఉండేవన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క పథకం కూడా రాలేదంటున్నారు. తాము ఉన్నామన్న సంగతి కూడా మరిచిపోయారని మేదరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఐదేళ్లలో పనులు జరుగుతున్నా పైసా కూడా దాచిపెట్టలేని పరిస్థితి ఉందని, రోజంతా కష్టపడినా పెరిగిన ధరలతో పెట్టుబడులు కూడా చేతికొచ్చే పరిస్థితి లేదని వాపోతున్నారు.

గంగిరెద్దుల వారి గోడు పట్టించుకునేవారు కరువు

జిల్లాలోని పశ్చిమ ప్రాంతానికి చెందిన నాగెళ్లముడుపు గ్రామం గంగిరెద్దుల వాళ్లకు పెట్టింది పేరు. పొట్ట చేతపట్టుకుని పట్నం వచ్చిన గంగిరెద్దుల వాళ్ల గోడు పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఒంగోలు నగరంలోని గాంధీనగర్‌లోని ఓ ఖాళీ స్థలంలో తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకుని ఇల్లిల్లూ తిరుగుతూ పొట్ట నింపుకొంటున్న వందల కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు దూరమయ్యాయి. సంక్రాంతి సంబరాలు, ప్రత్యేక ప్రభుత్వ కార్యక్రమాలు, పెద్దోళ్ల గృహ ప్రవేశాలకు మాత్రమే వారిని గుర్తించి ఆహ్వానించడం తప్ప ఆ తర్వాత పట్టించుకునే వారే కరువయ్యారు. ఇతర కులస్థుల మాదిరిగానే తమకూ గుర్తింపుకార్డులు, రేషన్‌కార్డులు, రిజర్వేషన్లు కల్పించి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.



స్వర్ణం వెలవెలబోతోంది

స్వర్ణకారుల కుటుంబాలు నేడు వెలవెలబోతున్నాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలకు తక్కువ రేటుతో చూడముచ్చటైన నగలు తయారీ చేసి అందించిన బంగారం వృత్తిదారులు ప్రస్తుతం కార్పొరేట్ షాపులు, రెడీమేడ్ వస్తువులు అందుబాటులోకి రావడంతో పనులు లేక ఖాళీగా ఉంటున్నారు. జిల్లాలో 1500 వరకు బంగారు ఆభరణాల తయారీ షాపులు ఉండగా, సుమారు 3వేలకు మందికిపైగా స్వర్ణకారులు (గోల్డ్‌స్మిత్‌లు) చేతివృత్తిని ఆధారం చేసుకుని జీవనం సాగిస్తున్నారు. పలువురు పెద్ద బంగారు దుకాణాలను ఆధారంగా చేసుకుని పనిచేస్తున్నారు. మరికొందరు సొంతంగా పనులు ఒప్పుకుని జీవనం సాగిస్తుండగా, కొందరు చిన్న చిన్న దుకాణాలు పెట్టుకుని జీవిస్తున్నారు. వారిలో 80శాతం మంది బంగారు, వెండి అమ్మకాల షాపులపై ఆధారపడి జీవిస్తుండగా, 20శాతం మంది సొంతంగా పని ఒప్పుకొని కుటుంబపోషణ సాగిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎలాంటి రుణాలు, పథకాలు కూడా లభించలేదు.

దయనీయంగా చర్మకారులు

మారుతున్న కాలానుగుణంగా చేతివృత్తులు, కులవృత్తులు అంతరించిపోతున్నాయి. వాటిలో చర్మకార వృత్తి ఒకటి. గతంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో చర్మకారులు (చెప్పులు కుట్టేవారికి) చేతినిండా పని ఉండేది. అప్పట్లో ప్రతి ఒక్కరూ స్వయంగా తమ సైజులలో కోరిన విధంగా కుట్టించుకుని మరీ వాడేవారు. గ్రామీణ ప్రాంతాల్లో అనాదిగా వస్తున్న ఈ వృత్తిని నమ్ముకునే అనేక కుటుంబాలు జీవించేవి. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. నేటి ఆధునిక కాలానికనుగుణంగా చెప్పుల తయారు చేసే వారు లేకపోగా అక్కడక్కడా రిపేరు చేసే వారు మాత్రమే కనిపిస్తున్నారు. అయినప్పటికీ వీరికి ఆదరణ కరువైపోతోంది. వైసీపీ పాలనలో రోజురోజుకూ అడ్డగోలుగా పెరుగుతున్న నిత్యావసర ధరలతో జీవనం దుర్భరంగా మారిందని పలువురు చర్మకారులు వాపోతున్నారు. వారికి ప్రభుత్వ సాయం అంతంత మాత్రంగానే అందుతోంది.

బెడిసికొడుతున్న వైసీపీ వ్యూహాలు

- ఉద్యోగులకు ఎక్కువ మొత్తంలో పంపిణీకి ప్రయత్నం
- ఓటర్లకూ అంతే ఇవ్వాలంటూ శ్రేణుల డిమాండ్
- ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డిపై అభ్యర్థుల కస్సుబుస్సు
- ఒంగోలులో భారీ ప్రలోభాలకు తెరతీసిన అధికార పార్టీ

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఎన్ని ప్రలోభాలు పెట్టినా ఉద్యోగుల్లో లభించని ఆదరణ... పోలింగ్ తేదీ దగ్గరపడే కొద్దీ తటస్థ ఓటర్లలో బయటపడుతున్న ప్రభుత్వ వ్యతిరేకత... అంటీముట్టనట్లుగా ఉన్న సొంత పార్టీలోని అసమ్మతివాదులు.. క్రమేపీ దూరమవుతున్న ఓటర్లు... ఇదీ ప్రస్తుతం జిల్లాలో వైసీపీ అభ్యర్థుల పరిస్థితి. ఓటమి భయంతో బెంబేలెత్తుతున్న అధికార పార్టీ నేతలు ఓటర్లకు వారం ముందుగానే నగదు పంపిణీకి తెరలేపింది. ఉద్యోగుల ఓట్లకు ఎక్కువ మొత్తం డబ్బులు ఇవ్వాలని ప్రయత్నించిన వైసీపీకి అదే శాపంగా మారింది. ఉమ్మడి జిల్లాలోని ఒంగోలు, దర్శి, అద్దంకి నియోజకవర్గాల్లో ఉద్యోగులకు ఒక్కొక్కరికి రూ.5వేల ప్రకారం చెల్లించే ప్రక్రియను వైసీపీ ప్రారంభించింది. ఒంగోలులో వేసిన ఓటును సెల్‌ఫోన్ ఫొటో ద్వారా చూపించగలిగితే మరో రూ.5 వేలు అదనంగా ఇస్తామని కూడా వైసీపీ నాయకులు చెప్పారు. ఇది గమనించిన టీడీపీ నాయకులు సోమవారం మధ్యాహ్నం కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆతర్వాత ఆయన పోలింగ్ కేంద్రాలకు సెల్‌ఫోన్ తీసుకెళ్లడాన్ని నిలిపివేశారు. ఎంత ఆశచూపినా ఉద్యోగుల నుంచి సానుకూల స్పందన వారికి లభించలేదు. ఒంగోలులో కొందరు ఉద్యోగులు అయితే టీడీపీ కూటమి నాయకులకు చందాలు ఇచ్చి మరీ ప్రోత్సహిస్తున్నారు. మార్కాపురంలో ఆర్టీసీలో పనిచేసే 40మంది ఉద్యోగులు ఓటు వేసి నేరుగా టీడీపీ అభ్యర్థి నారాయణరెడ్డి వద్దకు వచ్చి తమ మద్దతు తెలిపి వెళ్లారు. కనిగిరిలో టీచర్లు అంతా ఐక్యంగా తీర్మానం చేసుకొని టీడీపీ కూటమి అభ్యర్థి ఉగ్రకు అనుకూలంగా వ్యవహరించారు. అక్కడ సచివాలయ ఉద్యోగులకు మాత్రం ఇరుపార్టీల వారు డబ్బులు పంపిణీ చేశారు. దర్శిలో వైసీపీ అభ్యర్థి ఒక్కొక్కరికి రూ.5 వేలు ఇచ్చారు. ఒంగోలులో ఉద్యోగులకు రూ.5వేల నుంచి రూ.10వేలు ఇస్తే మాకెంత ఇస్తారంటూ సాధారణ ఓటర్ల నుంచి డిమాండ్ పెరిగింది. దీంతో గత్యంతరం లేక వైసీపీకి ఆధిక్యత ఉన్న ఒక సామాజికవర్గం నివసించే ప్రాంతంలో రూ.5వేల ప్రకారం వైసీపీ శ్రేణులు ఆదివారం రాత్రే డబ్బులు ఇచ్చినట్లు సమాచారం. మరో ప్రాంతంలో రూ.3వేలు ఇవ్వబోగా వారు రూ.5వేలు కావాలంటూ డిమాండ్ చేసినట్లు తెలిసింది. ఇక వైసీపీ అధినాయకత్వం సోమ, మంగళవారాల్లో ఓట్లకు డబ్బులు ఇవ్వాలని సూచించినట్లు సమాచారం.

చెవిరెడ్డి ఝలక్

ఒంగోలు లోక్‌సభ పరిధిలో చెవిరెడ్డి చేయూతతో మరిన్ని డబ్బులు ఇస్తామని చెప్పిన అసెంబ్లీ నియోజకవర్గాల్లో వైసీపీ నేతలకు చేదు అనుభవాలు ఎదురైనట్లు సమాచారం. ఒకసారి మండలస్థాయిలో పరిచయ కార్యక్రమంలో కనిపించిన చెవిరెడ్డి ఆ తర్వాత జగన్ సభల్లో మాత్రమే ప్రత్యక్షమయ్యారు. పార్టీ ఇచ్చే ఫండ్‌కు తోడు చెవిరెడ్డి ఇచ్చే చేయూతతో పెద్దమొత్తంలో డబ్బులు ఇచ్చి ఓట్లు కొనుగోలు చేయాలనుకున్న వైసీపీ నాయకులు కనీసం చెవిరెడ్డి అందు బాటులో కూడా లేక కస్సుబుస్సులాడుతున్నట్లు తెలిసింది. ఒకరిద్దరు అభ్యర్థు లకు 'ధనం'గా కొంత సమకూర్చిన చెవిరెడ్డి మిగిలిన వారిని గాలికొదిలేశా రనే ప్రచారం జరుగుతోంది. పార్టీ పంపిన ఫండే నా ఫండ్ అంటూ ఆయన సమాధానం ఇవ్వడంతో వైసీపీ అభ్యర్థులు ముందుగా చెప్పిన స్థాయిలో ఓట్లకు డబ్బులు ఇవ్వలేక అభాసుపాలవుతున్నారు.



పట్టుబడిన మద్యం బాటిళ్లతో ఎస్‌ఈబీ సూపరింటెండెంట్ శౌరి, సిబ్బంది

ఇంట్లోనే బెల్ట్‌షాప్!

- ప్రభుత్వ దుకాణం నుంచి మద్యం తీసుకెళ్లి విక్రయిస్తున్న సూపర్‌వైజర్
- ఆయనతోపాటు సేల్స్‌మన్ అరెస్టు
- 118 క్వార్టర్ బాటిళ్లు పట్టివేత

ఒంగోలు (క్రైం), మే 6 : ప్రభుత్వ వైన్‌షాప్‌లో పనిచేస్తున్న సూపర్‌వైజర్ తన ఇంటినే బెల్ట్ దుకాణంగా మార్చాడు. సేల్స్‌మన్‌తో కలిసి మద్యం బాటిళ్లను తరలించి అధిక ధరలకు అమ్ముకొంటున్నాడు. వారిద్దరినీ ఎస్‌ఈబీ అధికారులు అరెస్టు చేశారు. 118 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వివరాలను ఎస్‌ఈబీ సూపరింటెండెంట్ శౌరి సోమవారం స్థానిక అన్నవరప్పాడులోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. నగరంలోని అరుణోదయ కాలనీకి చెందిన మిరియం బాలాజీ స్థానిక గుంటూరు రోడ్‌లోని ఓ మాల్ వద్ద ఉన్న మద్యం దుకాణంలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. అదేకాలనీకి చెందిన పుసల రామకృష్ణ కూడా ఆ షాపులోనే సేల్స్‌మన్‌గా ఉన్నాడు. ఎన్నికల నిబంధనల మేరకు ప్రభుత్వ దుకాణాల్లో రేషన్ విధించడంతో మద్యానికి డిమాండ్ ఏర్పడింది. దీంతో దుకాణం నుంచి బాలాజీ మద్యాన్ని తీసుకెళ్లి అదనపు ధరలకు విక్రయిస్తున్నాడు. తన ఇంట్లోనే ఈ వ్యవహారం నడుపుతున్నాడు. ఆయనకు రామకృష్ణ సహకరిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం కూడా వారిద్దరూ గోతంలో మద్యం బాటిళ్లు పెట్టుకొని దుకాణం నుంచి ఇంటికి మోటార్ సైకిల్‌పై తీసుకెళ్తుండగా ఎస్‌ఈబీ సీఐ సూర్యనారాయణ, ఎస్సై సిహెచ్.గీత, హెడ్‌కానిస్టేబుల్ కోటేశ్వరరావు పట్టుకున్నారు. ఇద్దరినీ అరెస్టు చేశారు. గోతంలో ఉన్న 118 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో బాలాజీ ఇంటి వద్ద మద్యం విక్రయిస్తున్నట్లు వారు అంగీకరించారని ఎస్‌ఈబీ సూపరింటెండెంట్ శౌరి తెలిపారు.



ఈదురుగాలులకు కంభంలో విరిగిపడిన అరటి చెట్లు

భిన్నవాతావరణం

- మధ్యాహ్నం వరకు మండిన ఎండ
- తర్వాత ఈదురు గాలులు, వర్షం
- పలుచోట్ల వడగళ్ల వాన
- కంభంలో 200 ఎకరాల్లో నేలకొరిగిన అరటి చెట్లు

ఒంగోలు, మే 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రత్యేకించి పశ్చిమ ప్రాంతంలో సోమవారం భిన్న వాతావరణం నెలకొంది. మధ్యాహ్నం వరకు ఆప్రాంతంలో ఎండలు మండిపోయాయి. ఆతర్వాత ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. మబ్బులుకమ్మి గాలులతోపాటు వర్షం కురిసింది. పలుచోట్ల ఒక మోస్తరు వాన పడింది. గాలుల తీవ్రతతో అక్కడక్కడా నష్టాలు కూడా సంభవించాయి. జిల్లాలో దాదాపు నెలరోజులుగా ఎండలు మండుతున్నాయి. వారం నుంచి తీవ్రత మరింత పెరిగింది. పశ్చిమప్రాంతం నిప్పులకొలిమిలా మారుతోంది. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆప్రాంతంలోని అత్యధిక మండలాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 42నుంచి 46 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. చాలాచోట్ల సోమవారం మధ్యాహ్నం మూడు గంటల వరకూ కూడా ఎండల తీవ్రత అలాగే ఉంది. ఆతర్వాత ఒక్కసారిగా వాతావరణంలో మార్పు వచ్చింది. ఆకాశంలో మబ్బులు పట్టి చల్లబడటంతోపాటు పెద్దఎత్తున గాలులు వీచాయి. ఆతర్వాత వర్షం కురిసింది. కంభం, బేస్తవారపేట, పామూరు, కురిచేడు, కనిగిరి, గిద్దలూరు, వెలిగండ్ల, హనుమంతునిపాడు, దోర్నాల, తర్లుబాడు, సీఎస్‌పురం, మార్కాపురం, పుల్లలచెరువు, అర్ధవీడు, పొదిలి తదితర మండలాల్లో ఆ పరిస్థితి ఉంది. కొన్నిచోట్ల జల్లులు పడగా, మరికొన్ని చోట్ల ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. కంభం, బేస్తవారపేట మండలాల్లో వడగండ్ల వాన పడింది. కాగా కంభం ప్రాంతంలో ఈదురుగాలులకు దాదాపు 200 ఎకరాల్లో అరటి చెట్లు నేలకొరిగాయి. సుమారు రూ.4 కోట్ల మేర రైతులకు నష్టం వాటిల్లినట్లు సమాచారం. జిల్లాలోని తూర్పు ప్రాంతంలో మధ్యాహ్నం వరకూ ఎండ తీవ్రత అధికంగా ఉన్నప్పటికీ ఆ తర్వాత వాతావరణం చల్లబడింది.

నేటి నుంచి టీచర్ల సర్వీసు క్రమబద్ధీకరణ

- ప్రతిపాదనల పరిశీలనకు ఆరు ప్రత్యేక బృందాలు ఏర్పాటు

ఒంగోలు (విద్య), మే 6 : జిల్లాలో డీఎస్సీ ద్వారా ఎంపికై ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వారి సర్వీసు క్రమబద్ధీకరణ ప్రక్రియ మంగళవారం నుంచి ప్రారంభంకానుంది. అందుకు అవసరమైన ఏర్పాట్లను స్థానిక సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు కార్యాలయంలో చేశారు. టీచర్ల క్రమబద్ధీకరణ ప్రతిపాదనలను పరిశీలించేందుకు ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందంలో హైస్కూల్ హెచ్‌ఎం ఒకరు, స్కూలు అసిస్టెంట్ ఒకరు, డీఈవో కార్యాలయ సిబ్బంది ఒకరు ఉన్నారు. జిల్లాలో డీఎస్సీ ద్వారా ఎంపికై ఇప్పటి వరకూ సర్వీసు క్రమబద్ధీకరణ కాని సుమారు 600 మంది టీచర్ల సర్వీసులను రెగ్యులరైజేషన్ చేయనున్నారు. ఈనెల 10వతేదీ వరకు ఈ ప్రక్రియ కొనసాగనుంది.

టీడీపీ శ్రేణుల జోలికి వెళ్లొద్దు!

- పోలీసులకు హైకోర్టు ఆదేశం
- జీజీహెచ్ ఘటనలో కేసులు నమోదైన వారికి ఊరట

ఒంగోలు (కార్పొరేషన్), మే 6 : ఒంగోలు జీజీహెచ్‌లో గతనెల 10న చోటుచేసుకున్న ఘర్షణకు సంబంధించి కేసులు నమోదైన టీడీపీ శ్రేణులకు ఊరట లభించింది. వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు పోలీసులను ఆదేశించింది. ఒంగోలు సమతా నగర్‌లో టీడీపీ శ్రేణులపై వైసీపీ మూకలు దాడి చేయడం, అనంతరం జీజీహెచ్‌లో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకున్న విషయం విదితమే. ఈనేపథ్యంలో జీజీహెచ్‌లో ఘర్షణకు సంబంధించి పోలీసులు 50 మంది టీడీపీ కార్యకర్తలపై కేసులు నమోదు చేశారు. అయితే అవి అక్రమమని, ఈనెల 13న జరిగే పోలింగ్‌లో తాము పాల్గొనకుండా ఉండేందుకు కుట్రపూరితంగా ఈ కేసులు నమోదు చేశారని టీడీపీ నేతలు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం ఈ కేసులకు సంబంధించి టీడీపీ శ్రేణుల జోలికి వెళ్లవద్దని, ఎలాంటి అరెస్టులు చేయవద్దని పోలీసులను ఆదేశించింది.

శిద్దా ఇంట్లో దోపిడీకి ప్రయత్నించింది మైనర్లు

- ఆతర్వాత బెదిరింపు లేఖ
- రూ.7కోట్లు డిమాండ్
- పోలీసుల అదుపులో ముగ్గురు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ

వివరాలు లోపలి పేజీల్లో..



వైసీపీ కార్యకలాపాలు జరుగుతున్న కళాశాల ఇదే

లోగుట్టు వారిద్దరికే ఎరుక

- వైసీపీ తెరచాటు కార్యకలాపాలకు అడ్డాగా కళాశాల
- దానిచుట్టూ కట్టుదిట్టమైన పహారా
- కన్నెత్తి చూడని అధికార యంత్రాంగం
- పొదిలిలో ఎన్నికల ప్రక్రియ అపహాస్యం

పొదిలి, మే 6 : అధికార వైసీపీ తెర చాటు కార్యకలాపాలకు ఆ కళాశాల అడ్డాగా మారింది. నిత్యం పదుల సంఖ్యలో వాహనాల రాకపోకలతో హడావుడిగా మారింది. బహిరంగంగా కార్యకలాపాలు జరుగుతున్నప్పటికీ అధికార యంత్రాంగం చోద్యం చూస్తోంది. దీంతో పట్టణంలో ఎన్నికల ప్రక్రియ అపహాస్యమవుతోంది. వైసీపీ ఒంగోలు పార్లమెంట్, మార్కాపురం అసెంబ్లీ అభ్యర్థులు గత రెండునెలల నుంచి పొదిలి కేంద్రంగా రాజకీయ కార్యకలాపాలకు శ్రీకారం చుట్టారు. ఒంగోలు-నంద్యాల రహదారిలోని ఒక లాడ్జిని కేంద్రంగా మార్చుకొని సొంత సైన్యాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఒక డిగ్రీ కళాశాల వేదికగా ఎన్నికల కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ప్రత్యేక రక్షణ ఏర్పాటు చేసి అందులోకి అనుమతి లేకుండా చీమకూడా దూరలేని పరిస్థితులను ఏర్పాటు చేసుకున్నారు. దీంతో ఆ కళాశాలలో అసలేం జరుగుతోందోనన్న సందేహాలు సర్వత్రా వ్యక్తమౌతున్నాయి. ఒక రిటైర్డ్ పోలీస్ అధికారి నేతృత్వంలో విశ్రాంత ఉద్యోగులను బృందంగా ఏర్పాటు చేసుకొని అక్కడ కార్యకలాపాలు సాగిస్తున్నట్లు అధికారులకు తెలిసినప్పటికీ ఆవైపు కన్నెత్తి చూసే సాహసం చేయలేక పోతున్నారు. ఇటీవల పట్టణంలో రాజీనామాలు చేసిన ఉత్సాహవంతులైన వలంటీర్లను తమ రాజకీయ కార్యకలాపాల కోసం మౌఖిక ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేసుకున్నట్లు సమాచారం. వారికి మంచి ప్యాకేజ్ కూడా ఇస్తున్నట్లు తెలిసింది. వారి ద్వారానే ఓటర్లకు నగదు, తాయిలాలు చేరవేస్తున్నట్లు సమాచారం. ఇటీవల పట్టణంలో మద్యం పంపిణీ జోరుగా సాగుతోంది. అయినప్పటికీ వైసీపీ నేతలు మకాం వేసిన లాడ్జి, కళాశాలలో జరిగే కార్యకలాపాలపై ఎన్నికల అధికారులు నిఘా పెట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది.

సూపర్ సిక్స్‌తో ప్రతి ఒక్కరికీ సంక్షేమం

- టీడీపీ కూటమి ఒంగోలు అభ్యర్థి దామచర్ల
- రోడ్‌షోకు ప్రజల నుంచి విశేష స్పందన

ఒంగోలు(కార్పొరేషన్), మే 6: అన్ని వర్గాల సంక్షేమానికి దృష్టిలో ఉంచుకుని టీడీపీ కూటమి ప్రకటించిన సూపర్‌సిక్స్ మేనిఫెస్టోతో ప్రతి ఒక్కరికీ ప్రయోజనం లభిస్తుందని కూటమి ఒంగోలు అభ్యర్థి దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. సోమవారం నగరలోని 14, 15, 38,43,44, 45, డివిజన్ పరిధిలో దామచర్ల ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాలు రాష్ట్ర ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా మారుతాయన్నారు. వైసీపీ పాలనలో ప్రజలకు ఆర్థిక కష్టాలు తప్ప అభివృద్ధి శూన్యమన్నారు. ఒక్క చాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చి నవరత్నాలు అంటూ అందరినీ మోసం చేశారని విమర్శించారు. సైకో జగన్ పాలనకు శాశ్వతంగా ఫుల్‌స్టాప్ పెట్టాలన్నారు చంద్రబాబు అధికారంలోకి వస్తేనే యువత, మహిళలకు ఉపాధి, ఉద్యోగ, అవకాశాలు, వడ్డీ లేని రుణాలు లభిస్తాయని తెలిపారు. విజన్ కలిగిన సీనియర్ నాయకుడు చంద్రబాబు ముఖ్యమంత్రిగా కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. 2014 ఎన్నికలలో తనను ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజల రుణం తీర్చుకోలేనిదన్నారు. తనపై నమ్మకముంచి గెలిపించినందుకు రూ. 2600కోట్లతో నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశానని గుర్తు చేశారు. ఈనెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి దామచర్లకు ఘన స్వాగతం లభించింది. కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్, బీజేపీ నేత యోగయ్యయాదవ్, కార్యకర్తలు, నాయకులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



కర్నూలురోడ్డులో దామచర్ల రోడ్‌షోకు భారీగా హాజరైన ప్రజలు, శ్రేణులు



ప్రజలకు నమస్కరిస్తున్న దామచర్ల, పక్కన రియాజ్, యోగయ్యయాదవ్

దామచర్లకు బ్రహ్మరథం

టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్‌కు ప్రజాభిమానం వెల్లువెత్తింది. సోమవారం సాయంత్రం స్థానిక 38, 43, 44, 45 డివిజన్‌లలో ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్ షో నిర్వహించారు. కర్నూలురోడ్ బైపాస్ సెంటర్ నుంచి మొదలైన రోడ్ షో, శ్రీనగర్ కాలనీ, మారుతీ నగర్, కూచిపూడి రెడ్ల బజారుతోపాటు ఆయా ఆయా కాలనీల్లో కొనసాగింది. దీంతో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని దామచర్లకు ఘన స్వాగతం పలికారు. దీంతో పేర్నమిట్ట వైపు వెళ్ళే కర్నూలు రోడ్లల జనసందోహంతో కిక్కిరిసిపోయి ట్రాఫిక్ స్తంభించింది. దీంతో వెల్లువెత్తిన అభిమానం మధ్య దామచర్ల రోడ్‌షో సాగింది.

చెరువుకొమ్ముపాలెంలో వైసీపీ నుంచి తెలుగుదేశంలో చేరిక


నగర పరిధిలోని 18వ డివిజన్ చెరువుకొమ్ముపాలెంలో వైసీపీని వీడి పలువురు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ మేరకు సోమవారం టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్ధన్ నివాసంలో జరిగిన కార్యక్రమంలో సుమారు 70 మంది పైగా టీడీపీలో చేరగా వారికి జనార్దన్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో గోనుగుంట శేషారావు, బీసీసెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పెళ్ళూరు చినవెంకటేశ్వర్లు, నగరపార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ గుమ్మళ్ళపు వెంకటేశ్వర్లు, తాటిపర్తి చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.



చెరువుకొమ్ముపాలెంవాసులతో దామచర్ల

11న ఒంగోలుకు చంద్రబాబు

- ఇక్కడే ఎన్నికల ప్రచార ముగింపు సభ
- నగరంలో రోడ్‌షో
- నేడు దర్శికి పవన్‌కల్యాణ్
- ముమ్మరంగా సాగుతున్న కూటమి అభ్యర్థుల ప్రచారం
- టీడీపీకి జైకొడుతున్న ఉద్యోగులు
- మరింత జోష్‌లో తెలుగు తమ్ముళ్లు





ఒంగోలు, మే 6 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఈనెల 11న ఒంగోలుకు రానున్నారు. చివరి ప్రచార కార్యక్రమాన్ని ఆయన ఇక్కడ నిర్వహించనున్నారు. ఆమేరకు ఒంగోలు అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి దామచర్ల జనార్దన్‌కు సమాచారం అందింది. తదనుగుణంగా ఏర్పాట్లు చేసుకోవాలన్న అధిష్ఠానం సూచనలతో దామచర్ల భారీ రోడ్‌షో, సభ నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటి వరకు అందిన సమాచారం మేరకు.. 11వతేదీ మధ్యాహ్నానికి చంద్రబాబు ఒంగోలు చేరుకొంటారు. సాయంత్రం మూడు గంటల నుంచి నగరంలో రోడ్‌షో నిర్వహించి ముగింపులో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. అదేరోజున చంద్రబాబుతోపాటు జనసేన అధినేత పవన్‌కల్యాణ్ కూడా ఒంగోలుకు వచ్చే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతున్నప్పటిపై దానిపై స్పష్టత రాలేదు. అయితే ఒంగోలు ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి కోరిక మేరకు మూడు రోజుల క్రితం గిద్దలూరులో పర్యటించిన పవన్ కల్యాణ్.. మంగళవారం దర్శికి రానున్నారు. ఉదయం 10 గంటలకు దర్శిలో జరిగే సభలో ఆయన ప్రసంగిస్తారు. అక్కడి టీడీపీ అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మికి సంబంధించిన పార్టీ ముఖ్యులు ఏర్పాట్లపై దృష్టి సారించారు. హెలిప్యాడ్, ఇతర ఏర్పాట్లను స్థానిక పోలీసు అధికారులు సోమవారం సాయంత్రం పరిశీలించారు.

ప్రచార హోరు.. చేరికల జోరు..

జిల్లాలో టీడీపీ అభ్యర్థుల ఎన్నికల ప్రచారం సోమవారం కూడా ముమ్మరంగా సాగింది. ఉదయం ఏడు నుంచి రాత్రి పది గంటల వరకూ విరామం లేకుండా మండుతున్న ఎండలను సైతం లెక్క చేయకుండా అభ్యర్థులు రోడ్‌షోలు నిర్వహించారు. వారికి మద్దతుగా కుటుంబ సభ్యులు ఇంటింటికీ తిరిగి ఓటర్లను కలిశారు. అదేసమయంలో పలుచోట్ల వైసీపీ నుంచి భారీగా టీడీపీలోకి చేరికలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ఎన్నికల విధుల్లో భాగస్వాములవుతున్న ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ జరుగుతుండగా అత్యధికశాతం మంది టీడీపీకి ఓటు చేస్తున్నట్లు బహిరంగ చర్చ జరుగుతోంది. వైసీపీ అభ్యర్థులు పెద్దఎత్తున డబ్బు ఇచ్చేందుకు చేస్తున్న ప్రయత్నాలు బెడిసికొడుతున్నాయి. ఉద్యోగులు వైసీపీ ఓటమే లక్ష్యంగా ఓటు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఆ ప్రభావంతో టీడీపీ శ్రేణులు మరింత ఉత్సాహంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నాయి.



ప్రజలకు అభివాదం చేస్తున్న ఎంపీ మాగుంట

టీడీపీ అధికారంలోకి రాగానే

వెలిగొండ ప్రాజెక్టు పూర్తి

- కూటమి ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డి

పుల్లలచెరువు, మే 6: టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే వెలిగొండను పూర్తి చేసి ఈ ప్రాంత రైతాంగ చిరకాల కోరికను తీరుస్తామని టీడీపీ కూటమి ఒంగోలు ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. సోమవారం పుల్లలచెరువు మండలం మల్లాపాలెం, వెంకట రెడ్డిపల్లి, రాచకొండ, వెంకటరెడ్డిపల్లె, ఉమ్మడి వరం గ్రామాల్లో టీడీపీ కూటమి అభ్యర్థి ఎరిక్షన్‌బాబుతో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వెలిగొండ ప్రాజెక్టు పనుల్లో టీ5కు రాష్ట్ర ప్రభుత్వం రూ.83 కోట్లతో బూటకపు జీవో ఇచ్చి రైతుల ఆశలుపై నీళ్లు చల్లారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే టీ5 పనులు మొదలు పెడతామన్నారు. ఈ ప్రాంత వాసుల చిరకాల కోర్కెైన మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేస్తామన్నారు. రాచకొండ పంచాయతీ ఉమ్మడివరంలో గ్రామ సచివాలయం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పయ్యావుల ప్రసాద్, నాయకులు రెంటపల్లి సుబ్బారెడ్డి, కాకర్ల కోటయ్య, శనగా నారాయణరెడ్డి, మేడికొండ లక్ష్మీనారాయణ, కుమార్, గజ్వేల్లి భాస్కర్, మునగాల రామిరెడ్డి, గోగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఉప్పల హనుమంతు, ఎంపీటీసీ రాధ,కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ ప్రచారంలో


తలమునకలైన ఉద్యోగులు



బయనపల్లె ప్రచారంలో జవాన్ నరసింహులు

గిద్దలూరు టౌన్, మే 6 : ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల నేపథ్యంలో పార్టీలకు, వారి కార్యక్రమాలకు దూరంగా ఉండాలనేది ఎన్నికల కమిషన్ దిశ నిర్దేశాలు జారీ చేసింది. అయినప్పటికీ కొంత మంది ఉద్యోగులు వారి అభిమానాన్ని పోగొట్టుకో లేక వారి ఇష్టమైన పార్టీల వెంట తిరుగుతున్నారు. తాజాగా గిద్దలూరు మండలం నరవ పంచాయతీ పరిధిలోని నరవ బయన పల్లె గ్రామంలో వైసీపీ అభ్యర్థి కుందూరు నాగార్జునరెడ్డి ప్రచార కార్యక్రమం నిర్వహిస్తుండగా ఆర్మీ ఉద్యోగి చింతగుంట్ల నరసింహులు ప్రచారంలో పాల్గొని తన అభిమానాన్ని చాటుకున్నాడు. ఎన్నికల పరిస్థితులు తెలుసుకుని కూడా అతను ప్రచారంలో పాల్గొనడం విశేషం. ఇదిలావుండగా గిద్దలూరు పట్టణం 17వ వార్డులో వలంటీర్‌గా పని చేస్తున్న పల్లె కిశోర్‌రెడ్డి వైసీపీ ప్రచారంలో కూడా అదే విధంగా పాల్గొన్నాడు. వలంటీర్‌గా పనిచేస్తూ ఒక పార్టీకి వంత పలుకడం సబబు కాదని తెలిసి కూడా అతను ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి వెంట ప్రచారంలో పాల్గొన్నాడు.

ఎన్నికల ప్రచారంలో ఫీల్డ్ అసిస్టెంట్



నాయుడుపల్లెలో ఫీల్డ్ అసిస్టెంట్ సుబ్బారావు

మార్కాపురం : మండలంలోని నాయుడు పల్లె పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ మన్నెం సుబ్బారావు ఆదివారం రాత్రి వైసీపీ అభ్యర్థి అన్నా రాంబాబు నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. పంచాయతీలోని నాయుడుపల్లె, మన్నెంవారి పల్లె గ్రామాల్లో జరిగిన ప్రచార కార్యక్రమం ప్రారంభం నుంచి ముగిసే వరకు అన్నీ తానై ముందుండి నడిపించాడు. వైసీపీ అభ్యర్థికి ఓటు వేసి మద్దతు తెలపకుంటే భవిష్యత్తులో పంచాయతీలో జరిగే ఉపాధిహామీ పనుల్లో మీకు ఇబ్బందులు తప్పవని హెచ్చరించాడు. దీంతో ప్రచార కార్యక్రమంలో తప్పక పాల్గొనాల్సి వచ్చిందని ఉపాధిహామీ కూలీలు వాపోయారు.

ఈదురు గాలుల బీభత్సం

- అరటి తోటలకు భారీ నష్టం



దెబ్బతిన్న అరటి తోటను చూపిస్తున్న వెంకటరావు

కంభం, మే 6 : కంభంలో సోమవారం వీచిన ఈదురు గాలులు, భారీ వర్షానికి సుమారు 200 ఎకరాలకు పైగా అరటి చెట్లు నేలకొరిగాయి. దీంతో రూ.4 కోట్లమేర నష్టం వాటిల్లినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అకాల వర్షానికి గెలలకు వస్తున్న చెట్లు మొత్తం మొదలుతో సహా నేల కొరగడంతో ఇప్పటివరకు పెట్టిన పెట్టుబడులన్నీ నేలపాలైనట్లు రైతులు తెలిపారు. ఎకరాకు 2లక్షల వరకు పెట్టుబడులు పెట్టామని, ప్రస్తుతం చెట్లు గెలలు వచ్చే సమయంలో అకాలవర్షంతో చెట్లన్నీ నేలకొరిగి రూ.4 కోట్లమేర నష్టం వాటిల్లినట్లు కంభంలోని మునగాల వెంకటరావు రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. అధికారులు నేలకొరిగిన పంటలను పరిశీలించి నష్టపరిహాం అందించాలని కోరుతున్నారు.

వైసీపీ దౌర్జన్యపాలనకు అంతం పలకాలి

- టీడీపీ కూటమి ఎస్‌ఎన్‌పాడు అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్
- చంద్రన్నతోనే సంక్షేమరాజ్యం సాధ్యమని వెల్లడి



చంద్రపాలెంలో మహిళకు నమస్కరిస్తున్న విజయ్‌కుమార్



నాగులుప్పలపాడులో ప్రచారం చేస్తున్న బీఎన్

సంతనూతలపాడు, మే 6: రాష్ట్రంలో వైసీపీ దౌర్జన్యపాలనకు అంతం కావాలని, టీడీపీ సంక్షేమపాలన కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని టీడీ కూటమి అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని చంద్రపాలెం, గంగవరం, బొడ్డువారిపాలెం, చిలకపాడు గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్ మాట్లాడుతూ వైసీపీ అధినేత లాగే నాయకులు కూడా నియంతల్లా వ్యవహరించడంతో ప్రజలు వైసీపీ పట్ల తీవ్ర అసహనంతో ఉన్నారని చెప్పారు. ప్రజావ్యతిరేక పాలన ఉంటే ప్రభుత్వాలు నిలబడవన్నారు. ప్రజలు చంద్రబాబు గెలుపుకోసం చూస్తున్నారని, ఆయన అందించే సంక్షేమపాలన కోసం ఆశతో ఉన్నారని పేర్కొన్నారు. ప్రజల ఆశలన్నీ నెరవేరే రోజు కొద్దిరోజుల్లోనే ఉందన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా తేనేటి కృష్ణప్రసాద్‌ను సైకిల్ గుర్తుపై ఓటువేసి గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే యామినిబాల, తన్నీరు శ్రీను, దుంపా కోటిరెడ్డి, నరసింహారావు పాల్గొన్నారు.

కాగా సంతనూతలపాడు ఎస్టీకాలనీలో సోమవారం రాత్రి ఎస్సీ సెల్ ప్రధానకార్యదర్శి ఆర్.అంకారావు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేగా బీఎస్.విజయ్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ కరపత్రాలను అందజేశారు.

తెలుగుదేశంతోనే రాష్ట్రాభివృద్ధి

నాగులుప్పలపాడు: తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని టీడీపీ కూటమి అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం నాగులుప్పలపాడులో నిర్వహించిన బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు కార్యక్రమంలో బీఎస్ పాల్గొన్నారు. తొలుత తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుంచి బస్టాండ్ కూడలి, ఆంజనేయస్వామి విగ్రహం, సచివాలయం మీదుగా దళిత కాలనీలో ప్రచారం సాగింది. పార్టీ శ్రేణులు, మహిళలు పూలవర్షం కురిపిస్తూ, హారతులిస్తూ విజయ్‌కుమార్‌కు ఘన స్వాగతం పలికారు. పలు దేవాలయాల్లో బీఎస్ నాయకులు కొబ్బరికాయలు కొట్టి పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో హత్యలు, మాఫియాలు, అల్లర్లతో మరో బిహార్‌లాగా మారిందన్నారు. ప్రజల సమస లను గాలికొదిలేసి దోచుకుని దాచుకోవడమే ధ్యేయంగా పాలకులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో ఓటుతో వైసీపీని ఇంటికి సాగనంపాలన్నారు. నాగులుప్పలపాడులో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి ఇంటింటికి కుళాయిని అందిస్తామన్నారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా, తేనేటి కృష్ణప్రసాద్‌ను ఎంపీగా గెలిపించాలని కోరారు. మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్యచౌదరి మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలతో మహిళలకు ఆర్థిక భరోసా కలుగుతుందన్నారు. ఇంటింటి ప్రచారం నిర్వహించి కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే యామినిబాల, పార్టీ మండల అధ్యక్షులు తేళ్ళ మనోజ్‌కుమార్, షేక్ ఖాజావలి, ఇంటూరి శ్రీనివాసరావు, మారెళ్ళ వెంకటశేషయ్య, మారెళ్ళ కిరణ్ కుమార్, దివి పున్నారావు, గుమ్మడి సాయిబాబా, కాకర్ల లక్ష్మీవరప్రసాద్, ఉన్నం వెంకట్రావు, చుండూరి నాగేశ్వరరావు, ఉప్పుటూరి హరినాథ్, ఉప్పుటూరి ఝాన్సీ, గుంపుల సుబ్బారావు, జనసేన మండల అధ్యక్షులు భూపతి మురళీ, ఎంపీటీసీ శివకృష్ణ, కొంజేటి ధనూష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

రెండోసారి..దొరికిపోయారు..!

- పోలీసులకు మైనర్ దొంగల సవాల్
- మాజీ మంత్రి శిద్దాకు బెదిరింపు లేఖ
- నిందితులు ముగ్గురూ టెన్త్ పరీక్షలు రాసిన విద్యార్థులు
- సీసీపుటేజీ ఆధారంగా పట్టివేత
- వివరాలను వెల్లడించిన ఎస్పీ



కేసు వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్

ఒంగోలు(క్రైం), మే 6: దోపిడీ దొంగలు పోలీసులకు సవాల్ విసిరారు. మాజీ మంత్రి శిద్దా రాఘవరావు ఇంట్లో దోపిడీకి విఫలయత్నం చేసి పరారైన వారే తిరిగి ఆయన ఇంట్లో బెదిరింపు లెటర్ వేసి సోమవారం పోలీసులకు దొరికిపోయారు. గతనెల 26 రాత్రి ఇరువురు ఆగంతుకులు కత్తులతో ఒంగోలులోని లాయర్‌పేటలో గల శిద్దా ఇంట్లోకి గోడ దూకి ప్రవేశించారు. వాచ్‌మెన్‌పై కత్తితో దాడికి యత్నం చేశారు. అయితే పక్కనే టేబుల్ పక్కన నిద్రపోతున్న గన్‌మెన్ లేవడంతో వారు వాచ్‌మన్‌ను వదిలేసి పారిపోయారు. అయితే 27వతేదీ మధ్యాహ్నం వరకు విషయాన్ని రహస్యంగా ఉంచిన శిద్దా కుటుంబ సభ్యులు ఆ తర్వాత పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఏఎస్పీ(క్రైమ్స్) రంగంలోకి దిగారు. అప్పటి నుంచి పోలీసు బృందాలు ఆగంతుకుల కోసం వెతికినా ప్రయోజనం లేదు. మరలా పదిరోజుల తర్వాత సోమవారం ఉదయం బైక్‌పై ఓ యువకుడు శిద్దా ఇంటికి ఉదయం పది గంటలకు వచ్చి బెదిరింపు లెటర్‌ను ఇంట్లో విసిరేసి పరారయ్యాడు. ఆ లెటర్‌లో.. మీ ఇంటి బాత్‌రూంలో బాంబులు పెట్టాం. అవి పేల్చివేస్తాం. అంతేకాదు మేం 15 మంది బ్యాచ్ ఉన్నాం. మీ కుటుంబాన్ని అంతం చేయాలి అనుకున్నాం. అయితే నాకు మధ్యాహ్నంలోపు పోలీసులకు చెప్పకుండా రూ.7కోట్లు నగదు పంపించు' అని రాశారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు ఆగంతుకుల కోసం గాలింపు చేపట్టారు.

సీసీ పుటేజీ పట్టించింది..

విషయం తెలుసుకున్న ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్, ఏఎస్పీ క్రైమ్స్ శ్రీధరరావును అప్రమత్తం చేశారు. దీంతో పోలీసులు పది బృందాలుగా ఏర్పడి దర్యాప్తు ప్రారంభించారు. బైక్ ఎటు నుంచి ఎటు వెళ్లింది అనే కోణంలో సీసీ పుటేజీ ఆధారంగా వెతుకులాట ప్రారంభించి ఆరు గంటలలో నిందితులను పోలీసులు పట్టుకున్నారు.

నగదు కోసం ముందస్తు ప్రణాళిక

నగరంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి పరీక్షలు రాసిన ముగ్గురు బాలురు నగదు కోసం ఈ పథకం రూపొందించారు. తొలుత ఇరువురు కత్తులతో శిద్దా ఇంట్లో దిగి వాచ్‌మెన్‌పై దాడికి యత్నం చేశారు. అయితే అక్కడ ఉన్న సెక్యూరిటీ అప్రమత్తం కావడంతో ప్రమాదం తప్పింది. తిరిగి బెదిరింపు లేఖ ఇంట్లో వేసి పోలీసులకు పట్టుబడ్డారు.

వివరాలు వెల్లడించిన ఎస్పీ

శిద్దా ఇంట్లో దోపిడీకి యత్నించి, సోమవారం బెదిరింపు లేఖ వేసిన ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామని ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ పేర్కొన్నారు. నిందితులు మైనర్లు కావడంతో జువైనల్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. తల్లిదండ్రులు కూడా వారి పిల్లల ప్రవర్తన, వారు ఎవరెవరితో స్నేహం చేస్తున్నారు, ఎక్కడికి వెళ్తున్నారు, ఏమి చేస్తున్నారు వంటివి గమనించాలని కోరారు. ఆరు గంటల వ్యవధిలోనే నిందితులను పోలీసులు పట్టుకున్నారని వివరించారు. ఈ ఘటన నేపథ్యంలో జిల్లాలో వీవీఐపీలకు భద్రత పెంచుతున్నామని చెప్పారు. ఈ సందర్భంగా ఏఎస్పీ శ్రీధరరావు, డీఎస్పీ కిషోర్‌బాబు, సీఐ ఎం.లక్ష్మణ్, సీసీఎస్ సీఐలు విజయకృష్ణ, మాతంగి శ్రీనివాసరావు, ఎస్సై కిషోర్ బాబునిలను ఎస్పీ అభినందించారు.

పింఛన్ కోసం వృద్ధురాలి ఇక్కట్లు



సచివాలయం వద్దకు వచ్చిన నరసమ్మ

పొదిలి, మే 6 :పింఛన్‌ల పంపిణీలో ప్రభుత్వం అనుసరించిన విధానం ఓ పండుటా కును తీవ్ర ఇక్కట్లకు గురి చేసింది. కొంత మందికి బ్యాంక్‌లో జమచేశామని మిగిలిన వారికి ఇళ్లకు వచ్చి ఇస్తామని చెప్పడంతో లబ్ధిదారులు ఎటువైపు వెళ్లాలో అర్థంకాక అయోమయానికి గురయ్యారు. బ్యాంక్‌లో జమకాలేదని బ్యాంక్ అధికారులు చెబుతుండగా తమ జాబితాలో పేరులేదంటూ సచివాలయ సిబ్బంది చెబుతున్నారు. దీంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. తీరా ఐదు రోజులకే యాప్ ముగించారని పంపిణీ నిలిపేశారు. దీంతో పింఛన్ అందని ఓ వృద్ధురాలు కన్నీటిపర్యంతమవతున్నారు. పొదిలికి చెందిన మామిళ్లపల్లి నరసమ్మ పింఛన్‌కోసం బ్యాంక్‌కు వెళ్లింది. అక్కడ నగదు జమకాలేదని బ్యాంక్ అధికారులు చెప్పారు. ఆ తరువాత సచివాలయం అధికారులను సంప్రదించింది. శనివారం రెండవ లిస్ట్‌లో మీ పేరు వచ్చిందని సూచించారు. శనివారం పింఛన్ కోసం వెళితే మార్కాపురంలో జరుగుతున్న బ్యాలెట్ ఓటింగ్‌లో పాల్గొనేందుకు అధికారులు వెళ్లారు. మరుసటి రోజు ఆదివారం కావడంతో సోమవారం సచివాలయానికి వెళ్లారు. యాప్ క్లోజ్ చేశారని పింఛన్ ఈ నెల లేదనే సమాధానం చెప్పడంతో పింఛన్ రాని వృద్ధులు ఒక్కసారిగా అవాక్కయ్యారు.

రోప్ స్కిప్పింగ్‌లో విద్యార్థిని ప్రతిభ



మొదటి బహుమతి సాధించిన మీనాక్షి

త్రిపురాంతకం, మే 6: నేపాల్‌లో జరిగిన దక్షిణాసియా స్థాయి రోప్ స్కిప్పింగ్‌లో మండలంలోని సోమేపల్లికి చెందిన మల్లీశ్వరి చిల్లీస్ కంపెనీ అధినేత పల్లెల ఇంద్రశేఖర్‌రెడ్డి కుమార్తె మీనాక్షి ప్రథమ స్థానం సాధించి బంగారు పతకాన్ని అందుకుంది. కాగా పతకం సాధించిన నేపథ్యంలో గ్రామస్థుల ఆధ్వర్యంలో సోమవారం చిల్లీస్ కంపెనీలో సిబ్బంది కేక్ కట్‌చేసి మీనాక్షికి శుభాకాంక్షలు తెలిపారు.

బీఎన్ కోసం కూటమి శ్రేణుల ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

నాగులుప్పలపాడు, మే 6 : టీడీపీ కూటమి సంతనూతలపాడు నియోజకవర్గ అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ ఉప్పుగుండూరులో తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉప్పుగుండూరులోని దక్షిణం బజారులో సోమవారం రాత్రి గ్రామపార్టీ అధ్యక్షులు కాట్రగడ్డ చంద్రబాబు ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటికి తిరుగుతూ సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. సైకిల్‌గుర్తుపై ఓటు వేసి విజయ్‌కుమార్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు తేళ్ళ మనో జ్‌కుమార్, జనసేన మండల అధ్యక్షులు భూపతి మురళీ, ఐటీడీపీ మండల అధ్యక్షులు బెల్లం వెంకటేశ్వర్లు, కనగాల శ్రీనివాసరావు బి.సెల్వం, తెలగతోటి జాన్సన్, జంజనం సుబ్బయ్య శ్రీకాంత్, రామకృష్ణ, పోట్లూరి నాగమల్లే శ్వరరావు, కుంబా పార్వతి, మసిముక్కు భాస్కర్, పెంట్యాల కోటి, పెంట్యాల శ్రీనివాసరావు, ఇంటూరి శ్రీనివాసరావు, సుబ్బయ్యనాయుడు, స్వర్ణ కిషోర్ పాల్గొన్నారు.

వైసీపీ నుంచి తెలుగుదేశంలో చేరిక



బీఎన్ సమక్షంలో పార్టీలో చేరిన నాయకులు

మద్దిపాడు, మే 6: మద్దిపాడులోని ఘడియపూడి ఎస్సీకాలనీకి చెందిన పలువురు వైసీపీ నాయకులు సోమవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. గ్రామానికి చెందిన బోడెపోగు శరత్, బోడెపోగు కొండయ్య బోడెపోగు చందు, పాటిబండ్ల రాజీవ్, మన్నవ ఏలీయాలు మాజీ ఎంపీపీ అప్పల కుమార్‌స్వామి ఆధ్వర్యంలో ఒంగోలులో కూటమి అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్‌ను కలిసి పార్టీలో చేరారు. వారికి ఆయన కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా బీఎన్ మాట్లాడుతూ తెలుగుదేశం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మండవ జయంత్ బాబు, దేవబత్తిన ప్రసాద్, మండవ గోపీనాథ్, నర్రా సురేష్‌బాబు పాల్గొన్నారు.

ఓటుహక్కును స్వేచ్ఛగా ఉపయోగించుకోవాలి

మద్దిపాడు, మే 6: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఓటుహక్కును స్వేచ్ఛగా ఉపయోగించుకోవాని ఎస్సై మహేష్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పెద్దకొత్తపల్లి, దొడ్డవరప్పాడు గ్రామాలలో ఓటుహక్కుపై ఆయన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మద్యం, డబ్బు తదితర ప్రలోభాలను ఎవరైనా చూపితే వెంటనే పోలీసులకు సమాచారం అందజేయాలని, గ్రామాల్లో వన్‌సైడ్ ఓటింగ్‌కు ప్రయత్నిస్తే కేసులు నమోదు చేస్తామని చెప్పారు. అవాంఛనీయ సంఘటనలకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

ఘనంగా హరేరామ సంకీర్తన

మద్దిపాడు, మే 6: మద్దిపాడులోని ఘడియపూడి కాలనీలో గల శివాలయంలో సోమవారం హరేరామ సంకీర్తన అత్యంత వైభవంగా జరిగింది. గ్రామానికి చెందిన డాక్టర్ అన్నమనేని విక్రమ్, అన్నమనేని విశ్వనాథం కుటుంబసభ్యులు ఉభయదాతలుగా వ్యవహరించారు. భజన బృందాలు పలు భక్తిగీతాలను ఆలపించారు. ఈ సందర్భంగా డాక్టర్ విక్రమ్ మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతన ద్వారా మానసిక వత్తిడిని అధిగమించవచ్చన్నారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో అన్నమనేని హరినాథబాబు, చింతల రాంబాబు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మాగుంట రాఘవరెడ్డి రక్తదానం

మార్కాపురం, మే 6: టీడీపీ యువనేత మాగుంట రాఘవరెడ్డి మార్కాపురం ప్రభుత్వ జిల్లా వైద్యశాలలో సోమవారం టీడీపీ నాయకులతో కలిసి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి రక్తం ప్రాణదానంతో సమానమన్నారు. ప్రతి ఒక్కరూ అవకాశ మున్నంతలో రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పోతులను సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

టీడీపీ ఎస్ఎన్‌పాడు నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా పోతుల

టంగుటూరు, మే 6 : సంతనూతలపాడు నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ కోఆర్డినేటర్‌గా కందుకూరు మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావును నియమించారు. బాపట్ల జిల్లా టీడీపీ అధ్యక్షుని ద్వారా ఆదివారం రాత్రి రామారావుకు సమాచారం చేరవేశారు. వెంటనే ఆయన ఒంగోలులో సంతనూతలపాడు టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి విజయకుమార్‌ను కలిశారు. విజయకుమార్ అక్కడే ఉన్న సంతనూతలపాడు నియోజకవర్గ ముఖ్యనాయకులను పరిచయం చేశారు. విషయం తెలియగానే సోమవారం ఉదయం పోతుల ఇంట సందడి వాతావరణం నెలకొంది. ఉదయమే టంగుటూరులోని పలువురు టీడీపీ నాయకులు పోతుల నివాసంలో ఆయన్ని కలిసి అభినందించారు. బొకేలు, దుశ్శాలువాలు, పూలమాలలు, దండలు వేసి పోతులను సత్కరించారు. టంగుటూరు వాణీనగర్ తెలుగుయువత నాయకులు పోలినేని వెంకటేశన్, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు పోతుల నరసింహారావు, టీడీపీ టంగుటూరు పట్టణ అధ్యక్షుడు కామని నాగశ్రీను, పోతుల ముఖ్యఅనుచరులు కసుకుర్తి శ్రీధర్, చిడిపోతు కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు ఉన్నారు.


టంగుటూరు కేంద్రంలో జరుగుతున్న పొగాకు వేలం

పొగాకు గరిష్ఠ ధర కేజీ రూ. 299

టంగుటూరు, మే 6: టంగుటూరులోగల పొగాకు వేలం కేంద్రంలో సోమవారం జరిగిన వేలంలో గరిష్ఠ ధర కిలో రూ. 299 రైతులకు లభించింది. వేలం కేంద్రానికి దావగూడూరు, చింతలపాలెం రైతుల 1,087 పొగాకు బేళ్లను అనుమతించారు. ఇందులో 966 బేళ్ల కొనుగోలు జరుగగా మిగిలిన బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. గరిష్ఠ ధర రూ.299 కాగా కనిష్ఠ ధర రూ. 205 పలికింది. కొనుగోళ్లలో 18 వ్యాపార కంపెనీలు పాల్గొన్నాయి.


ఓటర్ల జాబితా పరిశీలనలో వాణీనగర్ టీడీపీ నాయకులు

ఓటర్ల జాబితా పరిశీలన

టంగుటూరు, మే 6 : టంగుటూరు వాణీనగర్‌లో టీడీపీ నాయకులు సోమవారం ఓటర్ల జాబితా పరిశీలించారు. వీరు దూర ప్రాంతాల్లో ఉండే ఓటర్లుగా గుర్తించారు. విద్యార్థులు, ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను వారు తమ పరిశీలన ద్వారా గుర్తించారు. వెంటనే వారితో ఫోన్‌లో మాట్లాడారు. విధిగా ఓటుకు రావాలని, సైకిల్ గుర్తుకే ఓట్లు వేయాలని దూరప్రాంతాల్లోని ఓటర్లకు సూచించారు. ఓటర్ల జాబితా పరిశీలనలో టీడీపీ నాయకుడు మొలకలపల్లి శ్రీనివాసరావుతోపాటు పలువురు స్థానిక నాయకులున్నారు.

దిగజారిన వైసీపీ పరిస్థితి

టీడీపీలోకి వలసలు
ఎమ్మెల్యే స్వామి సమక్షంలో 30 గిరిజన కుటుంబాలు చేరిక


ఎమ్మెల్యే స్వామి సమక్షంలో పార్టీలో చేరిన మూలగుంటపాడు ఎస్టీ కుటుంబాలు

సింగరాయకొండ, మే 6 : సింగరాయకొండ మండలంలో వైసీపీ పరిస్థితి రోజురోజుకి దిగజారిపోతోంది. పలువురు ఆపార్టీని వీడి టీడీపీలోకి వలసలు వస్తున్నారు. మూలగుంటపాడు పంచాయతీ పరిధిలోని వైసీపీకి చెందిన 30 గిరిజన కుటుంబాలు ఆపారీకి గుడ్‌బై చెప్పారు. టీడీపీ జిల్లా లీగల్‌సెల్ అధ్యక్షుడు సన్నెబోయిన శ్రీనివాసులు ఆధ్వర్యంలో సోమవారం టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలో ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి సమక్షంలో తెలుగుదేశం తీర్థం పుచ్చుకున్నారు. వారికి కండువాలు కప్పి సాదరంగా స్వామి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో గిరిజనులకు అన్ని విధాలుగా అన్యాయం జరిగిందని అన్నారు. తాము కల్యాణ గిరిపుత్రిక పథకం కింద వివాహం చేసుకునే గిరిజన యువతులకి రూ. 50 వేలు ఆర్థిక సహాయం చేశామని గుర్తుచేశారు. వైసీపీ ప్రభుత్వంలో ఆపథకాన్ని రద్దు చేశారని వివరించారు. గ్రామాలలో గత టీడీపీ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి మినహా వైసీపీ నాయకులు తట్టెడు మట్టి కూడా వేయలేదన్నారు. స్థానికంగా నీటి సమస్య ఉందని గిరిజనులు స్వామి దృష్టికి తీసుకెళ్లారు. అధికారంలోకి రాగానే సమస్యను పరిష్కరిస్తా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కిచ్చెంశెట్టి బసవయ్య, వర్మ, నరాల సుధాకర్ పాల్గొన్నారు.

మర్లపాడులో వైసీపీకి బిగ్ షాక్

80 మంది టీడీపీలో చేరిక

టంగుటూరు, మే 6 : మండలంలోని మర్లపాడులో వైసీపీకి బిగ్ షాక్ తగిలింది. స్థానికులు బుర్రా రంగారావు, తిరుపతిస్వామి ఆధ్వర్యంలో 80 మంది వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరంతా టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య వద్ద టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికీ సత్య టీడీపీ కండువాలు కప్పి టీడీపీలోకి ఘనంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా సత్య మాట్లాడుతూ భావితరాల భవిష్యత్ తెలుగుదేశం పార్టీకే సాధ్యమని, కొండపి నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న పనులన్నీ టీడీపీ అధికారంలోకి రాగానే పూర్తి చేస్తామని వారికి హామీ ఇచ్చారు. ఒంగోలు పార్లమెంట్‌కు, కొండపి అసెంబ్లీ స్థానానికి వైసీపీ నుంచి పోటీకి వచ్చిన వలస పక్షులను ఓటు అనే ఆయుధంతో తరిమి కొట్టాలని నియోజకవర్గ ఓటర్లకు పిలుపునిచ్చారు. వైసీపీ నుంచి టీడీపీలో చేరిన ప్రతి ఒక్కరికి టీడీపీలో సముచిత గౌరవం ఉంటుందని, ఈవారం రోజులు అందరూ కష్టపడి పనిచేసి ఎమ్మెల్యే అభ్యర్థిగా డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామిని, ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని సత్య సూచించారు.

వైసీపీని వీడి టీడీపీలోకి..

పొన్నలూరు (కొండపి), మే 6 : పొన్నలూరు మండలం మాలపాడు పంచాయతీ పరిధిలోని లింగంగుంట ఎస్సీకాలనీలో వైసీపీకి చెందిన 20 కుటుంబాల వారు ఆపార్టీని వీడారు. సోమవారం తూర్పునాయుడుపాలెంలో ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి స్వామి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో గోచిపోతుల ఏరిమయ్య, బ్రహ్మయ్య, రాజేష్, అద్దంకి కొండయ్య, ఏసేబు, యాకోబ్, పెరికయ్య, పలు కుటుంబాల వారు ఉన్నారు.


స్వామి సమక్షంలో టీడీపీలో చేరిన లింగంగుంట ఎస్సీకాలనీ వాసులు


టీడీపీలో చేరిన మర్లపాడు వైసీపీ కేడర్‌తో దామచర్ల సత్య

వైసీపీ మైనార్టీ కీలక నాయకులు ఆపార్టీకి గుడ్‌బై

సింగరాయకొండ : సింగరాయకొండలో వైసీపీకి గట్టిషాక్ తగిలింది. ఆపార్టీకి చెందిన మైనారిటీలలో కీలక నాయకులు అధికారపార్టీకి గుడ్‌బై చెప్పారు. సోమవారం రాత్రి మూలగుంటపాడు టీడీపీ కార్యాలయంలో ఆపార్టీ సీనియర్ నేత దామచర్ల పూర్ణచంద్రరావు సమక్షంలో తెలుగుదేశం తీర్థం పుచ్చుకున్నారు. కండువాలు కప్పి ఆయన సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. పార్టీలో చేరిన వారిలో సింగరాయకొండ మాజీ సర్పంచ్, ప్రస్తుత కోఆప్షన్ సభ్యుడు ఎస్‌డీ సర్దార్, 3 సచివాలయ కన్వీనర్ ఖాదర్‌బాషా, వైసీపీ సీనియర్ నాయకుడు షుకూర్, పాశం శ్రీనివాసులు, ఫజుల్, ఏస్కే యాసిన్, పఠాన్ గౌస్‌బాషా, అప్పారావు, కృపారావు, దుర్గారావు, హనుమంతరావు, రామచంద్రయ్య, పలు కుటుంబాలవారు ఉన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు షేక్ సంధానీబాషా, సన్నెబోయిన శ్రీనివాసులు, కూనపరెడ్డి సుబ్బారావు, చిగురుపాటి గిరి. గుదే వెంకటేశ్వర్లు, మల్లికార్జున్, యస్దాని, సుభాన్ తదితరులు పాల్గొన్నారు.


పూర్ణచంద్రరావు సమక్షంలో పార్టీలో చేరిన వైసీపీ నేతలు

ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్ పోలింగ్

చీరాల, మే 6 : వైపే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రక్రియ సోమవారం ప్రశాంతంగా జరిగింది. పీవోలు, ఏపీవోలు 759 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఈఆర్వో సూర్యనారాయణరెడ్డి తెలిపారు. ఆదివారం 882 మంది ఓపీఓలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో ఇప్పటి వరకు మొత్తం 1641 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్న ఈఆర్వో తెలిపారు. ఇదిలావుంటే ఒంగోలు కేంద్రంగా పనిచేస్తున్న పలువురు తమ పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునేందుకు వచ్చినవారికి అవకాశం లేదని అక్కడి పోలింగ్ అధికారులు చెప్పారు. దీంతో వారు ఉసూరుమంటూ వెనుదిరిగారు. కొందరైతే చీరాల నియోజకవర్గంలో నివాసం ఉంటున్న తమకు ఇక్కడే ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవకాశం కల్పించాలని కోరినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఈక్రమంలో తాము ఒంగోలులో పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకునే క్రమంలో తాము చీరాల అసెంబ్లీ అభ్యర్థికి, ఎంపీ అభ్యర్థికి ఓటు వేయాలంటే అక్కడ ఇచ్చే బ్యాలెట్ పేపర్లో ఇక్కడి వారి పేర్లు, గుర్తులు ఉంటాయా అనే సందేహాన్ని వెలిబుచ్చారు. ఒంగోలులో ఓటు హక్కు వినియోగించుకునేవారికి కూడా స్థానిక అభ్యర్థుల పేర్లు, ఎన్నికల గుర్తులు కనిపిస్తాయాని, ఇక్కడ ఏ బ్యాలెట్ పేపర్ ఇస్తారో, అదే విధంగా అక్కడ కూడా బ్యాలెట్ పేపర్ ఉంటుందని, ఎవరినైతే ఎన్నుకోవాలనుకుంటారో, ఆ అభ్యర్థి పేరు ఎదురుగా ఉన్న గుర్తుపై ఓటు వేయాలని అధికారులు తెలిపారు.


ఓటు హక్కు వినియోగించుకునేందుకు క్యూలో ఉన్న పీవోలు, ఏపీవోలు

పర్చూరులో 93 శాతం ఓట్లు పోల్

పర్చూరు : పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగింది. రెండవ రోజు ఆదివారం పోలింగ్ ఆఫీసర్ (పీవో), అదనపు పోలింగ్ అఫీసర్ (ఏపీవో)కు పోస్టల్ బ్యాలెట్ ద్వారా స్థానిక ఎస్ఎఫ్ఎస్ హైస్కూల్‌లో ఎన్నిక నిర్వహించారు. పీవో, ఏపీవోలకు సంబంధించి మొత్తం 387 మంది ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉండగా అందులో 369 మంది ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఆర్వో గంధం రవీందర్ తెలిపారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జరిగిన పోలింగ్‌లో 93శాతం ఓట్లు పోలైనట్లు ఆయన తెలిపారు. ఎలాంటి వివాదాలకు తావులేకుండా పర్చూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీ.శీతారామయ్య నేతృత్వంలో ప్రత్యేక పోలీసు బందోబస్తు నిర్వహించారు.


కలవకూరులో మహిళలకు పథకాలను వివరిస్తున్న గొట్టిపాటి

ప్రజల భూములు కొట్టేసేందుకే ల్యాండ్ టైటిల్ చట్టం

● టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి

అద్దంకి, మే 6 : ప్రజల భూములను కొట్టేసేందుకే జగన్‌రెడ్డి ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను తీసుకొచ్చారని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని కలవకూరు, గుర్రంవారిపాలెంలో సోమవారం రాత్రి గొట్టిపాటి రవికుమార్ ఇంటింటికీ తిరిగి సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ దేశంలో ఇప్పటి వరకు బీజేపీ పాలిత రాష్ట్రాలతో సహా ఏ రాష్ట్రం లాండ్ టైటిల్ యాక్ట్‌ను అమలు చేయలేదని, మరి జగన్ రెడ్డి మాత్రం ఎందుకు తొందర పడ్డారని రవికుమార్ ప్రశ్నించారు. ప్రజల భూములు కబ్జా చేసేందుకే ఈ యాక్ట్ అన్నారు. ఎన్నికలలో ప్రజలను మోసం చేయడానికి చట్టానికి ఇంకా మార్గదర్శకాలు ఇవ్వలేదని నాటకాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు. ల్యాండ్, శాండ్, వైన్, గంజాయి, మైన్, డ్రగ్స్, ఎర్రచందనం, రేషన్ బియ్యం అక్రమ అమ్మకాలతో వైసీపీ నేతలు రూ.8లక్షల కోట్లు కొల్లగొట్టారన్నారు. పాపపు సొమ్మును భూముల్లోకి తరలించడానికి సివిల్ కోర్టులు అడ్డంకిగా ఉన్నాయని, కోర్టుల రక్షణను తొలగించడానికి రెవెన్యూ అధికారులకు సివిల్ కోర్టు అధికారాలను కట్టబెడుతూ ల్యాండ్ టైటిల్ చట్టం తెచ్చారన్నారు. జగన్ భూ మాఫియా లక్షలాది ఎకరాలను కబ్జా చేసేందుకు కుట్ర చేస్తోందన్నారు. జగన్ రెడ్డికి ఓటేస్తే మన ఆస్తుల హక్కును వారిచేతిలో పెట్టడమేనన్నారు. వైసీపీని ఓడించి, భూములను రక్షించుకుందామని పిలుపునిచ్చారు. టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు కఠారి నాగేశ్వరరావు, గుర్రం నాగరాజు, సురేష్, కొండలు పాల్గొన్నారు.

ఏలూరి గెలుపు కోసం నర్సిరెడ్డి ప్రచారం

నూతలపాడు (పర్చూరు), మే 6 : ఒక్కచాన్స్‌తో జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టారని తెలుగుదేశం పార్టీ జాతీయ అధికార ప్రతినిధి నన్నూరి నర్సిరెడ్డి అన్నారు. టీడీపీ ప్రజా కూటమి ఎమ్మెల్యే ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు గెలుపు కోసం సోమవారం పర్చూరు మండలంలోని నూతలపాడు, నాగులపాలెం, చెరుకూరు గ్రామాల్లో నర్సిరెడ్డి ప్రచారం నిర్వహించారు. నర్సిరెడ్డి తనదైన శైలిలో జగన్ పాలనపై చలోక్తులతో మాట్లాడించి అందరినీ నవ్వించారు. సాంబన్నకు ఓటువేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఇంటింటికీ తిరిగి సూపర్ సిక్స్ పథకాల మేనిఫెస్టో కరపత్రాను పంచిపెట్టారు. పార్టీలకు అతీతంగా అభివృద్ధే లక్ష్యంగా పనిచేసే ఎమ్మెల్యే ఏలూరి గెలుపుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. పర్చూరు అభివృద్ధి ఏలూరితోనే సాధ్యమన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారంలో తెలుగుదేశం జాతీయ అధికార ప్రతినిధి నర్సిరెడ్డి

జగన్‌రెడ్డిని గద్దె దించండి

● కూటమి గెలుపుతోనే రాష్ట్రానికి పూర్వవైభవం
● ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి

గంగవరం (ఇంకొల్లు), మే 6 : బాధ్యతలేకుండా.. అవినీతి పాలన కొనసాగించిన జగన్‌రెడ్డిని గద్దె దింపాలని, ప్రతి ఒక్కరూ ఓటును వినియోగించుకొని టీడీపీ కూటమి అభ్యర్థులను గెలిపించి రాష్ట్రానికి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు చేయిచేయి కలపాలని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు ప్రజలకు పిలుపునిచ్చారు. మండలంలోని గంగవరం, పావులూరు, చిననక్కలపాలెం గ్రామాలలో ఎన్నికల ప్రచారంలో ఏలూరి విస్తృతంగా పాల్గొన్నారు. గంగవరం, పావులూరు గ్రామాలలో ప్రజలు ఏలూరికి బ్రహ్మరథం పట్టారు. మీవెంటే మేమంటూ హామీ ఇచ్చారు. ఐదేళ్ల జగన్‌రెడ్డి పాలనలో అన్నివర్గాల ప్రజలు తీవ్రంగా నష్టపోయారన్నారు. సాగు నీరు లేక రైతుల కూడా పొరుగు రాష్ట్రాలకు వలసపోయే దుస్థితికి తీసుకొచ్చారన్నారు. ప్రజలకు పనులు లేక పొట్టచేతపట్టుకొని ఊళ్లను విడిచారన్నారు. నిరుద్యోగ యువత పరిస్థితి మరీ దారుణంగా మారిందన్నారు. రాష్ట్రంలో కొత్త కంపెనీని ఒక్కదానినీ ఏర్పాటు చేయలేని అసమర్థ జగన్‌రెడ్డి ఉన్న కంపెనీలనూ వెళ్లగొట్టారన్నారు. రాష్ట్రంలో మద్యం, ఇసుక వ్యాపారంతో వైసీపీ పాలకులు కోట్లు కొల్లగొట్టారన్నారు. గంగవరం ప్రధానవీధుల్లో, ఎస్సీ కాలనీలో ప్రచారం నిర్వహించి ఓట్లు అభ్యర్థించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కరి వీరాంజనేయులు, బోడెంపూడి సుబ్బారావు, రమేష్, కరి రామారావు, కరి సుధాకర్, ఆరె విజయలక్ష్మి, నాగేంద్రమ్మ, పార్వతి, రవి,వాసు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు గుంజి వెంకట్రావు, శ్రీనివాసరావు, జనసేన నాయులు ప్రవీణ్, మహిళలు, యువత, నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు. నాగండ్ల గ్రామానికి చెందిన ఎస్టీ కుటుంబాలు సోమవారం ఏలూరి సమక్షంలో చేరగా, పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.


గంగవరంలో ప్రచారంలో పాల్గొన్న ఏలూరి

హత్య కేసు నిందితులకు యావజ్జీవం

తీర్పు వెలువరించిన ఒంగోలు పీడీజే కోర్టు న్యాయాధికారి
తొమ్మిదేళ్ల తర్వాత వెలువడిన వైనం

చెరుకూరు(పర్చూరు), మే 6: వివాహేతర సంబంధం నేపథ్యంలో జరిగిన హత్య కేసులో నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ ఒంగోలు పీడీజే కోర్టు న్యాయాధికారి ఏ.భారతి సోమవారం తీర్పు చెప్పారు. వివరాల్లో వెళితే బాపట్ల జిల్లా, పర్చూరు మండలం చెరుకూరు గ్రామానికి చెందిన నవాబు సురేష్ 2015 ఫిబ్రవరి 2న హత్యకు గురయ్యాడు. అతని భార్యతో అరుద్ర సాంబశివరావు అనే వ్యక్తి వివాహేతర సంబంధం కలిగి ఉండడమే ఈ హత్యకు కారణమైంది. కేసు వివరాల్లోకి వెళితే..ఆరుద్ర సాంబ శివరావుకు సురేష్ భార్యతో వివాహేతర సంబంధం ఉంది. ఆ విషయం తెలిసిన గ్రామస్థులు, భర్త వారిని మంద లించారు. అప్పటి నుంచి సురేష్‌పై కక్ష పెంచుకున్న సాంబశివరావు 2015వ సంవత్సరం ఫిబ్రవరి 2వ తేదీ రాత్రి సుమారు 8.45 గంటల సమయంలో ఎన్టీఆర్ సెంటర్ వద్ద నడిచి వెళుతున్న సురేష్‌ను వెనుక నుంచి కత్తితో దాడిచేసి తలపైన గొంతుపైన నరికాడు. దీంతో నవాబు సురేష్ (36) అక్కడికక్కడే మృతి చెందాడు. అతని సోదరుడు గోపీ నాగ రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై కె.మాధవరావు కేసు నమోదు చేశారు. అప్పటి ఇంకొల్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాసరావు దర్యాప్తు అధికారిగా సాక్షుల వాంగ్మూలాన్ని నమోదు చేశారు. సాక్ష్యాధారాల ఆధారంగా నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిపుణుల నివేదికలను, భౌతిక సాక్ష్యాధారాలను సేకరించి న్యాయ స్థానంలో నిందితులపై అభియోగ పత్రాలు దాఖలు చేశారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు మార్టూరు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సి.శీతారామయ్య కేసు ట్రైల్‌ను స్వయంగా పర్యవేక్షించారు. హత్య కేసు రుజువు కావడంతో ఆరుద్ర సాంబశివరావు, సురేష్ భార్య (ఏ2 నిందితురాలు)పై యావజ్జీవ కారాగార శిక్షతోపాటు, రూ.5000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పినట్లు పోలీసులు వివరించారు. హత్య కేసులోని నిందితులకు యావజ్జీవం పడేలా కృషి చేసిన పోలీస్ అధికారులు, సిబ్బందిని, కోర్టు మానటరింగ్ సిబ్బందిని ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు.


పోతుల వెస్ట్ కాలనీలో టీడీపీ శ్రేణుల ప్రచారం

టీడీపీ ఎన్నికల గుర్తుపై విస్తృత ప్రచారం

టంగుటూరు, మే 6 : పార్టీ ఎన్నికల గుర్తును సూచిస్తూ ఓటు ఎలా వేయాలి? ఎక్కడ వేయాలి అన్న విషయాలను తెలుగుదేశం పార్టీ నేతలు ఓటర్లకు వివరిస్తున్నారు. సోమవారం టంగుటూరు పోతుల చెంచయ్య వెస్ట్ కాలనీలో తెలుగుదేశం పార్టీ నాయకులు, ముఖ్యకార్యకర్తలు ఎన్నికల గుర్తుపై విస్తృత ప్రచారం నిర్వహించారు. బ్యాలెట్ నమూనా పత్రాల ఆధారంగా వారు పత్రంపై సైకిల్ గుర్తుకు ఏవిధంగా ఓటు వేయాలో తెలియజేశారు. ఎమ్మెల్యే అభ్యర్థి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి పేరు బ్యాలెట్‌లో రెండవ వరుసలో ఉంటుందని, పేరు ఎదురుగా ఈవీఎంపై సైకిల్‌కి నొక్కాలని తెలియజేశారు. అలాగే ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి పేరు బ్యాలెట్‌లో నాల్గవ వరసలో ఉంటుందని, పేరు ఎదురుగా ఈవీఎంలో సైకిల్‌పై నొక్కాలని సూచించారు. ప్రతి ఓటరు ఓటు ఏవిధంగా వేయాలో ముందుగా తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కామని విజయకుమార్, గ్రామ సర్పంచ్ మద్దిరాల మమత, మాజీ సర్పంచ్ బెల్లం జయంత్‌బాబు, మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్, పార్టీ సీనియర్ నాయకుడు బెజవాడ వెంకటేశ్వర్లు, పార్టీ ముఖ్యనాయకులు మొలకలపల్లి శ్రీనివాసరావు, పెద్దోడు, యజమాని, కందేటి వెంకట్రావు, జక్కుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అరెస్ట్ చేస్తారన్న భయంతో యువకుడు ఆత్మహత్యాయత్నం

● కాలిన గాయాలతో ఆసుపత్రికి తరలింపు
● ఆరోగ్యపరిస్థితి విషమం.. గార్లపేటలో సంఘటన


మర్రిపూడి, మే 6 : పోలీసులు అరెస్ట్ చేస్తారన్న భయంతో పోలీస్ వాహనం ఎదుట ఓ యువకుడు పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఆదివారం రాత్రి ప్రకాశం జిల్లా మర్రిపూడి మండలంలోని గార్లపేటలో కలకలం సృష్టించింది. గ్రామానికి చెందిన గుమ్మళ్ళ వెంకటేష్ మూడురోజుల క్రితం ట్రాక్టర్ నడుపుకుంటూ వెళుతుండగా కనిగిరి మండలం ఎనిమిరెడ్డిపల్లెకు చెందిన దంపతులు బైక్‌పై వస్తూ ట్రాక్టర్‌ను తప్పించబోయి అదుపుతప్పి పక్కకు పడ్డారు. ఈ సందర్భంలో వారి మధ్య వివాదం నెలకొంది. మాటామాట పెరగడంతో వెంకటేష్‌పై భార్యభర్తలతోపాటు మరికొందరు దాడి చేశారు. విషయాన్ని మనసులో పెట్టుకున్న వెంకటేష్ ఆదివారం సాయంత్రం కొందరు యువకులను వెంటబెట్టుకొని ఎనిమిరెడ్డిపల్లెకు వెళ్ళి తనను కొట్టిన భార్యభర్తలపై తిరిగి దాడి చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు వారిలో ముగ్గురిని పట్టుకొని కనిగిరి పోలీసులకు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన పోలీసులు గ్రామానికి చేరుకొని ముగ్గురిని వాహనంలో ఎక్కించుకొని గార్లపేట వైపునకు వస్తుండగా ఆ గ్రామ కూడలిలో ఉన్న వెంకటేష్ పోలీసులు తనను అరెస్ట్ చేసేందుకు వస్తున్నారని భయపడి ఒంటిపై పెట్రోలు పోసుకొని ఒక్కసారిగా నిప్పు అంటించుకున్నాడు. పోలీసులు అప్రమత్తమై మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. తీవ్ర గాయాలతో ఉన్న వెంకటేష్‌ను కనిగిరికి తరలించి అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. సోమవారం కనిగిరి డీఎస్పీ రామరాజు కనిగిరి, కొండపి సీఐలు వెంకటేశ్వర్లు, వై. పాండురంగారావులు సంఘటన స్థలాన్ని సందర్శించి కేసు పూర్వాపరాలు తెలుసుకున్నారు. ఎనిమిరెడ్డిపల్లిలో కూడా జరిగిన ఘటనపై స్థానికులను విచారించారు. ఆత్మాహత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై మర్రిపూడి స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పాండురంగారావు తెలిపారు. అంతకు ముందు ఎనిమిరెడ్డిపల్లిలో జరిగిన దాడులపై కనిగిరి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్లు తెలిసింది.

జర్నలిస్టులకు ఎర

● గాడ్జెట్స్‌తో కూడిన గిఫ్ట్‌బాక్స్, తాయిలాలు అందజేత

సింగరాయకొండ, మే 6: ప్రభుత్వ తప్పిదాలను ప్రశ్నించిన, ప్రజల సమస్యలను, అధికారపార్టీ అరాచకాలను వెలుగులోకి తెచ్చిన, ప్రజాహితం కోసం పనిచేసిన అనేకమంది జర్నలిస్టులపై వైసీపీ నాయకులు దాడులకు తెగబడ్డ విషయం విదితమే. అంతేకాకుండా కొంతమందిపై అక్రమ కేసులుపెట్టి వేధించారు. కాగా ఎన్నికల వేళ వారిని ప్రసన్నం చేసుకోవడానికి బహుమతులను ఎరచూపుతున్నారు. సింగరాయకొండ మండలంలోని కొంతమంది జర్నలిస్టులకు మంత్రి ఆదిమూలపు సురేష్ అనుయాయులు ఎన్నికల వేళ తాయిలాలను పంపిణీ చేశారు. స్మార్ట్‌వాచ్, పవర్‌బ్యాంక్, బ్లూటూత్ కూడిన గిఫ్ట్‌బాక్స్‌లను అందజేశారు. ఈతంతు కొండపి నియోజకవర్గంలోని ఆరు మండలాలలో కొనసాగిస్తున్నట్టు సమాచారం. బహుమతులు అందజేసిన తరువాత ఎమ్మెల్యే అభ్యర్థి మంత్రి సురేష్, ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అనుకూలంగా వ్యవహరించాలని జర్నలిస్టులకు విజ్ఞప్తులు చేస్తున్నారు. ఇదివరకే నియోజకవర్గంలోని మెజారిటీ భాగం జర్నలిస్టులను ఆత్మీయ సమావేశం పేరిట సింగరాయకొండలోని క్యాంపు కార్యాలయానికి పిలిపించి ప్యాంట్, షర్ట్, చీర పంపిణీ చేశారు. గతంలో జర్నలిస్టులను తన్ని.. ఇప్పుడు తాయిలాలు పంపిణీ చేస్తూ వైసీపీ మార్కు రాజకీయాలు చూపుతున్నారని పలువురు జర్నలిస్టులు నివ్వెరపోతున్నారు.


మంత్రి అనయాయులు అందజేస్తున్నగిఫ్ట్‌బాక్స్



డామిట్.. కథ అడ్డం తిరిగింది!

అద్దంకి, పర్చూరులో ఆ పార్టీకి కొత్త తలనొప్పులు

సాధారణ ఓటర్లకూ ఐదువేలు ఇవ్వాలని హనిమిరెడ్డిపై ఒత్తిడి

పర్చూరులో చందాలు వేసుకుని టీడీపీకి సహకరించిన టీచర్లు

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

రానున్న ఎన్నికల్లో ఎలాగైనా గెలిచేందుకు ఓట్ల కోసం డబ్బుతో ప్రలోభపెట్టాలనుకున్న వైసీపీ వ్యూహం ఆదిలోనే బెడిసికొట్టింది. ప్రధానంగా అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల్లో ఈ విషయంలో వైసీపీ అభ్యర్థులకు సరికొత్త తలనొప్పులను తెచ్చిపెట్టింది. అనూహ్యంగా.. అద్దంకిలో వైసీపీ ఉద్యోగుల ఓట్లకు ఐదు వేల రూపాయలు పంపిణీ చేయడం కొత్త సమస్యలను తెచ్చింది. పర్చూరులో వైసీపీ అభ్యర్థి ఇచ్చే డబ్బులు కొందరు టీచర్లు తీసుకోకపోగా, వారందరూ గ్రూపుగా ఏర్పడి చందాలు వేసుకుని డబ్బు ఆశించే ఉద్యోగులను కలిసి టీడీపీకి మద్దతు ఇవ్వాలని కోరడం గమనార్హం. అద్దంకిలో 2700 మంది, పర్చూరులో 1900 మంది ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో సింహభాగం ఉద్యోగులు తమకు ఓటు వేసే అవకాశం లేదని ముందే పసిగట్టిన వైసీపీ అభ్యర్థులు రెండుచోట్లా డబ్బులతో ప్రలోభపెట్టేందుకు శతవిధాలా ప్రయత్నించారు. అద్దంకిలో ఓటుకు ఐదు వేలు ఇస్తామంటూ ఉద్యోగుల ఇళ్ల చుట్టూతిరిగారు. కొన్నిచోట్ల వైసీపీ అనుకూల ఉద్యోగులను పట్టుకుని ఒక గ్రూపుగా ఉద్యోగులను లెక్కించి ఒక్కొక్కరికి ఐదు వేలు ఇచ్చే కార్యక్రమాన్ని చేపట్టారు. ఇది గమనించిన కొందరు ఉద్యోగులు టీడీపీ కూటమి అభ్యర్థి రవికుమార్ వద్దకెళ్లి "ప్రభుత్వ విధానాలు మా కొంపలుముంచాయి.. మా ఓట్లన్నీ మీకే వేస్తాం.. మీరేం కంగారు పడొద్దు" అని చెప్పడం విశేషం. ఉద్యోగుల్లో ఎక్కువ శాతం మంది డబ్బులు తీసుకోవడాన్ని తిరస్కరించారు. డబ్బులు తీసుకున్న వారిలో ఎవరు ఎటు వేశారో అర్థం కాని పరిస్థితి. ఇలా ఉంటే.. ఓట్లు కచ్చితంగా తమకు వేయరని తెలిసిన ఉద్యోగులకు ఐదు వేలు ఇచ్చారు.

రూ.5వేలను సాధారణ ఓటర్లకూ ఇవ్వాలని ఒత్తిడి

అద్దంకి నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ ఉద్యోగులకు ఐదు వేలు ఇచ్చిన విషయం తెలిసిన నేతలు.. సాధారణ ఓటర్లకు సైతం ఆ ప్రకారమే ఇవ్వాలంటూ కిందిస్థాయి వైసీపీ నేతలు అభ్యర్థి హనిమిరెడ్డిపై ఒత్తిడి తెచ్చారు. సోమ, మంగళవారాల్లో సాధారణ ఓటర్లకు డబ్బులు పంపిణీ చేసేందుకు సిద్ధంకాగా, తాజా డిమాండ్ అభ్యర్థికి తలనొప్పిగా మారింది. ఒక్కొక్కరికి రెండు లేక మూడు వేల ప్రకారం డబ్బులు పంపిణీ చేసేందుకు వైసీపీ నేతలు సిద్ధమవుతున్నట్లు సమాచారం ఆ మేరకు గ్రామస్థాయి నేతలకు సమాచారం కూడా పంపినట్లు కూడా తెలుస్తోంది. అయితే ఇది గమనించిన గ్రామస్థాయి నేతలు మనకు కచ్చితంగా ఓటు వేసే వారు ఈ విషయంలో అసంతృప్తిగా ఉన్నారు. తమకూ ఓటుకు ఐదు వేల చొప్పున ఇవ్వాలని పట్టుబడుతున్నారంటూ ఆ పార్టీ అభ్యర్థికి సమాచారం పంపారు. దీంతో సాధారణ ఓటర్లకు డబ్బులు పంచే విషయంలో ఎదురైన సమస్యలతో వైసీపీ నేతలు ఇబ్బంది పడుతున్నట్లు ప్రచారం ప్రారంభమైంది. ఓటుకు రెండువేల కాకుండా మూడు వేలు ఇస్తేనే సుమారు రూ.20 కోట్లు అదనంగా వెచ్చించాల్సి ఉంటుంది. ఒక్కసారిగా ఓటుకు ఐదు వేలు డిమాండ్ చేస్తుండడంతో భారీ మొత్తంలో అధిక నిధులు కావాల్సి రావడం, సమస్యాత్మకంగా మారి ఏమి చేయాలన్న విషయంపై ఆ పార్టీ ముఖ్య నేతలు తలమునకలవుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు టీడీపీ మద్దతుగా కొన్ని ప్రాంతాల్లో కిందిస్థాయి నేతలు ఉద్యోగుల్లో తీసుకునే వారికి రూ.2వేల ప్రకారమే చెల్లించి కిందిస్థాయిలో కూడా అదే ప్రకారం ముందుకుపోయే సంకేతాన్ని ఇచ్చారు. సరికొత్త సమస్యతో వైసీపీ నేతలు తలమునకలవ్వగా, టీడీపీ నేతలు చాపకింద నీరులా పనిచేసుకుంటూ పోతున్న తీరు నియోజకవర్గంలో కినిపిస్తోంది.

పర్చూరులో రకరకాలుగా పంపిణీ చేసిన వైసీపీ

పర్చూరులో వైసీపీ అభ్యర్థి మద్దతుదారులు కొన్నిచోట్ల ఉద్యోగులకు మూడు వేలు, ఇంకొన్ని చోట్ల రూ.2వేలు ఇవ్వడం సమస్యగా మారింది. ముందస్తు ప్రణాళికతో టీచర్లలోని కొందరు నేతలు డబ్బుకన్నా మన భవిష్యత్తు ముఖ్యం అంటూ ప్రలోభాల వైపు వెళ్లకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారు. అక్కడక్కడా డబ్బు తీసుకునేందుకు సిద్ధమైన ఉద్యోగులకు, ఆ ప్రాంతంలోని కొందరు టీచర్లే చందాలు వేసుకుని డబ్బులిచ్చి టీడీపీ కూటమి అభ్యర్థికి మద్దతుగా ఓట్లు వేయాలని కోరారు. రెండు నియోజకవర్గాల్లో ఉద్యోగుల ఓట్లు కోసం అధిక మొత్తంలో డబ్బులు ఇచ్చేందుకు వైసీపీ నేతలు సిద్ధపడినా ఉద్యోగుల నుంచి ఫలితం రాకపోగా, సాధారణ ఓటర్ల నుంచి అదే స్థాయి డిమాండ్ రావడంతో ఆ పార్టీ వ్యూహం బెడిసికొడుతోందన్న వాతావరణం కనిపిస్తోంది.

అంగన్‌వాడీల నిశ్శబ్ద వాతావరణం...

గ్రామస్థాయిలో పరిస్థితికి అనుగుణంగా అంగన్‌వాడీ ఉద్యోగులపై వివిధ రకాల ఒత్తిళ్లను వైసీపీ నేతలు తీసుకొచ్చారు. ప్రలోభాలకు తోడు ఒత్తిళ్లు తేవడంతో అంగన్‌వాడీ ఉద్యోగులు నిశ్శబ్ద వాతావరణాన్ని కొనసాగించారు. అయితే ఉద్యోగుల పోలింగ్ కేంద్రాల వద్ద విస్తృతంగా కనిపించిన ఆంధ్రజ్యోతి బృందంతో అంగన్‌వాడీ ఉద్యోగులు నర్మగర్భంగా వారి అభిప్రాయాన్ని వెల్లడించారు. 'మా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తే ప్రభుత్వం అనేక ఇబ్బందులు కల్పించింది.. స్థానిక వైసీపీ నేతలు కూడా మర్యాదపూర్వకంగానైనా మమ్మల్ని పలుకరించలేదు.. అదే టీడీపీ, జనసేన నేతలు వచ్చి మద్దతు తెలిపారు. దాన్ని బట్టి మేం ఎవరికి ఓటు వేశామో మీరే అర్థం చేసుకోండంటూ' అంగన్‌వాడీ ఉద్యోగులైన మహిళలు తమ అభిప్రాయాలను చెప్పడం విశేషం.

ఓటును అమ్ముకొనే వారు ఆలోచించాలి

వాళ్లిచ్చే డబ్బులు రోజు వారీ కూలితో లెక్కిస్తే..

ఒంగోలు(విద్య), మే 6 : ఈ నెల 13న జరగనున్న సాధారణ ఎన్నికలలో ఓటు హక్కును అమ్ముకునే వారు ఒకసారి ఆలోచించాలి. మన భవిష్యత్‌కు బాటలు వేసే ఆదర్శ ప్రభుత్వాన్ని ఎన్నుకొనేందుకు ఉపయోగించాల్సిన ఓటును అమ్ముకొని దుర్వినియోగం చేస్తే ఐదేళ్ల కష్టాలు ఎదుర్కోవాల్సిందే. పదికోపరక్కో ఓటును అమ్ముకొని అనర్హులకు ఓటు ఆయుధాన్ని అందించవద్దు. మనం వేసే ఓటు ఐదేళ్ల సుస్థిర ప్రభుత్వం, అందరి సంక్షేమం కాంక్షించే విధంగా ఉండాలి. ఓటుకు రాజకీయ పార్టీలు ఇచ్చే మొత్తం ఐదేళ్లకు లెక్కిస్తే రోజుకు ఎంతవుతుందో ఒక్కసారి గమనించాలి.



ఏడాదికి 365 రోజుల చొప్పున ఐదేళ్లకు 1825 రోజులు ఓటుకు వారు ఇచ్చే మొత్తం రోజువారీ లెక్కిస్తే..

- రూ.500 ఇస్తే రోజుకు రూ.0.27 పైసలు
- రూ1000 ఇస్తే రోజుకు రూ.0.56 పైసలు
- రూ.1500 ఇస్తే రోజుకు రూ.0.82 పైసలు
- రూ.2000 ఇస్తే రోజుకు రూ.1.10పైసలు
- రూ.2500 ఇస్తే రోజుకు రూ.137 పైసలు
- రూ.3000 ఇస్తే రోజుకు రూ.1.65 పైసలు
- రూ.4000 ఇస్తే రోజుకు రూ.2.20 పైసలు
- రూ.5000 ఇస్తే రోజుకు రూ.2.74 పైసలు

ఓటు వేసేటప్పుడు ఒకసారి ఆలోచించి ఓటు విలువను గుర్తించి ఓటు వేయాలని అభ్యర్థన.

ఓటు హక్కు వినియోగించుకున్న జేసి



ఓటు హక్కును వినియోగించుకుంటున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు(కలెక్టరేట్), మే 6 : జిల్లా జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ రోణంకి సోమవారం ఒంగోలులోని కేంద్రీయ విద్యాలయంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. వాస్తవానికి జేసీ శ్రీకాకుళం జిల్లా పలాస నియోజకవర్గంలో ఉంది. ఇతర జిల్లాల్లో ఓటు ఉన్న ఉద్యోగులకు ప్రస్తుతం వారు పనిచేస్తున్న జిల్లాల్లోనే ప్రత్యేకంగా పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఇలాంటి ఉద్యోగుల కోసం కేంద్రీయ విద్యాలయంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన చర్యలు, కల్పించిన మౌలిక సదుపాయాలను పరిశీలించారు.

పొరుగు జిల్లాల ఉద్యోగుల కోసం ఫెసిలిటేషన్ కేంద్రం



పోలింగ్ కేంద్రంలో ఉద్యోగులతో మాట్లాడుతున్న దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), మే 6 : పొరుగు జిల్లాల్లో ఓటర్లుగా ఉండి ప్రస్తుతం జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగుల కోసం కేంద్రీయ విద్యాలయంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ సోమవారం పరిశీలించారు. ఈ ఓటర్లు తమ స్వస్థలాలకు వెళ్లి ఓటు వేసే బదులు ఇక్కడే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటు వేయనున్న నేపథ్యంలో అక్కడ కల్పించిన మౌలిక సదుపాయాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఓటర్ల సందేహాలను నివృత్తి చేసేందుకు ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్, మంచినీటి సదుపాయం, మొబైల్ ఫోన్స్ డిపాజిట్ శిబిరం, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టెంట్లు, కుర్చీలు తదితర సదుపాయాలను కల్పించారు. ఈ సందర్భంగా దినేష్‌కుమార్ మాట్లాడుతూ మూడువేల మందికి పైగా ఓటర్లకు ఇక్కడ ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వివిధ జిల్లాల్లోని పలు నియోజకవర్గాలకు చెందిన ఓటర్లు త్వరగా తమ ఓటు హక్కు వినియోగించుకొనే వెసులుబాటును కల్పించామన్నారు. తొలిరోజైన సోమవారం నెల్లూరు జిల్లాలో ఓటు హక్కు కలిగిన ఉద్యోగులకు ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు. మంగళవారం బాపట్ల జిల్లా ఉద్యోగులకు అవకాశం కల్పించామని, ఈ రెండు జిల్లాలు కాకుండా ఇతర జిల్లాలో ఓటు ఉన్న వారు బుధవారంలోపు ఎప్పుడైనా ఓటు వేయవచ్చని తెలిపారు. ఇక్కడ పోలైన ఓట్లను ఈనెల 10వ తేదీన రాష్ట్ర స్థాయిలో చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్(సీఈవో) కార్యాలయంలో సంబంధిత జిల్లాల వారీగా పరస్పరం బదిలీ చేసుకుంటామని కలెక్టర్ తెలిపారు. అనంతరం డీఆర్ఆర్ఎం మునిసిపల్ స్కూలులో జరుగుతున్న పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో శ్రీలత, పోస్టల్ బ్యాలెట్ జిల్లా నోడల్ అధికారి విశ్వేశ్వరరావు, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జీవీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

మాగుంట, దామచర్లను గెలిపించాలి



ఇంటింటి ప్రచారం చేస్తున్న మాగుంట కుటుంబ సభ్యులు

ఒంగోలు(కలెక్టరేట్), మే 6 : ఒంగోలు లోక్‌సభ సభ్యుడు, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి, అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి దామచర్ల జనార్దన్‌ను గెలిపించాలని కోరుతూ మాగుంట కుటుంబ సభ్యులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నగరంలోని 25వ డివిజన్‌లో సోమవారం మాగుంట శ్రీనివాసులరెడ్డి మరదళ్లు సురేఖ, శశికళ, చెల్లెలు వాణి, సంధ్య, మేనకోడలు కీర్తి, దామచర్ల జనార్దన్ అక్క మాధవి, కుమార్తె అనీషాలక్ష్మి, మరదలు డాక్టర్ హిమబిందులు ఇంటింటి ప్రచారం చేశారు. ఈనెల 13వ తేదీన జరిగే పోలింగ్‌లో సైకిల్ గుర్తుకు ఓట్లు వేసి మాగుంట, దామచర్లను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు.

ఆగని ఇసుకాసురులు



జరుగుమల్లి పోలీస్ స్టేషన్‌కు అప్పగించిన ఎక్స్‌కవేటర్, టిప్పర్

పాలేరును గుల్లచేస్తున్న వైసీపీ నాయకులు

యథేచ్ఛగా రాత్రిళ్లు ఇసుక తోలకం

ఎన్నికల మాటున జోరుగా అమ్మకాలు

జరుగుమల్లి (కొండపి), మే 6 : ఎన్నికల తరుణంలో ఇసుకాసురులు బరితెగించారు. ఇసుకను జోరుగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. రాత్రిళ్లు వైసీపీ నాయకులు పాలేరులో ఎక్స్‌కవేటర్‌లను ఉపయోగించి వందల సంఖ్యలో టిప్పర్లతో ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. జరుగుమల్లి మండలంలోని చతుకుపాడు, చింతలపాలెం, జరుగుమల్లి, కామేపల్లి, రావులకొల్లు పరిసరాల్లో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతున్నది. వైసీపీ నాయకులు సందట్లో సడేమియా అంటూ నెలరోజుల తర్వాత ఎట్లా ఉంటుందోనన్న సందేహంతో జోరుగా ఇసుకను అమ్మేసుకుంటున్నారు.

మైనింగ్ అధికారుల దాడి....

చతుకుపాడు సమీపంలో పాలేరులో అక్రమంగా ఇసుకను తీసుకెళ్తున్న రెండు ఎక్స్‌కవేటర్‌లను, ఇసుక లోడ్‌తో ఉన్న ఐదు టిప్పర్లను ఇటీవల మైనింగ్ అధికారులు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. వీటిలో ఒక టిప్పర్, ఎక్స్‌కవేటర్‌ను జరుగుమల్లి పోలీసులకు, మరో టిప్పర్‌ను కొండపి పోలీసులకు అప్పగించారని సమాచారం. అయితే జరుగుమల్లి పోలీస్‌స్టేషన్ వద్ద ఎక్స్‌కవేటర్, టిప్పర్‌లు ఉదయం నుంచి ఉండగా సాయంత్రానికి మాయమయ్యాయి. దీనిపై జరుగుమల్లి ఎస్సై వెంకటేశ్వరరావును ఆంధ్రజ్యోతి వివరణ అడగ్గా తమకు మైనింగ్ అధికారులు వాటిని అప్పగించలేదని, టిప్పర్‌ను, ఎక్స్‌కవేటర్‌ను తీసుకుపోయారని చెప్పడం విశేషం. మొత్తంగా మైనింగ్ అధికారులు కూడా ఇసుకాసురులకు మద్దతుగా ఉన్నారన్నది బహిరంగ రహస్యం. గతంలో చతుకుపాడుకు చెందిన ఈ వైసీపీ నాయకుడు స్థలం ఒకచోట లీజు చూపించి పాలేరులో ఇసుకను ఎత్తుతుండటంతో మైనింగ్ అధికారులు లక్షల రూపాయల జరిమానా కూడా విధించారు. అది ఏమైందో తెలియదు కాని మళ్లీ యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా మాత్రం జరుగుతున్నది. ఎన్నికల విధుల్లో రాత్రిళ్లు తిరుగుతున్న అధికారులు కూడా అక్రమంగా వస్తున్న ఇసుక టిప్పర్లను చూసినా ఏమి చేయలేక వదిలేస్తున్నారు. ఇసుకాసురుల తవ్వకాలతో పాలేరు నాశనం అయిపోతోందని పరిసర గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

కంపెనీ పేరుతో...

కంపెనీ పేరుతో దొంగ బిల్లులు ఇస్తూ ఇసుకను అక్రమార్కులు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇందులో భాగంగా పాలేరులోని ఇసుకను కామేపల్లి - చతుకుపాడు గ్రామాల మధ్యన ఖాళీప్రదేశంలో కొండల్లా డంప్ చేశారు. ఈడంప్‌లపై జిల్లా అధికారులకు అనేక పర్యాయాలు ఫిర్యాదులు రావడంతోపాటు, టీడీపీ నేతలు ఇసుక అక్రమ అమ్మకాలపై నిరసన కార్యక్రమాలు చేపట్టడంతో ప్రస్తుతం ఈ ఇసుక డంప్‌లు తీసుకెళ్లకుండా రోడ్డులో మైనింగ్ అధికారులు గోతులు తీసి వాహనాలు వెళ్లకుండా నిరోధించారు. మొత్తంగా రాత్రిళ్లు పాలేరు నుంచి అక్రమంగా జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని పరిసర గ్రామాల ప్రజలు సెబ్, మైనింగ్, పోలీసు అధికారులను కోరుతున్నారు.



కామేపల్లి- చతుకుపాడు గ్రామాల మధ్యలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకను స్వాధీనం చేసుకున్న జిల్లా అధికారులు

టీడీపీ నేతల నిరసన

జరుగుమల్లి (కొండపి) 2: ఇసుక మాఫియాకు వ్యతిరేకంగా టీడీపీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త నిరసన కార్యక్రమం గత ఏడాది ఆగస్టు 28వ తేదీన జరిగింది. ఇందులో భాగంగా కొండపి ఎమ్మెల్యే డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దామచర్ల సత్య ఆధ్వర్యంలో జరుగుమల్లి మండలంలోని చతుకుపాడు నుంచి కామేపల్లి వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఇసుక డంప్‌ల వద్ద టీడీపీ శ్రేణులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఇసుక అక్రమ మైనింగ్ వల్ల తమ గ్రామాల రక్షిత పథకాలు, తాగునీటి పథకాల పైపులైన్లు దెబ్బతిన్నాయని ప్రజలు వాపోయారు.



ఇసుక మాఫియాకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తంచేస్తున్న టీడీపీ నేతలు (ఫైల్)

వైసీపీ ప్రచారంలో ఎండీయూ ఆపరేటర్, వలంటీర్లు




వైసీపీ ప్రచారంలో ఎండీయూ ఆపరేటర్ ఆలోకం హరిబాబు, వలంటీర్ వేమిరెడ్డి వీరాంజనేయరెడ్డి



వైసీపీ ప్రచారంలో వలంటీర్ బద్దుల సురేష్

తాళ్లూరు, మే 6: ప్రభుత్వ జీతం తీసుకుంటున్న ఉద్యోగులలేకాక ప్రభుత్వం నుంచి గౌరవవేతనం తీసుకుంటున్న ఉద్యోగులు ఎవరైనా ఎన్నికల ప్రచారాలకు దూరంగా ఉండాలని ఎన్నికల కమిషన్ స్పష్టమైన ఆదేశాలిచ్చినా మండలంలోని పలువురు ఖేతార్ చేస్తూ ప్రచారంలో పాల్గొంటూనే ఉన్నారు. శివరాంపురం గ్రామంలో సోమవారం దర్శి వైసీపీ అభ్యర్థి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈప్రచారంలో ఎండీయూ (మొబైల్ డిస్ట్రిబ్యూటరీ యూనిట్) ఆపరేటర్ ఆలోకం హరిబాబు, వలంటీర్లు బద్దుల సురేష్,వేమిరెడ్డి వీరాంజనేయరెడ్డి, గండి వీరాంజనేయులు పాల్గొన్నారు. దీనిపై ఆగ్రామ ప్రతిపక్ష నాయకులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. వలంటీర్లు రాజీనామాలు చేసినా వారి రాజీనామాలను అధికారులు ఆమోదం తెలపకపోవటం గమనార్హం.



కట్టుతప్పుతున్న ఖాకీ

అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహారింపు

ప్రతిపక్షాల సభలకు ఆటంకాలు కల్పిస్తున్న పోలీసులు

కొనకనమిట్ల మండలంలో

పార్టీ మారిన వారికి కూడా బెదిరింపులు

మార్కాపురం మే 6 : ఎన్నికల సమయంలో నియమావళిని సక్రమంగా అమలు చేస్తూ కీలకంగా వ్యవహరించాల్సిన పోలీసుశాఖ అధికార పార్టీకి తొత్తుగా వ్యవహరిస్తోంది. పోస్టింగ్‌లు వేయించిన నేతల రుణం తీర్చుకునేందుకు ఇదే అదనుగా భావించి ప్రతిపక్ష పార్టీలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. స్వామి భక్తి చాటుకునేందుకు చివరికి బెదిరింపులు, దౌర్జన్యాలకు సైతం వెనుకాడటంలేదు. కొన్నిచోట్ల ఖాకీల తీరు వివాదాస్పదంగా మారుతున్నా ఉన్నతాధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా పశ్చిమ ప్రకాశ ముఖ్య కేంద్ర నియోజకవర్గంలో పోలీసుల శాఖ తీరు విమర్శలకు తావిస్తోంది. అధికార పార్టీకి తొత్తులుగా మారి ప్రతిపక్ష పార్టీపై జులుం చూపిస్తున్నారు. ప్రధానంగా ముఖ్యమైన సభలు, సమావేశాలు జరిగినప్పుడు పోలీసుల అతి ప్రవర్తనతో ప్రతిపక్ష పార్టీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. మరికొందరైతే ఒకడుగు ముందుకేసి ప్రతిపక్ష పార్టీ నాయకులు, కార్యకర్తలను వెంబడించి మరి వేధింపులకు పాల్పడుతున్నారు.

బాబు సభలకు కిలోమీటర్లకు ముందే ట్రాఫిక్ ఆంక్షలు

పదిహేను రోజుల వ్యవధిలో మార్కాపురం నియోజకవర్గంలో ప్రతిపక్ష పార్టీ మూడు భారీ కార్యక్రమాలు నిర్వహించింది. టీడీపీ అధినేత చంద్రబాబు రెండుసార్లు నియోజకవర్గానికి వచ్చారు. మార్కాపురం, పొదిలి కార్యక్రమాలకు భారీస్థాయిలో జనాలు హాజరయ్యారు. ఆ సమయాల్లో పోలీసులు విధించిన తీవ్ర ఆంక్షలు టీడీపీ నేతలు, కార్యకర్తలకు మరిన్ని ఇబ్బందులు కలిగించాయి. అధికార పార్టీ నేతల ఆదేశాలతో మార్కాపురంలో చంద్రబాబు సభ జరిగే ప్రాంతం నుంచి కిలోమీటర్‌కుపైగానే కార్యకర్తల వాహనాలను అడ్డుకున్నారు. అక్కడ్నుంచి నడిచి వెళ్లేలా కఠినమైన ఆంక్షలు విధించారు. అసలే వేసవికాలం కావడంతో కార్యకర్తలు సభాస్థలికి చేరుకునేందుకు తీవ్ర అవస్థలు పడాల్సివచ్చింది. అంతేకాక ఆయా మండలాల నుంచి వచ్చే వాహనాలను కూడా ఎక్కడికక్కడ ప్రారంభ ప్రాంతాల్లోనే అడ్డుకున్నారు.

వైసీపీ సభలకు ఎప్పటికప్పుడు ట్రాఫిక్ క్లియరెన్స్

పోలీసులు పూర్తిగా పక్షపాతం చూపుతున్నారు. అధికార వైసీపీ నిర్వహించిన అన్ని కార్యక్రమాలకు ఆంక్షలను సడలించి ట్రాఫిక్‌ను ఎప్పటికప్పుడు క్లియరెన్స్ చేస్తూ అందరూ సభల వద్దకు వెళ్లేలా స్వామి భక్తిని చాటుకోవడం విమర్శలకు తావిస్తోంది.

పార్టీ మారితే.. మీ అంతుచూస్తా..

పొదిలి సర్కిల్ పరిధిలోని ఓ పోలీసుస్టేషన్ ముఖ్య అధికారి తీరు అత్యంత దారుణంగా ఉంది. చివరకు పోలీసు అనే విషయం మరిచి అధికార పార్టీ నాయకునిలా మారి ప్రతిపక్ష పార్టీకి చెందిన వారిపై లాఠీ ఝుళిపిస్తున్నారు. ఆ మండల పరిధిలో ఎవరైనా పార్టీ మారినా, నాయకులను పిలిచి ప్రచారం నిర్వహించాలని చూసినా ముందుగానే బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఈ మధ్య ఓ గ్రామానికి చెందిన నాయకుడు ఎదురు తిరిగితే చేయిచేసుకున్నట్లు సమాచారం. కొనకనమిట్ల మండలంలో ఎవరైనా ప్రతిపక్ష పార్టీకి మారితే మీ అంతు చూస్తానంటూ హెచ్చరిస్తున్నట్లు తెలుస్తోంది. అంతేకాక ఆ అధికారి సామాజికవర్గానికి చెందిన వారికి ఫోన్‌లు చేసి అధికార పార్టీకి మద్దతివ్వాలని అనధికార ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిసింది. కిందిస్థాయి సిబ్బంది సైతం ఆ అధికారి వ్యవహార శైలిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆ అధికారి గిద్దలూరు నియోజకవర్గంలో కీలకమైన పోస్టింగ్‌లో పనిచేసి ఇక్కడకు రావడంతో అధికార పార్టీ రుణం తీర్చుకుంటున్నట్లు తెగేసి చెప్పినట్లు విశ్వసనీయ సమాచారం.






తడికమళ్ల బాలసుబ్బారావును టీడీపీలోకి ఆహ్వానిస్తున్న నారాయణరెడ్డి, మాట్లాడుతున్న నూకసాని బాలాజీ, తర్లుపాడు, కొనకనమిట్లలో కార్యకర్తలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న నారాయణరెడ్డి

టీడీపీలోకి జోరుగా చేరికలు

- ఆహ్వానించిన కందుల నారాయణరెడ్డి
- నియోకవర్గంలో సుడిగాలి పర్యటన
- బ్రహ్మరథం పట్టిన ప్రజలు

మార్కాపురం, మే 6: వైసీపీని వీడి టీడీపీలో చేరే వారిసంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. సాధారణ కార్యకర్తలు ఒరవడి ఓవైపు కొనసాగుతుండగానే వైసీపీలోని జిల్లా స్థాయి నాయకులు సైతం టీడీపీ గూటికి చేరుతున్నారు. వైసీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు తడికమళ్ల బాలసుబ్బారావు(బాలుడు) వైసీపీని వీడి టీడీపీలో చేరాడు. మాజీ ఎమ్మెల్యే, టీడీపీ మార్కాపురం అసెంబ్లీ అభ్యర్థి కందుల నారాయణరెడ్డి బాలుడికి సోమవారం కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బాలసుబ్బారావు మాట్లాడుతూ వైసీపీలో నాయకుల నియంతృత్వ ధోరణి అధికంగా ఉంటుందన్నారు. ప్రజాసేవకు టీడీపీనే సరైన వేదిక అన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, సంక్షేమ పథకాలు అర్హులైనవారికి అమలు కావాలన్నా టీడీపీతోనే సాధ్యమని నమ్మి టీడీపీలో చేరినట్లు తెలిపారు. స్థానిక జవహర్‌నగర్ కాలనీలోని టీడీపీ పోల్‌మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కందుల రామిరెడ్డి ఇంట్లో మండలంలోని నాయుడుపల్లికి చెందిన వైసీపీ నుంచి 20 కుటుంబాల వారు టీడీపీలో చేరారు. టీడీపీలో చేరిన వారిలో కోట్ల పౌల్‌రాజ్, తంగిరాల మరియబాబు, కోట్ల యేసయ్య, పరిసపోగు సుమన్, కొమ్మసాని సాయికుమార్, తదితరులున్నారు. కార్యక్రమాలలో టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వక్కలగడ్డ మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలి :బాలాజీ

పొదిలి : జనసేన, బీజేపీ బలపరిచిన ఉమ్మడి టీడీపీ అభ్యర్థులను రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అఖండ మెజారిటీతో గెలిపించాలని నూకసాని బాలాజీ అన్నారు. సోమవారం స్థానిక సామంతపూడి అడితిలో కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. మార్కాపురంలో టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా కందుల నారాయణరెడ్డి, ఎంపీ అభ్యర్థిగా మాగుంట శ్రీనివాసులరెడ్డి పోటీ చేస్తున్నట్లు చెప్పారు. వారిని అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని సూచించారు. వైసీపీ వ్యతిరేక ఓటింగ్ చీలకుండా టీడీపీ నాయకులు కృషి చేయాలన్నారు. ఐదేళ్ల కాలంలో వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను, ప్రతిపక్షాలపై పెడుతున్న అక్రమ కేసులను ప్రజలకు వివరించాలన్నారు. రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని, దాన్ని అంతమొందించే సమయం ఆసన్నమైందన్నారు. ఎన్నికలకు మరో వారంరోజులు మాత్రమే సమయం ఉందని నాయకులు అందరు జాగ్రత్తగా ప్రణాళిక వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యకర్తలు అలుపెరగని కృషి చేయాలి : కందుల

కొనకనమిట్ల : టీడీపీ విజయానికి కార్యకర్తలు అలుపెరగని కృషి చేయాలని మార్కాపురం ఉమ్మడి ఎన్‌డీఏ ఎమ్మెల్యే అభ్యర్థి కందుల నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని కాట్రగుంట గ్రామంలో సోమవారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 'ఇంటింటికి మనకందుల', ప్రజాగళం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు 50 సంవత్స రాలకే పింఛన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించనున్నట్లు తెలిపారు. రైతుల పెట్టుబడినిధి కింద ఏడాదికి రూ.20 వేలు, మహిళకు నెలకు రూ1500, సంవత్సరానికి మూడు గ్యాస్‌సిలెండర్లు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. బీసీలకు ప్రత్యేక రక్షణ రక్షణ చట్టంలాంటి ఎన్నో సంక్షేమ పథకాలు ఉమ్మడి పార్టీ అమలు చేయనున్నట్లు తెలిపారు. కనుక ఉమ్మడి అభ్యర్థులు కందుల నారాయణరెడ్డి, మాగుంట శ్రీనివాసరెడ్డిలకు రానున్న ఎన్నికలలో సైకిల్‌గుర్తుపై ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఇంటింటికి తిరుగుతూ ఉమ్మడి మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యే అభ్యర్థి కందుల నారాయణరెడ్డి, ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాస రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. గ్రామంలో 25 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరాయి. చేరిన వారిలో పెండెం పెదనాగేష్, పెండెం శ్రీను, పెండెం ఇంద్ర, అచ్చయ్య, పెండెం వెంకటేష్, పెండెం తిరుపతయ్య, కల్లు మహేష్, పెండెం బ్రహ్మనాయుడు, పెండెం శ్రీనివాసులు, పెండెం కొండయ్య పెండెం నవీన్, పెండెం వెంకటతేజ, ఒక్కయ్య, పెడెం వెలుగొండయ్య, జలిది వెంకటేష్, చినగురువయ్య, జలిది వివేక్, జలది ఏసురత్నం, జలిది దానయ్య, జలిది బాబు, జలిది లక్ష్మయ్య, జలిది బాలారావు, పెండెం కొండయ్యలతో పాటు 25 కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీ పార్టీలో చేరారు. పార్టీలో చేరినవారికి కందుల నారాయణరెడ్డి టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో కొనకనమిట్ల మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఆయాగ్రామాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

తర్లుపాడు : మండలంలోని తుమ్మలచెరువులో 25 వైసీపీ కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. ఈ సందర్భంగా మార్కాపురం నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందుల నారాయణరెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వారంరోజుల్లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీని గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ శాయశక్తులా కృషి చేయాలన్నారు. వైసీపీ నాయకులు ఇసుక మాఫియా, భూదోపిడి పార్టీకి నూకలు చెల్లాయన్నారు. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో తనకు, మాగుంట శ్రీనివాసులరెడ్డికి సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు రావి బాసపతిరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు ఉడుముల చిన్నపురెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షులు తిప్పిరెడ్డి వెలిగొండరెడ్డి, పి.గోపినాథ్ చౌదరి, నాగం తిరుపతయ్య, కాశీం, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

రోప్ స్కిప్పింగ్‌లో విద్యార్థిని ప్రతిభ



మొదటి బహుమతి సాధించిన మీనాక్షి

త్రిపురాంతకం, మే 6: నేపాల్‌లో జరిగిన దక్షిణాసియా స్థాయి రోప్ స్కిప్పింగ్‌లో మండలంలోని సోమేపల్లికి చెందిన మల్లీశ్వరి చిల్లీస్ కంపెనీ అధినేత పల్లెల ఇంద్రశేఖర్‌రెడ్డి కూతురు మీనాక్షి ప్రథమ స్థానం సాధించి బంగారు పతకాన్ని అందుకుంది. కాగా పతకం సాధించిన నేపథ్యంలో గ్రామస్థుల ఆధ్వర్యంలో చిల్లీస్ కంపెనీలో సిబ్బంది కేక్ కట్‌చేసి మీనాక్షికి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని, బహుమతులు పొందాలని ఆకాంక్షించారు.

71.67 శాతం పోస్టల్ బ్యాలెట్ పోలింగ్

మార్కాపురం, మే 6: మార్కాపురం జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మూడు రోజులుగా జరిగిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రంలో 71.67 శాతం పూర్తయినట్లు రిటర్నింగ్ ఆఫీసర్ రాహుల్‌మీనా తెలిపారు. మొత్తం 3047 ఓట్లకు 2184 ఓట్లు పోలైనట్లు తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు హక్కు ఉపయోగించుకోవాలన్నారు.

1395 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోల్

ఎర్రగొండపాలెం : ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 1722 మంది ఉండగ 1395 మంది సోమవారం సాయంత్రం 5 గంట లోపు ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిలో పోలీసులు, జర్నలిస్టులు 224 మంది కి పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఉండగా 133 మంది, పీవోలు, ఏపీవోలు, ఓపివోలు కలపి 1498 మంది ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఉండగా 1262 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

75.30 శాతం పోలింగ్

గిద్దలూరు : సోమవారం హోం ఓటింగ్, పోస్టల్ ఓటింగ్ ముమ్మరంగా జరిగింది. ఆదివారం 59 మంది ఇంటి వద్ద ఓటింగ్ చేయగా గిద్దలూరులోని జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలలో ప్రభుత్వ ఉద్యోగులు 1522 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. రెండు విభాగాలలో కలిపి 1705 ఓట్లు పోలయ్యాయి. ఈ 3 రోజులకు కలిపి 2619 ఓట్లు పోలుకాగా ఇందులో 242 హోం ఓట్లు, 2377 ఉద్యోగుల ఓట్లు నమోదయ్యాయి. సగటున రెండు విభాగాలకు 75.30 ఓట్లు పోలైనట్లు రిటర్నింగ్ అధికారి నాగజ్యోతి తెలిపారు.

టీడీపీతోనే ఆర్థికాభివృద్ధి సాధ్యం

- జనసేన ఇన్‌చార్జ్ ఇమ్మడి కాశీనాథ్



ప్రచారం నిర్వహిస్తున్న జనసేన ఇన్‌చార్జ్ ఇమ్మడి కాశీనాథ్

మార్కాపురం, మే 6: మాజీముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్ర ఆర్థికాభివృద్ధి సాధ్యమని జనసేన మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇమ్మడి కాశీనాథ్ అన్నారు. పట్టణంలోని 22వ వార్డులో సోమవారం కూటమి నాయకులు ఇంటింటికి మన కందుల ఎన్నికల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబునాయుడితోనే ఏపీలో సంక్షేమం, అభివృద్ధి సాధ్యమన్నారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే తల్లికి వందనం పథకంలో భాగంగా ఒక ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి ఒక్కొక్కరికీ రూ.15వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆడబిడ్డ నిధి కింద 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500లు, దీపం పేరుతో ఏడాదికి 3 ఉచిత సిలెండర్లు ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచితం ప్రయాణం, రైతుకు ఏటా రూ.20 వేలు ఆర్థిక సాయం చేయనున్నట్లు తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి బలపర్చిన అభ్యర్థులు కందుల నారాయణరెడ్డి, మాగుంట శ్రీనివాసులరెడ్డిలకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కందుల వసంతలక్ష్మి, టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ మల్లికార్జున్, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి వెంకట సత్యనారాయణ, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ మౌలాలి, కొప్పుల శ్రీనివాసులు, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

మాగుంట రాఘవరెడ్డి రక్తదానం



రక్తదానం చేస్తున్న రాఘవరెడ్డి

మార్కాపురం, మే 6: టీడీపీ ఒంగోలు పార్లమెంట్ యువనేత మాగుంట రాఘవరెడ్డి రక్తదానం చేశారు. స్థానిక ప్రభుత్వ జిల్లా వైద్యశాలలో రాఘవరెడ్డి సోమవారం టీడీపీ నాయకులతో కలిసి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి రక్తం ప్రాణదానంతో సమానమన్నారు. ప్రతి ఒక్కరూ అవకాశ ముస్నంతలో రక్తదానం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కంభంలో వైసీపీకి భారీ షాక్



టీడీపీ కండువా కప్పుకున్న స్టార్ బాషా

కంభం, మే 6 : కంభం పట్టణంలో వైసీపీకి భారీ షాక్ ఇస్తూ గిద్దలూరు ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి సమక్షంలో కంభం పట్టణ మాజీ సర్పంచ్ స్టార్ బాషా, ముస్లిం మైనారిటీ సీనియర్ నాయకులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారికి అశోక్‌రెడ్డి టీడీపీ కండువాలు కప్పి ఆహ్వానించారు. మే 13న జరిగే ఎన్నికల్లో కంభం పట్టణంలో గిద్దలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి అశోక్‌రెడ్డికి, ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసరెడ్డిల గెలుపునకు కృషి చేస్తామని తెలిపారు.

టీడీపీ విజయం తథ్యం

- ముత్తుముల పుష్పలీల, మాగుంట చందనరెడ్డి



ప్రచారం చేస్తున్న ముత్తుముల పుష్పలీల, మాగుంట చందనరెడ్డి

గిద్దలూరు టౌన్, మే 6 : శాసనసభ, పార్లమెంట్ ఎన్నికలలో టీడీపీ విజయాన్ని ఎవరూ ఆపలేరని గిద్దలూరు టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్ రెడ్డి సతీమణి ముత్తుముల పుష్పలీల, ఒంగోలు పార్లమెంటు అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి కోడలు మాగుంట చందనరెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారం లో భాగంగా సోమవారం మండలంలోని పొదలకొండపల్లె గ్రామంలో ఇరువురు విస్తృత ప్రచారం నిర్వహించారు. ప్రచార కార్యక్రమంలో గ్రామనాయకులు చేరెడ్డి జయరామిరెడ్డి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రోహిత్‌రెడ్డి ప్రచారం

మార్కాపురం రూరల్ : మండలంలోని బొడిచర్ల గ్రామంలో టీడీపీ పోల్ మేనేజ్మెంట్ ఇన్‌చార్జ్ కందుల రామిరెడ్డి తనయుడు రోహిత్‌రెడ్డి టీడీపీ నాయకులతో కలిసి సోమవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ టీడీపీ సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించారు. అమలు చేస్తామని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించి నారా చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలి అని కోరారు. కార్యక్రమంలో మండల, గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈదురు గాలుల బీభత్సం

- అరటి తోటలకు భారీ నష్టం



దెబ్బతిన్న అరటి తోటను చూపిస్తున్న రైతు మునగాల వెంకటరావు

కంభం, మే 6 : కంభంలో సోమవారం వీచిన ఈదురు గాలులు, భారీ వర్షానికి సుమారు 200 ఎకరాలకు పైగా అరటి చెట్లు నేలకొరిగాయి. దీంతో రూ.4 కోట్లమేర నష్టం వాటిల్లినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ అకాల వర్షానికి గెలలకు వస్తున్న చెట్లు మొత్తం మొదలుతో సహా నేలకొరగడంతో ఇప్పటివరకు పెట్టిన పెట్టుబడులన్నీ నేలపాలైనట్లు రైతులు తెలిపారు. ఆకుల మురళికి చెందిన 5 ఎకరాలు, షేక్ యూసఫ్ 3 ఎకరాలు, మునగాల వెంకటరావు 2 ఎకరాలు, గంజి వెంకటేశ్వర్లు 3 ఎకరాలు, షేక్ నాయబ్ 2 ఎకరాలు, మలామ్‌షా 2 ఎకరాలు, ఇబ్రహీం 5 ఎకరాలు, ఖాజా 3 ఎకరాలు, పార్శ ఆదెయ్య 2 ఎకరాలు, పలువురు రైతులకు చెందిన దాదాపు 200 ఎకరాలకు పైగా అరటిచెట్లు నేలకొరిగినట్లు తెలిపారు. ఎకరాకు 2లక్షల వరకు పెట్టుబడులు పెట్టామని, ప్రస్తుతం చెట్లు గెలలు వచ్చే సమయంలో అకాలవర్షంతో చెట్లన్నీ నేలకొరిగి రూ.4 కోట్లమేర నష్టం వాటిల్లినట్లు మునగాల వెంకటరావు రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఉద్యానవన శాఖాధికారులు నేలకొరిగిన పంటలను పరిశీలించి నష్టపరిహారం అందించాలన్నారు.

ఈదురు గాలులు, ఉరుములతో వర్షం



కంభంలో కురుస్తున్న వర్షం

కంభం మండలంలో సోమవారం మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. పదిరోజులు 45 డిగ్రీల ఉష్ణోగ్రతకు తోడు ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతుండగా సోమవారం మధ్యాహ్నం 2గంటల వరకు 45 డిగ్రీలు ఉండి వడగాలులు వీస్తున్న సమయంలో వాతావవరణంలో ఒక్కసారిగా ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. వాతావరణం చల్లబడడంతో పజ్రలు ఉపశమనం పొందారు. విద్యుత్ అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు.


చిరుజల్లులతో ఊరట

గిద్దలూరు టౌన్ : మండుతున్న ఎండలకాలంలో చిరుజల్లులు ప్రజలకు ఊరట కలిగించాయి. రోజురోజుకు ఎండలు పెరిగి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. దీంతో ప్రజలు ముఖ్యంగా వృద్ధులు చిన్నారులు ఉక్కపోతకు వేడిగాలులకు ఇబ్బందులకు గురవుతున్నారు. 45, 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్న క్రమంలో సోమవారం మధ్యాహ్నం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. చిరుజల్లులు కురిశాయి. దాంతో చల్లని గాలులతో కొద్దిమేర ప్రజలు ఊరట చెందారు. జల్లుల కంటే ముందు పెద్దఎత్తున ఈదురు గాలులు వీయడంతో దుమ్ముధూళితో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. పట్టణంలోని రెండు ప్రాంతాలలో విద్యుత్ తీగలు తెగిపడడంతో కొద్దిమేర విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఏదిఏమైనా చిరుజల్లులతో నెల నుంచి ఎండ వేడి భరించలేక ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలకు కొంతమేర ఉపశమనం లభించింది.

వడదెబ్బకు వృద్ధురాలి మృతి

మార్కాపురం, మే 6: వడదెబ్బకు గురై ఓ వృద్ధురాలు మృతిచెందిన ఘటన సోమవారం ఉదయం పట్టణంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు స్థానిక చెరువుకట్ట సమీపంలోని అలుగు వీధిలో నివాసముంటున్న షేక్ ఖాశింబీ(70) కొన్నేళ్లుగా మతిస్థిమితం సరిగా ఉండటంలేదు. ఇంట్లో ఎవరికీ చెప్పకుండా పట్టణంలో తిరుగుతుంటుంది. ఈ క్రమంలో సోమవారం ఉదయం పట్టణ పోలీసులకు గుర్తుతెలియని మృతదేహం స్థానిక డంపింగ్ యార్డ్ సమీపంలో ఉన్నట్లు గుర్తించారు. మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులు వడదెబ్బకు గురై చనిపోయినట్లు గ్రహించారు. ఈలోపు ఖాశింబీ కుటుంబ సభ్యులు సామాజిక మాధ్యమాల ద్వారా విషయం తెలుసుకుని మృతదేహాన్ని తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు.

పింఛన్ కోసం వృద్ధురాలి ఇక్కట్లు



పింఛన్ కోసం సచివాలయం వద్దకు వచ్చిన నరసమ్మ

పొదిలి, మే 6 :పింఛన్‌ల పంపిణీలో ప్రభుత్వం అనుసరించిన విధానం ఓ పండుటాకును తీవ్ర ఇక్కట్లకు గురి చేసింది. కొంత మందికి బ్యాంక్‌లో జమచేశామని మిగిలిన వారికి ఇళ్లకు వచ్చి ఇస్తామని చెప్పడంతో లబ్ధిదారులు ఎటువైపు వెళ్లాలో అర్థంకాక అయోమయానికి గురయ్యారు. బ్యాంక్‌లో జమకాలేదని బ్యాంక్ అధికారులు చెబుతుండగా తమ జాబితాలో పేరులేదంటూ సచివాలయ సిబ్బంది చెబుతున్నారు. దీంతో లబ్దిదారులు లబోదిబోమంటున్నారు. తీరా ఐదు రోజులకే యాప్ ముగించారని పంపిణీ నిలిపేశారు. దీంతో పింఛన్ అందని ఓ వృద్ధురాలు కన్నీటిపర్యంతమవతున్నారు. పొదిలికి చెందిన మామిళ్లపల్లి నరసమ్మ పింఛన్‌కోసం బ్యాంక్‌కు వెళ్లింది. అక్కడ నగదు జమకాలేదని బ్యాంక్ అధికారులు చెప్పారు. ఆ తరువాత సచివాలయం అధికారులను సంప్రదించింది. శనివారం రెండవ లిస్ట్‌లో మీ పేరు వచ్చిందని సూచించారు. శనివారం పింఛన్ కోసం వెళితే మార్కాపురంలో జరుగుతున్న బ్యాలెట్ ఓటింగ్‌లో పాల్గొనేందుకు అధికారులు వెళ్లారు. మరుసటి రోజు ఆదివారం కావడంతో సోమవారం సచివాలయానికి వెళ్లారు. యాప్ క్లోజ్ చేశారని పింఛన్ ఈ నెల లేదనే సమాధానం చెప్పడంతో పింఛన్ రాని వృద్ధులు ఒక్కసారిగా అవాక్కయ్యారు.

అధికారంలోకి రాగానే వెలిగొండ పూర్తి

కూటమి ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి



మాట్లాడుతున్న శ్రీనివాసులరెడ్డి, ఎరిక్షన్‌బాబు

పుల్లలచెరువు, మే 6: టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే వెలిగొండను పూర్తి చేసి ఈ ప్రాంత రైతాంగ చిరకాల కోరికను తీరుస్తామని టీడీపీ కూటమి ఒంగోలు ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి అన్నారు. సోమవారం పుల్లలచెరువు మండలం మల్లాపాలెం, వెంకటరెడ్డిపల్లి, రాచకొండ, వెంకటరెడ్డిపల్లె, ఉమ్మడివరం గ్రామాల్లో టీడీపీ కూటమి అభ్యర్థి ఎరిక్షన్ బాబుతో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వెలిగొండ ప్రాజెక్టు పనుల్లో టీ5కు రాష్ట్ర ప్రభుత్వం రూ.83 కోట్లతో బూటకపు జీవో ఇచ్చి రైతుల ఆశలుపై నీళ్ల చల్లారని అన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే టీ5 పనులు మొదలు పెడతామన్నారు. ఈ ప్రాంత వాసుల చిరకాల కోర్కైన మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేస్తామన్నారు. రాచకొండ పంచాయతీ ఉమ్మడివరంలో గ్రామ సచివాలయం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పయ్యావుల ప్రసాద్, టీడీపీ నాయకులు రెంటపల్లి సుబ్బారెడ్డి, కాకర్ల కోటయ్య, శనగా నారాయణరెడ్డి, మేడికొండ లక్ష్మినారాయణ, కుమార్, గజ్వేల్లి భాస్కర్, మునగాల రామిరెడ్డి, గోగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఉప్పల హనుమంతు, ఎంపీటీసీ రాధ,కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలో 20 కుటుంబాల చేరిక

పుల్లలచెరువు : మండలంలోని వైసీపీ నుంచి టీడీపీలోకి వలసల పరంపర కొనసాగుతోంది. శనివారం మల్లాపాలెంలో ఒంగోలు టీడీపీ ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసరెడ్డి, టీడీపీ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు ఆధ్వర్యంలో మండలం లోని పెద్దపీఆర్‌సీ తాండ పంచాయతీలోని చిన్న పీఆర్‌సీ తాండ ఉపసర్పంచి దేవసోత్ చిన్న మంత్రునాయక్ ఆధ్వర్యంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. 20 కుంటుంబాలకు వారు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాక్ష్యుడు పయ్యావుల ప్రసాద్, కాకర్ల కోటయ్య, శనగా నారాయణరెడ్డి, టీడీపీ మండల నాయకులు రెంటపల్లి సుబ్బారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల : ఎన్నికల ప్రచారంలో భాగంగా దోర్నాలలో మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎరిక్షన్ బాబులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాగుంట శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ.. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మార్కాపురం జిల్లా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గూడూరి ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో పేదవర్గాల ప్రజల అభివృద్ధి కోసం అమలు చేసిన పథకాలన్నీ జగన్‌మోహన్‌రెడ్డి రద్దు చేశారని ఆరోపించారు. వెలిగొండ కోసం సర్వస్వం త్యాగం చేసిన నిర్వాసితులకు పరిహారం అందేలా చూస్తామన్నారు. గ్రామాల్లో కనీసం గుక్కెడు తాగునీరు ఇవ్వలేని ప్రభుత్వం అవసరమా అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు ఏర్వ మల్లికార్జున రెడ్డి, నాయకులు షేక్ మాబు, దొడ్డా శేషాద్రి, ఈదర మల్లయ్య, దేను నాగేంద్రబాబు, చంటి,షేక్ సమ్మద్ భాష, చల్లా వెంకటేశ్వర్లు, షేక్ ఇస్మాయిల్, భాష, ఎలకపాటి చంచయ్య, కె శ్రీనివాసులు, కే సుబ్బారెడ్డి, షేక్ మంజూర్ భాష తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం, మే 6 పశ్చిమ ప్రకాశానికి తాగునీరు, సాగునీరు కావాలంటే వెలిగొండ ప్రాజెక్టును పూర్తిచేసే నాయకుడు చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి మాగుంట శ్రీనివాసరెడ్డి అన్నారు. ఎర్రగొండపాలెం మండలం గురిజేపల్లి గ్రామంలో సోమవారం సాయంత్రం టీడీపీ ఎన్నికల ర్యాలీ నిర్వహించి ప్రజలకు అభివాదం చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమంతో పాటు, మీ బిడ్డల భవిష్యత్ బాగుపడాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రి చేయాలన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా తనకు అసెంబ్లీ అభ్యర్థిగా గూడూరి ఎరిక్షన్ బాబు సైకిల్ గుర్తు పై ఓట్లు వేసి అధిక మెజారిటీతో గెలిపించాలని గురిజేపల్లి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల టీడీపీ అధ్యక్షులు చేకూరి సుబ్బారావు, వేగినాటి శ్రీను, వెన్నా వెంకిరెడ్డి, కందుల నారాయణరెడ్డి గ్రామప్రజలు పాల్గొన్నారు.



చిన్నమంత్రూనాయక్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాగుంట

మార్కాపురం ప్రాంత అభివృద్ధికి హితోధికంగా కృషి

ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి




రోడ్డుషోకు హాజరైన కార్యకర్తలు, అభివాదం చేస్తున్న మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎరిక్షన్‌బాబు

పెద్దారవీడు, మే 6: జిల్లాలో వెనుకబడిన మార్కాపురం ప్రాంత అభివృద్ధికి హితోధికంగా కృషి చేస్తానని టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి అన్నారు. మండలంలోని కుంట గ్రామంలో ఎర్రగొండపాలెం అసెంబ్లీ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబుతో కలిసి సోమవారం రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా మాగుంట శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ.. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మార్కాపురం ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేస్తామన్నారు. వెలిగొండ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తిచేసి కరువును పాలద్రోలతామన్నారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థలో సమూలమార్పులు తీసుకొచ్చి ఐటీ రంగ అభివృద్ధికి తోడ్పడింది చంద్రబాబునాయుడన్న విషయాన్ని గుర్తు చేశారు. ఏపీని అభివృద్ధి, సంక్షేమ రంగాలలో ప్రపంచానికి పరిచయం చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికి దక్కుతుందన్నారు. పేదలు ఆర్థికంగా బలోపేతం కావాలన్నా, యువత భవితకు భరోసా, మహిళలకు రక్షణ, బీసీల అభ్యున్నతి వంటి అంశాలు చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమన్నారు. గూడూరి ఎరిక్షన్ బాబు మాట్లాడుతు మాగుంట కుటుంబ సేవానిరతితో గతంలో మార్కాపురం ప్రాంతంలో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయడం ద్వారా ప్రజల దాహార్తి తీర్చడం జరిగిందన్నారు. రానున్న ఎన్నికలలో తనకు, ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసరెడ్డికి సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

వైసీపీ ప్రచారంలో తలమునకలైన ఉద్యోగులు




బయనపల్లె ప్రచారంలో జవాన్ నరసింహులు, నాయుడుపల్లెలో ఫీల్డ్ అసిస్టెంట్ సుబ్బారావు

గిద్దలూరు టౌన్, మే 6 : ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల నేపథ్యంలో పార్టీలకు, వారి కార్యక్రమాలకు దూరంగా ఉండాలనేది ఎన్నికల కమిషన్ దిశ నిర్ధేశాలు జారీ చేసింది. అయినప్పటికీ కొంత మంది ఉద్యోగులు వారి అభిమానాన్ని పోగొట్టుకోలేక వారి ఇష్టమైన పార్టీల వెంట తిరుగుతున్నారు. తాజాగా గిద్దలూరు మండలం నరవ పంచాయతీ పరిధిలోని నరవ బయన పల్లె గ్రామంలో వైసీపీ అభ్యర్థి కుందూరు నాగార్జునరెడ్డి ప్రచార కార్యక్రమం నిర్వహి స్తుండగా ఆర్మీ ఉద్యోగి చింతగుంట్ల నరసింహులు ప్రచారంలో పాల్గొని తన అభిమానాన్ని చాటుకున్నాడు. ఎన్నికల రిస్థితులు తెలుసుకుని కూడా అతను ప్రచారంలో పాల్గొనడం విశేషం. ఇదిలావుండగా గిద్దలూరు పట్టణం 17వ వార్డులో వలంటీర్‌గా పని చేస్తున్న పల్లె కిశోర్‌రెడ్డి వైసీపీ ప్రచారంలో కూడా అదే విధంగా పాల్గొన్నాడు. వలంటీర్‌గా పనిచేస్తూ ఒక పార్టీకి వంత పలుకడం సబబు కాదని తెలిసి కూడా అతను ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి వెంట ప్రచారంలో పాల్గొన్నాడు.

ఎన్నికల ప్రచారంలో ఫీల్డ్ అసిస్టెంట్

మార్కాపురం : మండలంలోని నాయుడుపల్లె పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ మన్నెం సుబ్బారావు ఆదివారం రాత్రి వైసీపీ అభ్యర్థి అన్నా రాంబాబు నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. పంచాయతీలోని నాయుడుపల్లె, మన్నెంవారి పల్లె గ్రామాల్లో జరిగిన ప్రచార కార్యక్రమం ప్రారంభం నుంచి ముగిసే వరకు అన్నీ తానై ముందుండి నడిపించాడు. వైసీపీ అభ్యర్థికి ఓటు వేసి మద్దతు తెలపకుంటే భవిష్యత్తులో పంచాయతీలో జరిగే ఉపాధిహామీ పనుల్లో మీకు ఇబ్బందులు తప్పవని హెచ్చరించాడు. దీంతో ప్రచార కార్యక్రమంలో తప్పక పాల్గొనాల్సి వచ్చిందని ఉపాధిహామీ కూలీలు వాపోయారు.



గొట్టిపాటి లక్ష్మిని కలిసిన జై మాదిగ సేవాసంఘం సభ్యులు

వైసీపీ పాలనలో దళితులపై పెరిగిన దాడులు

దొనకొండ, మే 6: రాష్ట్రంలో 27 దళిత పథకాలను తీసేసి, మాదిగలను అవమానకరంగా చూసిన ఘనత వైసీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి జగన్‌కే దక్కిందని జైమాదిగ సేవా సంఘం వ్యవస్థాపకుడు కొదమల బెంజిమెన్ మాదిగ పేర్కొన్నారు. జైమాదిగ సేవాసంఘం రాష్ట్ర పర్యటనలో బాగంగా సోమవారం దొనకొండ మండలంలో ఎన్నికల ప్రచారంలో ఉన్న దర్శి కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మిని కలిశారు. ఈసందర్భంగా బెంజిమెన్ మాదిగ మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి గత ఐదేళ్ళల్లో మాదిగ, మాదిగ ఉప కులాలకు ఏం చేశారని ప్రశ్నించారు. రాష్ట్రంలో దళితలపై దాడులు తీవ్రమయ్యాయని రాష్ట్రంలో మాదిగలు అన్నీ విషయాలు గుర్తుపెట్టుకున్నారని చెప్పారు. ఎన్నికల్లో ఓటుహక్కు ద్వారా జగన్ ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు మాదిగలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో జై మాదిగ సేవాసంఘం జిల్లా అధ్యక్షుడు సంధిపోగు రాంబాబు, కిరణ్, నగేష్, మురికిపొట్టి రాజేష్, ఆదాం వెంకటేశ్వర్లు, అంకయ్య, కృపయ్య తదితరులు పాల్గొన్నారు.

వెంగళాయపల్లిలో ఇంటింటా ప్రచారం

పీసీపల్లి, మే 6: మండలంలోని వెంగళాయపల్లి గ్రామంలో సోమవారం రాత్రి టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఓటుహక్కు ఎలా వినియోగించుకోవాలో డమ్మీ ఈవీఎంల ద్వారా అవగాహన కల్పించారు. టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఉగ్ర నరసింహారెడ్డి, ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసరెడ్డిలకు సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో గ్రామాల్లో ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టకపోగా ప్రశ్నించేవారిపై దాడులు జరిగాయన్నారు. డీజిల్, పెట్రోల్, గ్యాస్, కరెంట్, బస్సు చార్జీలను పెంచి ప్రజలను మరింత నష్టాల ఊబిలోకి నెట్టారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తిరుపతయ్య, కోమటిగుంట్ల వీరయ్య, కరణం గంగయ్య మహేష్, కమ్మ శివ, కరణం వెంకటేశ్వర్లు, తదిత రులు పాల్గొన్నారు.

పూర్ణచంద్రరావు మృతి బాధాకరం

దర్శి, మే 6: దర్శి పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి చందలూరి పూర్ణచంద్రరావు మృతి బాధాకరమని దర్శి అసెంబ్లీ టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి భర్త డాక్టర్ లలిత్‌సాగర్ పేర్కొన్నారు. పూర్ణచంద్రరావు వ్యాపారంతో పాటు టీడీపీ కార్యకర్తగా సుదీర్ఘకాలంగా కొనసాగుతున్నారన్నారు. వారి కుటుంబం పార్టీ ఆవిర్భావం నుంచి టీడీపీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తుందని చెప్పారు. పూర్ణచంద్రరావు గుండెపోటుతో మృతిచెందిన సమాచారంతో లలిత్‌సాగర్ ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్ణచంద్రరావు మృతి పార్టీకి తీరని లోటన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

ముండ్లమూరు, మే 6: మండలంలోని సింగనపాలెం గ్రామానికి చెందిన తెల్లమేకల చినవెంకయ్య ఆదివారం మధ్యాహ్నం శంకరాపురం, తిమ్మాయపాలెం గ్రామాల మధ్య ఆటో బోల్తాపడిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఒంగోలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడికి నలుగురు పిల్లలు ఉన్నారు.

రెండోసారి.. దొరికిపోయారు!

- పోలీసులకు మైనర్ దొంగల సవాల్!
- మాజీ మంత్రి శిద్దాకు బెదిరింపు లేఖ
- నిందితులు ముగ్గురూ టెన్త్ పరీక్షలు రాసిన విద్యార్థులు
- సీసీ ఫుటేజీ ఆధారాలతో పట్టివేత

ఒంగోలు(క్రైం), మే 6: 'మైనర్ దొంగలు' మరోసారి రెచ్చిపోయారు. మాజీ మంత్రి శిద్దా రాఘవరావు ఇంట్లో దోపిడీకి విఫలయత్నం చేసి పరారైన వారే తిరిగి ఆయన ఇంట్లో సోమవారం బెదిరింపు లేఖ పడేసి పోలీసులకు సవాల్ విసిరారు. అయితే రెండో ప్రయత్నంలో సీసీ ఫుటేజీ ఆధారంగా పోలీసులకు దొరికిపోయారు. నగరంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి పరీక్షలు రాసిన ముగ్గురు బాలురు నగదు కోసం ఈ పథకం రూపొందించడం కొసమెరుపు.

ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ తెలిపిన వివరాల ప్రకారం.. గతనెల 26వతేదీ రాత్రి ఇరువురు ఆగంతకులు కత్తులతో ఒంగోలులోని లాయర్‌పేటలో గల శిద్దా ఇంట్లోకి గోడ దూకి ప్రవేశించారు. వాచ్‌మన్‌పై కత్తితో దాడికి యత్నించారు. అయితే పక్కనే టేబుల్ పక్కన నిద్రపోతున్న గన్‌మన్ లేవడంతో వారు వాచ్‌మన్‌ను వదిలేసి పారిపోయారు. అయితే 27వతేదీ మధ్యాహ్నం వరకు విషయాన్ని రహస్యంగా ఉంచిన శిద్దా కుటుంబ సభ్యులు ఆ తర్వాత పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఏఎస్పీ(క్రైమ్స్) రంగంలోకి దిగారు. అప్పటినుంచి పోలీసు బృందాలు ఆగంతకుల కోసం వెతికినా ప్రయోజనం లేదు. మళ్లీ పదిరోజుల తర్వాత సోమవారం ఉదయం బైక్‌పై ఓ యువకుడు శిద్దా ఇంటికి ఉదయం పది గంటలకు వచ్చి బెదిరింపు లెటర్‌ను ఇంట్లో విసిరేసి పరారయ్యాడు. ఆ లెటర్‌లో.. 'మీ ఇంటి బాత్‌రూంలో బాంబులు పెట్టాం. అవి పేల్చివేస్తాం. మేం 15 మంది బ్యాచ్ ఉన్నాం. మీ కుటుంబాన్ని అంతం చేయాలనుకున్నాం. అయితే నాకు మధ్యాహ్నంలోపు పోలీసులకు చెప్పకుండా రూ.7కోట్లు నగదు పంపించు' అని రాశారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు ఆగంతకుల కోసం గాలింపు చేపట్టారు.

విషయం తెలుసుకున్న ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ ఏఎస్పీ క్రైమ్స్ శ్రీధరరావును అప్రమత్తం చేశారు. పోలీసులు పది బృందాలుగా ఏర్పడి దర్యాప్తు ప్రారంభించారు. బైక్ ఎటు నుంచి ఎటు వెళ్లిందీ అనే కోణంలో సీసీ ఫుటేజీ ఆధారంగా వెతుకులాట ప్రారంభించి ఆరు గంటలలో నిందితులను పోలీసులు పట్టుకున్నారు. నిందితులు ముగ్గురినీ అదుపులోకి తీసుకున్నామని ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ మీడియా సమావేశంలో పేర్కొన్నారు. నిందితులు మైనర్లు కావడంతో జువైనల్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆరు గంటల వ్యవధిలోనే నిందితులను పోలీసులు పట్టుకున్నారని వివరించారు. ఈ ఘటన నేపథ్యంలో జిల్లాలో వీవీఐపీలకు భద్రత పెంచుతున్నామని చెప్పారు.

అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యం

- టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ఉగ్ర
- వైసీపీని వీడిన 98 కుటుంబాలు

కనిగిరి, మే 6: అన్నివర్గాల సంక్షేమమే టీడీపీ లక్ష్యమని కూటమి అభ్యర్థి డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో సోమవారం డాక్టర్ ఉగ్ర సమక్షంలో 98 కుటుంబాలు టీడీపీలో చేరారు. కనిగిరి మండలం చల్లగిరగల గ్రామానికి చెందిన 23 కుటుంబాలు, హెచ్‌ఎంపాడు మండలంలోని వాలిచర్ల గ్రామానికి చెందిన 11 కుటుంబాలు, పామూరుకు చెందిన 64 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారికి టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ళ పాలనతో ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారన్నారు. కనిగిరి ప్రాంతం పూర్తిగా వెనుకబాటుకు గురైందన్నారు. కనిగిరి ప్రాంతం అభివృద్ధి కోసం తాను 5 అభివృద్ధి ప్రణాళికలతో ముందుకు సాగుతున్నట్టు చెప్పారు. టీడీపీ మేనిఫెస్టోతో ప్రజలకు పలు పథకాలతో లబ్ధి చేకూరుతుందన్నారు. యువతకు ఉపాధి, విద్యార్థుల ఉన్నత చదువులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, 50ఏళ్ళు దాటిన బీసీలకు పింఛన్ ఇవ్వనున్నట్టు చెప్పారు. కనిగిరి ప్రాంతాన్ని తాగు, సాగునీటి ఇబ్బందుల నుంచి శాశ్వత పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతిఒక్కరూ సైనికుల్లా పనిచేసి అత్యధిక మెజార్టీతో టీడీపీ అభ్యర్థులు విజయం సాధించేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పామూరులో రోడ్‌షో నిర్వహిస్తున్న ఉగ్ర తనయులు



టీడీపీలో చేరిన పామూరుకు చెందిన ముస్లిం కుటుంబాలు



వైసీపీని వీడి డాక్టర్ ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరిన కనిగిరి మండలం చల్లగిరగల గ్రామస్థులు

అరాచక పాలనకు చరమగీతం పాడాలి

పామూరు, మే 6: రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడాలని టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి తనయులు ఊహశ్రీరెడ్డి, జయసింహారెడ్డి పిలుపునిచ్చారు. టీడీపీ కూటమి అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ సోమవారం పామూరు పట్టణంలో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయం నుంచి అంకాలమ్మ దేవస్థానం, పోలేరమ్మ గుడి, ఆర్టీసీ బస్టాండ్ మీదుగా మమ్మిడాడి సెంటర్ వరకు రోడ్ షో నిర్వహించారు. ఓటర్లకు ఈవీఎం నమూనాతో ఓటు వేసే విధానం గురించి అవగాహన కల్పిస్తూ ప్రచారం చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే ప్రజలకు అందించే ఆరు గ్యారెంటీల వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. ఈనెల 13 న జరిగే పోలింగ్‌లో ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉగ్రను, ఎంపీ అభ్యర్థిగా మాగుంటను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, ఏలూరి వెంకటేశ్వర్లు, కేవీ రమణయ్య, యరవ శ్రీను, బొల్లా నరసింహారావు, ఆకుపాటి వెంకటేష్, డీవీ మనోహర్, కావిటి సుబ్బయ్య, రహీముల్లా, దరిశి ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమ పాలన చంద్రబాబుకే సాధ్యం

- టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దొనకొండ, మే 6: ఆదరించి, అవకాశమివ్వండి.. నియోజకవర్గంలో అభివృద్ధి చేసి చూపిస్తానని టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. సోమవారం మండలంలోని వద్దిపాడు, సంగాపురం, చిలకలపల్లి, అనంతవరం, మంగినపూడి, కలివెలపల్లి, వీరేపల్లి, సిద్దాయిపాలెం, నారపురెడ్డిపల్లి, కొచ్చెర్లకోట, బసిరెడ్డిపల్లి, కట్టకిందపల్లి, పుల్లాయిపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి జరగాలన్నా, మన పిల్లల భవిష్యత్తు బాగుండాలన్నా, ప్రజాసంక్షేమ పాలన కావాలన్నా చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే సాధ్యమన్నారు. అన్నిగ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈనెల 13న జరిగే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిగా మాగుంట శ్రీనివాసులరెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ రాచగొర్ల వెంకటయ్య, వీరపనేని వెంకన్నచౌదరి, మోడి వెంకటేశ్వర్లు, కామేపల్లి నారాయణమ్మ, విప్పర్ల లక్ష్మీరావు, తదితరులు పాల్గొన్నారు.



దర్శి: డాక్టర్ లలిత్‌సాగర్ సమక్షంలో టీడీపీలో చేరిన సామంతపూడి గ్రామస్థులు



దొనకొండ: అనంతవరంలో మాట్లాడుతున్న గొట్టిపాటి లక్ష్మి

అన్నివర్గాల అభ్యున్నతికి కృషి

దర్శి, మే 6: టీడీపీ కూటమి ప్రభుత్వం అన్నివర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తుందని డాక్టర్ లలిత్‌సాగర్ అన్నారు. మండలంలోని సామంతపూడి గ్రామానికి చెందిన పలు కుటుం బాలు సోమవారం వైసీపీని వీడి టీడీపీలో చేరారు. దర్శి అసెంబ్లీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి భర్త డాక్టర్ లలిత్‌సాగర్ వారికి టీడీపీ కండవాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలకుల అరాచక పాలనను సహించలేక ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరటం శుభపరిణామమన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు సారథ్యంలో జనరంజక పాలన సాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పోకూరి కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వేములబండ ఎస్సీ కుటుంబాలు

ముండ్లమూరు, మే 6: మండలంలోని వేములబండ ఎస్సీ కాలనీకి చెందిన 20 వైసీపీ కుటుంబాలు సోమవారం డాక్టర్ లలిత్‌సాగర్ సమక్షంలో టీడీపీలో చేరారు. కాలనీకి చెందిన కోనంటి వెంకటరావుతో పాటు 20 కుటుంబాలు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో సర్పంచ్ నిమ్మిలి కోటేశ్వరమ్మ, కొండయ్య, కంచుమాటి శ్రీనివాసరావు, దిరిశాల శ్రీనివాసరావు, దుగ్గినేని శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని వీడిన పది కుటుంబాలు

తాళ్లూరు, మే 6: తాళ్లూరు ఎస్సీ కాలనీకి చెందిన పది కుటుంబాలు వైసీపీని వీడి డాక్టర్ లలిత్‌సాగర్ సమక్షంలో టీడీపీలో చేరారు. టీడీపీ నాయకులు ఐ.శ్రీనివాసరెడ్డి, అనపర్తి సుబ్బారావు ఆధ్వర్యంలో దాసరి భాస్కర్‌రావు, నల్లూరి దానియేల్, నల్లూరి సుబ్బారావు, నల్లూరి మోజెస్, కందుల కోటయ్య, తదితరులతో పాటు పది కుటుంబాలు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

గొట్టిపాటి కుటుంబాన్ని ఆదరించండి

తాళ్లూరు, మే 6: గొట్టిపాటి కుటుంబ వారసురాలు టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మిని ఆదరించాలని దివంగత మాజీ ఎమ్మెల్యే నరసయ్య సతీమణి పద్మావతి అన్నారు. మండలంలోని తూర్పుగంగవరం, లింగాలపాడు గ్రామాల్లో లక్ష్మి విజయాన్ని కాంక్షిస్తూ సోమవారం రాత్రి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు వసతి, ఏడాదికి మూడు గ్యాస్ సిలెండర్లు ఉచితంగా అందజేయనున్నట్టు చెప్పారు. తల్లికి వందనం కింద చదువుకునే పిల్లలకు ఏడాదికి రూ.15 వేలు ఇవ్వనున్నట్టు చెప్పారు. టీడీపీ కూటమి వల్ల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. కూటమి అభ్యర్థులు గొట్టిపాటి లక్ష్మిని ఎమ్మెల్యేగా, మాగుంట శ్రీనివాసులరెడ్డిని ఎంపీగా భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

కార్యక్రమంలో టీడీపీ నేతలు కె. రామలక్ష్మయ్య, వి.సుబ్బయ్య, చందన, కాశిరెడ్డి, మీరామెహిద్దీన్, జనసేన నాయకులు వై.చిరంజీవి, మారాబత్తుల సుజాత, తోట క్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.



తాళ్లూరు: తాతాతూర్పుగంగవరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న గొట్టిపాటి పద్మావతి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

అర్హులందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

దర్శి, మే 6: అర్హులందరూ తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించు కోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దినేష్‌కుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటుచేసిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించారు. అక్కడ ఏర్పాటుచేసిన మౌలిక వసతులను, తాగునీటి వసతిని పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు, ఇతర అత్యవసర సర్వీసుల్లో ఉండే ఉద్యోగులకు ముందుగానే ఓటుహక్కు వినియోగించుకునే అవకాశాన్ని పోస్టల్ బ్యాలెట్ ద్వారా కల్పించారన్నారు. ఉద్యోగులు నిర్భయంగా, స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ శౌర్యమన్‌పటేల్, దర్శి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి లోకేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్



పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఉపాధ్యాయులు

కనిగిరి, మే 6: బ్యాలెట్ ఓటింగ్‌లో మూడవ రోజు సోమవారం ఉపాధ్యాయులు మరింత ఉత్సాహం కనపరచారు. స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో సోమవారం బ్యాలెట్ ఓటింగ్ సరళి ని ఆర్‌ఓ జాన్‌ఇర్విన్ పరిశీలించి తగు సూచనలు చేశారు. మూడవ రోజు ఓటింగ్ శాతం పెరిగినట్లు ఆయన చెప్పారు. దీంతో ఉపాధ్యాయులు, ఓపీఓ, పోలీస్, బీఎల్‌ఓలు, జైల్ సిబ్బంది, ఆర్టీసీ, అంగన్వాడీ సిబ్బంది 869 మంది బ్యాలెట్ ఓటు హక్కు వినియోగించుకున్నట్లు ఆర్‌ఓ తెలిపారు. మూడు రోజులుగా 2120 మంది ఓటుహక్కు వినియోగించుకున్నట్లు తెలిపారు. ఓటుహక్కును వినియోగించుకునేందుకు ఎక్కువగా ఉపాధ్యాయులు బారులు తీరారు. పెరిగిన వేసవి ఉష్ణోగ్రతల దృష్ట్యా ఎన్నికల అధికారులు ఓటింగ్ కేంద్రం వద్ద ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, మందులు అందుబాటులో ఉంచినట్లు ఆర్‌వో చెప్పారు.

వైసీపీని వీడిన 4 కుటుంబాలు

పామూరు, మే 6: మండలంలోని దూబగుంట గ్రామానికి చెందిన 4 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు సమక్షంలో సోమవారం పార్టీలో చేరారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జులు అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, గుంటుపల్లి శ్రీనివాసులు, శివశంకర్, కేతు విజయభాస్కర్‌రెడ్డి, తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

కాగా, ఉగ్ర క్యాంపు కార్యాలయంలో దూబగుంట పంచాయతీకి చెందిన కాటం వెంకటేశ్వరరెడ్డితోపాటు మరో నాలుగు కుటుంబాలు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో బి.జయరామిరెడ్డి, రెక్కల వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

అరెస్ట్ చేస్తారన్న భయంతో..

యువకుడు ఆత్మహత్యాయత్నం

- కాలిన గాయాలతో ఆసుపత్రికి తరలింపు
- ఆరోగ్యపరిస్థితి విషమం.. గార్లపేటలో సంఘటన

మర్రిపూడి, మే 6 : పోలీసులు అరెస్ట్ చేస్తారన్న భయంతో పోలీస్ వాహనం ఎదుట ఓ యువకుడు పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఆదివారం రాత్రి మర్రిపూడి మండలంలోని గార్లపేటలో కలకలం సృష్టించింది. గ్రామానికి చెం దిన గుమ్మళ్ళ వెంకటేష్ మూడురోజుల క్రితం ట్రాక్టర్ నడుపుకుంటూ వెళుతుండగా కనిగిరి మండలం ఎనిమిరెడ్డిపల్లెకు చెందిన దంపతులు బైక్‌పై వస్తూ ట్రాక్టర్‌ను తప్పించబోయి అదుపుతప్పి పక్కకు పడ్డారు. ఈ సందర్భంలో వారి మధ్య వివాదం నెలకొంది. మాటామాట పెరగడంతో వెంకటేష్‌పై భార్యభర్తలతోపాటు మరికొందరు దాడి చేశారు. విషయాన్ని మనసులో పెట్టుకున్న వెంకటేష్ ఆదివారం సాయంత్రం కొందరు యువకులను వెంటబెట్టుకొని ఎనిమిరెడ్డిపల్లెకు వెళ్ళి తనను కొట్టిన భార్యభర్తలపై తిరిగి దాడి చేశారు.

ఈ సందర్భంగా గ్రామస్థులు వారిలో ముగ్గురిని పట్టుకొని కనిగిరి పోలీసులకు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన పోలీసులు గ్రామానికి చేరుకొని ముగ్గురిని వాహనంలో ఎక్కించుకొని గార్లపేట వైపునకు వస్తుండగా ఆ గ్రామ కూడలిలో ఉన్న వెంకటేష్ పోలీసులు తనను అరెస్ట్ చేసేందుకు వస్తున్నారని భయపడి ఒంటిపై పెట్రోలు పోసుకొని ఒక్కసారిగా నిప్పు అంటించుకున్నాడు. పోలీసులు అప్రమత్తమై మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. తీవ్రగాయాలతో ఉన్న వెంకటేష్‌ను కనిగిరికి తరలించి అక్కడ నుంచి మెరుగైన వైద్యంకోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

సోమవారం కనిగిరి డీఎస్పీ రామరాజు కనిగిరి, కొండపి సీఐలు వెంకటేశ్వర్లు, వై. పాండురంగారావులు సంఘటన స్థలాన్ని సందర్శించి కేసు పూర్వాపరాలు తెలుసుకున్నారు. ఎనిమిరెడ్డిపల్లిలో కూడా జరిగిన ఘటనపై స్థానికులను విచారించారు. ఆత్మాహత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై మర్రిపూడి స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పాండురంగారావు తెలిపారు. అంతకు ముందు ఎనిమిరెడ్డిపల్లిలో జరిగిన దాడులపై కనిగిరి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్లు తెలిసింది.

సమస్యాత్మక గ్రామాల్లో కవాతు

తాళ్లూరు, మే 6: గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా ఎన్నికలు నిర్వహించేందు పోలీస్ శాఖ పటిష్ట చర్యలు చేపట్టింది. ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ ఆదేశాల మేరకు సమస్యాత్మక గ్రామాల్లో పారా మిలటరీ బలగాలతో కవాతు నిర్వహించారు. మండలంలోని సమస్యాత్మక గ్రా మాలైన తూర్పుగంగవరం, నాగంబొట్లపాలెం, బొద్దికూరపాడు, తురకపాలెం, లక్కవరం తదితర గ్రామాలో కవాతు నిర్వహించారు.

కార్యక్రమంలో ఎస్సై వైవీరమణయ్య, ఏఎస్సై మోహన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.





ఆర్వోపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డాక్టర్ గోపిరెడ్డి

వైసీపీ శ్రేణుల.. హల్‌చల్



దాడిలో గాయపడిన టీడీపీ కార్యకర్తలు



దాడిలో ధ్వంసమైన కారు అద్దాలు

నరసరావుపేట ఫెసిలిటేషన్ కేంద్రం వద్ద ఉద్రిక్తత

- పోలీసుల సాక్షిగా టీడీపీ కార్యకర్తలపై వైసీపీ దాడి
- కారు ధ్వంసం.. పలువురికి గాయాలు ఆస్పత్రికి తరలింపు
- భయాందోళనతో ఓటు హక్కు వినియోగించుకోకుండానే వెనుతిరిగిన ఉద్యోగులు
- సత్తెనపల్లి కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ కారుపై దాడి

నరసరావుపేట, మే 6: పోలింగ్ సమయం దగ్గరపడుతుంది. ప్రశాంత ఎన్నికలకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసు అధికారులు ప్రకటిస్తున్నారు. స్వేచ్ఛాయుత ఓటింగ్‌కు ఏర్పాట్లు చేసినట్లు ఎన్నికల అధికారులు చెప్తున్నారు. కానీ పల్నాడులో మరోసారి వైసీపీ మూకలు బరి తెగించాయి. నరసరావుపేట పల్నాడు రోడ్డులోని ఎస్ఎస్ఎన్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ కేంద్రం వద్ద వైసీపీ శ్రేణులు హల్‌చల్ చేశాయి. వైసీపీ మూకలు కేంద్రాన్ని చుట్టుముట్టారు. పోలీసుల సాక్షిగా గంట పాటు కర్రలు.. రాళ్లతో వీరంగం వేశారు. పసుపు కండువ ధరించిన వారిని టార్గెట్ చేసి దాడిచేసి గాయపరిచాయి. భయభ్రాంతులకు గురైన కొందరు ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకోకుండానే వెనుతిరగాల్సి వచ్చింది. ఈ సంఘటలనతో పల్నాడు రోడ్డులో ఉద్రికత్త పరిస్థితుల నెలకొన్నాయి. సత్యనారాయణ రెడ్డి అనే విశ్రాంత ఆర్మీ ఉద్యోగి ఎస్ఎస్ఎన్ కళాశాలలోని ఫెసిలిటేషన్ కేంద్రానికి రాగా విశ్రాంత ఆర్మీ ఉద్యోగికి ఓటు ఉండదని అక్కడి అధికారులు చెప్పారు. ఆ తర్వాత ఆయన కేంద్రం వద్ద పోలీసులతో ముచ్చటిస్తున్నారు. ఆ సమయంలో టీడీపీ అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు అక్కడకు రాగా ఆయన కారును కేంద్రం లోపలికి అనుమతించలేదు. దీంతో వాదన మొదలుకావడం, అక్కడున్న సత్యనారాయణరెడ్డి మొబైల్ ఫోన్‌పై వైసీపీ స్టిక్కర్‌ను టీడీపీ కార్యకర్తలు గమనించి మందలించి ఆ స్టిక్కర్‌ను తొలగించారు. సత్యనారాయణరెడ్డిపై టీడీపీ కార్యకర్తలు దాడి చేశారన్న సమాచారం వైసీపీ అభ్యర్థి గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికి తెలిసింది. దీంతో ఆయన తన అనుచరులతో కలసి కేంద్రంలోకి ప్రవేశించారు. సత్యనారాయణరెడ్డిపై దాడి జరుగుతుంటే పోలీసులు ఏం చేస్తున్నారని ఆర్వో సరోజపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ క్రమంలో కళాశాలకు ఎదురుగా ఉన్న వైసీపీ కార్యాలయం నుంచి కర్రలు, రాళ్లతో వచ్చిన వైసీపీ మూకలు కేంద్రం వద్దకు చేరి టీడీపీ శ్రేణులపై దాడులకు తెగబడ్డాయి. పసుపు కండువా ఉన్న వ్యక్తులే లక్ష్యంగా వారిపై దాడి చేసి గాయపరిచాయి. వైసీపీ మూకల దాడులతో కేంద్రం వద్ద ఓటు వేయడానికి వచ్చిన ఉద్యోగులతో పాటు పల్నాడు రోడ్డులోని సాధారణ ప్రజలు భయకంపితులయ్యారు.

అదే సమయంలో అటు వైపు వెళ్తున్న సత్తెనపల్లి కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ కారుపై కర్రలతో వైసీపీ మూకలు దాడిచేశాయి. అద్దాలు ధ్వంసం చేసి కారు టైర్లలో గాలితీసేశారు. గంట పాటు ఇష్టం వచ్చినట్లుగా దాడులకు తెగబడుతున్నా అక్కడకు పోలీసులు ప్రేక్షక పాత్రకే పరిమితమ య్యారు. గాయపడిన టీడీపీ కార్యకర్తలను స్థానికులు ఆస్పత్రులకు తరలించారు.

వైసీపీ కార్యాలయం ఎదురుగానే బ్యాలెట్ కేంద్రం

పోస్టల్ బ్యాలెట్ కేంద్రం ఏర్పాటులో ఎన్నికల అధికారులు నిబంధనలు పాటించలేదు. ఏకంగా వైసీపీ ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ కార్యాలయం ఎదురుగానే కేంద్రం ఏర్పాటు చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒక పార్టీ కార్యాలయం ఎదురు పోస్టల్ బ్యాలెట్ కేంద్రం ఎలా ఏర్పాటు చేశారన్న ప్రశ్నలు ఉత్పన్నమయ్యాయి. అక్కడ ఎప్పుడూ వందలాది మంది వైసీపీ కార్యకర్తలు ఉంటారు. పార్టీ కార్యాలయం గేటు ఎదురుగానే బ్యాలెట్ కేంద్రం గేటు ఉంది. సదరు కార్యాలయంలో కర్రలు, రాళ్లు ఎందుకు ఉన్నాయి. ఇప్పటికైనా పోస్టల్ బ్యాలెట్ కేంద్రం మార్చాలని ఉద్యోగులు కోరుతున్నారు. లేకుంటే భారీగా భద్రత కల్పించాలంటున్నారు.



పల్నాడు రోడ్డులో కర్రలతో వైసీపీ కార్యకర్తల వీరంగం

ఇప్పుడే ఇలా.. పోలింగ్ రోజు పరిస్థితి?

పోస్టల్ బ్యాలెట్ కేంద్రం వద్ద ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించడంలో యంత్రాంగం విఫలమైందనేందుకు సోమవారం నరసరావుపేటలో జరిగిన ఘటనే నిదర్శనం. ఓటు గుర్తింపు స్లిప్ ఉన్నవారిని, అభ్యర్థులు, వారి ఏజెంట్లను మాత్రమే కేంద్రంలోకి అనుమతించాల్సి ఉండగా ఇందుకు విరుద్ధంగా అధికారులు వ్యవహరించినందునే ఈ ఘర్షణ చోటు చేసుకుందన్న విమర్శలు వస్తున్నాయి. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ నిర్వహణలో యంత్రాంగం, పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించినందునే వైసీపీ మూకలు దాడులకు తెగబడ్డాయన్న విమర్శలున్నాయి. పరిమిత ఓటర్లు ఉండే ఈ పోస్టల్ పోలింగే ఇలా నిర్వహిస్తే 13న జరిగే అసలు పోలింగ్ పరిస్థితి ఎలా ఉంటుందోనన్న భయాందోళనలు ఓటర్ల నుంచి వ్యక్తమవుతున్నాయి. పలు పోలింగ్ బూత్‌ల వద్ద ఇదేరకమైన దాడులకు తెగబడేందుకు వైసీపీ రంగం సిద్ధం చేసుకుంటుందన్న ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో పోలీసు శాఖ ఎలాంటి చర్యలు తీసుకుని ప్రశాంత ఎన్నికలు నిర్వహిస్తుందో చూడాలి.

అరాచకాలపై ఖండన


● శ్రీకృష్ణదేవరాయలు, అరవిందబాబు

ఓటమి భయంతోనే ఓటర్లను ఇబ్బంది పెట్టే అరాచక చర్యలకు వైసీపీ నేతలు పాల్పడుతున్నారని కూటమి నరసరావుపేట ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు లావు శ్రీకృష్ణదేవరాయలు, డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు తెలిపారు. నరసరావుపేట మండలం పెట్లూరివారిపాలెంలో సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉద్యోగస్తులు టీడీపీ వైపే ఉండడంతో వైసీపీ నేతల్లో భయం మొదలై ప్రశాంతంగా జరుగుతున్న బ్యాలెట్ ఓటింగ్ వద్ద అలజడి సృష్టించారన్నారు. ఇలాంటి చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎస్ఎస్ఎన్ కళాశాలలోని పోస్టల్ బ్యాలెట్ కేంద్రంలోకి నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ మూకలు ప్రవేశించి లోపలే సమావేశాలు పెట్టారన్నారు. దాదాపు 30 మందికి పైగా వైసీపీకి చెందిన వ్యక్తులు ఎన్నికల కాంపౌండ్ లోపలికి ప్రవేశించారన్నారు. ఎమ్మెల్యే గోపిరెడ్డి, ఆయన అనుచరులు టీడీపీ శ్రేణులపై దాడి చేయ డాన్ని ప్రజలు గమనించార న్నారు. ఈ ఘటనపై ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పోలీసులు ప్రశాంత ఎన్ని కలకు సహకరించాలని కోరారు. సమావేశంలో జనసేన నేత సయ్యద్ జిలానీ పాల్గొన్నారు.



సేవ.. సంకల్పం

- రాజకీయాలకు తావులేకుండా చేస్తా
- బాపట్ల అభివృద్ధికి ఐదేళ్ల పత్యేక ప్రణాళిక
- జిల్లాకు గుర్తింపుతో పాటు పరిశ్రమలు తీసుకొస్తా
- నాడు చంద్రబాబు నాయకత్వంలో ఎన్నో చేశా.. మళ్లీ చేస్తా
- ఆంధ్రజ్యోతితో బాపట్ల లోక్‌సభ కూటమి అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్



● తెన్నేటి కృష్ణప్రసాద్. బాపట్ల కూటమి ఎంపీ అభ్యర్థి

బాపట్ల, మే 6: ఐపీఎస్ అధికారిగా ప్రజలకు, పోలీసులకు మధ్య స్నేహ సంబంధాలు ఏర్పాటు చేశా. ఉద్యోగ విరమణ నుంచి ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాను. ప్రజలకు మరింతగా సేవలు అందించేందుకు రాజకీయరంగంలోకి అడుగుపెట్టాను. నాడు ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు నాయకత్వంలో పనిచేశాను. తిరిగి ఆయన నాయకత్వంలో ప్రస్తుతం బాపట్ల ఎంపీగా గెలిచి ప్రజలకు సేవ చేస్తాను. రాజకీయాలకు తావులేకుండా ప్రజలకు సేవలు అందించడంతో పాటు బాపట్ల ప్రాంతాన్ని ప్రత్యేక ప్రణాళికతో అభివృద్ధి చేస్తాను.. అని కూటమి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తెన్నేటి కృష్ణప్రసాద్ తెలిపారు. బాపట్ల లోక్‌సభ పరిధిలో పరిశ్రమలు తీసుకొచ్చి లక్షలాది మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే తన లక్ష్యమన్నారు. యువతకు ఉపాధి కల్పించి నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ప్రజలు నమ్మకం ఉంచి గెలిపిస్తే వారిలో ఒకరిగా కలిసి జీవిస్తానన్న తెన్నేటి ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్తున్న కృష్ణప్రసాద్ వివిధ అంశాలపై తెలిపిన వివరాలు ఆయన మాటల్లోనే..

హైదరాబాద్ అభివృద్ధిలో భాగస్వామ్యం

ఉమ్మడి రాష్ట్రంలో 1999-2004 మధ్య ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఈడీగా పనిచేసిన సమయంలో హైదరాబాద్ హైటెక్ సిటీ, ఔటర్ రింగ్‌రోడ్డు, శంషాబాద్ ఎయిర్‌పోర్ట్, సైబరాబాద్ నిర్మాణం వంటివి చేపట్టాను.చంద్రబాబు విజన్, దూరదృష్టితో ఇంతటి అభివృద్ధి చేయగలిగాం. అదే స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్‌లో కూడా అమరావతిని మంచి రాజధానిగా అభివృద్ధి చేసి పరిశ్రమలు తీసుకొచ్చి 5 లక్షల మందికి ఉద్యోగవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తాను.

నాన్‌లోకల్ ప్రచారంపై ..

నేను పుట్టింది గోదావరి జిల్లా. పెరిగింది కృష్ణా పరివాహక ప్రాంతం. హైదరాబాద్‌లో చదివాను. అంత మాత్రాన నాన్‌లోకల్ ఎలా అవుతాను. నెల్లూరు, కర్నూలు, గుంటూరు, విజయవాడ, ఈస్ట్‌గోదావరి, విశాఖలో ఏఎస్పీగా, ఎస్పీగా, ఐజీగా ప్రస్థానం కొనసాగించాను. బాపట్లలోనే ఉంటా బాపట్ల ప్రజల సంక్షేమం కోసం పని చేస్తా. విద్యావంతుడిగా ఈ ప్రాంతానికి ఏమి చేయాలో అవగాహన ఉంది. పార్లమెంట్‌లో బాపట్ల వాణి వినిపించి ఈప్రాంత అభివృద్ధికి కృషి చేస్తా.

ఫౌండేషన్ సేవలు

మూడున్నర దశాబ్దాల పాటు పోలీసు అధికారి గా ప్రజలకు సేవలందించా ను. ఉద్యోగ విరమణ తర్వాత కేపీ, మలుపు ఫౌండేషన్లు ఏర్పాటు చేసి లక్షలాది మంది ప్రజలకు సేవలందించాను. కోవిడ్ సమయంలో ప్రజల కోసం ఎన్నో సేవా కార్యక్రమాలు చేశాను. ఇప్పటికీ ఫౌండేషన్ ద్వారా సేవలందిస్తాను. రాజకీయ నాయకుడిగా గెలిచి సేవలు మరింతగా విస్తరించేందుకు కృషి చేస్తాను.

ప్రచారం.. అనుభవాలు

ఎన్నికల ప్రచారంలో బాపట్ల ప్రాంత ప్రజలు నీరజనాలు పలుకుతున్నారు. విజయం కోసం కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున కృషి చేస్తున్నారు. ప్రజల అభిమానం చూస్తుంటే గెలుపు నా దేననే ధీమా ఉంది. ప్రజలు నుంచి మంచి స్పందన వస్తున్నది. చెప్పినవన్నీ చేయడానికి నా గెలుపు ఎంతో ముఖ్యం. బాపట్ల ప్రాంత ప్రజలు నన్ను గెలిపించి తీరుతారనే సంపూర్ణ విశ్వాసం ఉంది.

అభివృద్ధి.. ఉపాధి

చీరాలలో చేనేత కార్మికుల కోసం టెక్స్‌టైల్ పార్క్ తీసుకొచ్చి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తీసుకొస్తాను. బాపట్ల-చీరాలలో హైటెక్ టూరిజం ప్రాజెక్ట్ తీసుకురావడంతో పాటు చిత్ర పరిశ్రమ ఏర్పాటుకు కృషి చేస్తా. పర్చూరు-అద్దంకిలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు మెరుగు పరుస్తా. వేమూరు, సంతనూతలపాడు లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు నెలకొల్పి యువతలో నైపుణ్యాలు పెంపొందించేందుకు కృషి చేస్తా. నిజాంపట్నం తీరంలో పోర్టు నెలకొల్పడంతోపాటు చీరాల ఓడరేవులో ఫిషింగ్ హార్బర్‌ను ఏర్పాటు చేయిస్తా. బాపట్ల ప్రాంతంలో విద్యావ్యాప్తికి కృషి చేస్తాను. వ్యవసాయ, ఇంజనీరింగ్ విద్యలకు అనుబంధంగా ఉన్నత విద్యను తీసుకొచ్చి విద్యార్థుల కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తాను.

ఐదేళ్ల ప్రణాళిక

బాపట్లలోనే నివాసం ఉండి ఈ ప్రాంత ప్రజలకు మేలు చేసేలా ప్రణాళికను రూపొం దిస్తా. కేంద్ర ప్రభుత్వంతో సత్సంబంధాలు ఏర్పాటు చేసుకుని పరిశ్రమలు, టూరిజం, ఫిల్మ్ ఇండస్ట్రీ వంటివి తీసుకొచ్చి బాపట్ల యువత కు ఉపాధి కల్పిస్తాను. గతంలో గంగవరం, కృష్ణపట్నం పోర్టుల నిర్మాణానికి కృషి చేశాను. అదే అనుభవంతో నిజాంపట్నం పోర్టు, ఓడరేవు ఫిషింగ్ హార్బర్ ఏర్పాటుకు కృషి చేస్తాను. 10వేల కోట్లతో పోర్టు నిర్మాణం చేస్తే లక్ష కోట్ల పెట్టుబడులు వస్తాయి. తద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. బాపట్ల పార్లమెంట్‌లో విస్తారంగా ఉన్న తీరప్రాంతంలో జెట్టీల నిర్మాణం చేపడుతాం. కొత్తపరిశ్రమలు నెలకొల్పడం ద్వారా పెట్టుబడులు పెరుగుతాయి. బాపట్లను ఎడ్యుకేషన్ హబ్‌గా అభివృద్ధి చేస్తాను. బయో టెక్‌సిటీ ఏర్పాటుకు కృషి చేస్తాను. ఐటీ టవర్ కడతాం. చేనేత కార్మికులు, దేవాంగుల కొరకు అంతర్జాతీయ డిజైన్‌తో పేటెంట్ కల్పించి ఇంటర్నేషనల్ మార్కెట్‌లో ప్రవేశం కల్పించి ఉపాధి అవకాశాలు పెంచుతాను. సంతనూతలపాడు, చీమకుర్తి, అద్దంకిలలో గ్రానైట్ కారిడార్ ఏర్పాటు చేస్తాను.

పోస్టల్ బ్యాలెట్‌కు పైసలు



- ఉద్యోగుల ఓట్లకు యమ డిమాండ్
- కొనుగోళ్లలో అధికార వైసీపీ అభ్యర్థులు
- రూ.2 వేల నుంచి రూ.7 వేల వరకు ఆఫర్
- ఉదయం నుంచే కేంద్రాల వద్ద నేతల అనుచరుల తిష్ట
- యూనియన్ నేతల ద్వారా ఉద్యోగుల ప్రసన్నానికి ప్రయత్నాలు
- ఐదేళ్లుగా జరిగిన అన్యాయంపై నేతలను నిలదీస్తున్న ఉద్యోగులు

గుంటూరు, బాపట్ల, నరసరావుపేట, మే 6 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధులకు హాజరయ్యే ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్‌కు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఇప్పటికే పీవో, ఏపీవో, మైక్రో అబ్జర్వర్లు తమ ఓటుహక్కుని వినియోగించుకున్నారు. అయితే వీరి సంఖ్య తక్కువగానే ఉన్నది. ఎన్నికల విధుల్లో అత్యధిక సంఖ్యలో ఉండే పోలీసులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ, వైద్య ఆరోగ్య శాఖ, సచివాలయాల సిబ్బందితో పాటు కాంట్రాక్టు ఉద్యోగులకు మంగళ, బుధవారాల్లో పోస్టల్ బ్యాలెట్ వినియోగించేందుకు అవకాశం ఇచ్చారు. నియోజకవర్గాల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి పెద్ద సంఖ్యలో ఉద్యోగులు బారులు తీరారు. ఉద్యోగుల్లో ఎక్కువమంది ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్న దృష్ట్యా వీరి ఓట్లపై వైసీపీ అభ్యర్థులు దృష్టి పెట్టారు. ఎలాగైనా ఉద్యోగులను ప్రసన్నం చేసుకుని వారి ఓటును తమకు అనుకూలంగా వేయించుకునేందుకు డబ్బు రూపంలో ప్రలోభ పెట్టేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో ఆ రేటు రూ.2 వేల నుంచి రూ.7 వేల వరకు ఇచ్చేందుకు అభ్యర్థులు ముందుకు వచ్చారంటే పోస్టల్ బ్యాలెట్‌కు ఏ స్థాయిలో డిమాండ్ ఉందో తెలుస్తోంది. ఉద్యోగులను అనుకూలం చేసుకునేందుకు మరికొందరు ఉద్యోగ సంఘ నేతలను సంప్రదించి బేరసారాలకు తెరలేపారు. ఉద్యోగులు వైసీపీకి వ్యతిరేకంగా ఉన్నారనే అంచనాల నేపథ్యంలో వారికి ఓటుకు రూ.5,000 చెల్లించాలని తాడేపల్లి పెద్దలు అభ్యర్థులకు ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. నేతల అనుచరులు పోస్టల్ బ్యాలెట్ కేంద్రాల దగ్గరే మకాం వేసి ఉద్యోగులను ప్రలోభపెట్టడానికి ప్రయత్నిస్తున్నారు. ప్రలోభాలపై టీడీపీ నేతలు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడంపై విమర్శలకు తావిస్తోంది. మరోవైపు గంపగుత్తగా ఉద్యోగుల ఓట్ల కొనుగోలుకు యూనియన్ నేతల ద్వారా వైసీపీ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే యూనియన్ నేతలతో పాటు, పలువురు ఉద్యోగుల నుంచి బేరసారాలపై తిరస్కారమే ఎదురవుతుంది. ఐదేళ్లుగా వైసీపీ పాలనలో తమకు జరిగిన అన్యాయంపై నేతలను ఉద్యోగులు నిలదీయడం మొదలుపెట్టారు. తమ ప్రయోజనాలకు ప్రభుత్వం గండికొట్టి ఇప్పుడొచ్చి డబ్బు ఆశచూపితే మోసపోవడానికి తాము సిద్ధంగా లేమని తిరస్కరిస్తున్నారు. దీంతో వైసీపీ అభ్యర్థులు, నేతల్లో కలవరం మొదలైంది.

◆ బాపట్లలో సోమవారం మున్సిపల్ హైస్కూల్‌కు సమీపంలోని ఓ హోటల్‌లో వైసీపీ నేతలు పోస్టల్ బ్యాలెట్‌లకు డబ్బులు పంచుతున్నారన్న సమాచారంతో పోలీసులు తనిఖీలకు వెళ్లగా అప్పటికే అక్కడ నుంచి పలాయనం చిత్తగించారు. రేపల్లెలో వైసీపీ ఓటుకు రూ.2 వేలు పంపిణీ చేసినట్లు సమాచారం.

◆ గుంటూరు జిల్లాలో దాదాపుగా 20,775 మందికి పోస్టల్ బ్యాలెట్ ఉంది. దీంతో ఎక్కువ ఓట్లు పొందేందుకు వైసీపీ అభ్యర్థులు ప్రలోభాలకు తెరలేపారు. జిల్లాలోని కొన్ని నియోజకవర్గాల్లో గత ఎన్నికల్లో మంగళగిరిలో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు కీలకంగా మారాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని వైసీపీ అభ్యర్థులు ఓటుకు అత్యధికంగా రూ.5 వేల చొప్పున పంచుతున్నారు. గుంటూరు తూర్పు, పశ్చిమ, తెనాలి, ప్రత్తిపాడు, పొన్నూరులో రూ.2 వేలు, తాడికొండలో రూ.1,500 పంచుతున్నారని సమాచారం.

◆ పల్నాడు జిల్లాలో 19,095 మంది ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్‌లు జారీ చేశారు. వీరిలో 16,582 మంది జిల్లాలో విధులు నిర్వ హిస్తూ జిల్లాలోనే ఓటు హక్కు కలిగినవారు ఉన్నారు. ఈ సారి పోస్టల్ బ్యాలెట్ అత్యధికంగా పెదకూరపాడు నియోజకవర్గంలో రూ.7 వేలకు వైసీపీ అభ్యర్థి నంబూరు శంకర రావు కొనుగోలు చేసినట్లు తెలిసింది. తదుపరి మాచర్లలో రూ.5 వేలకు పిన్నెల్లి కొనుగోలు చేసినట్లు సమాచారం. ఇతర నియోజకవర్గాల్లో కనీసం రూ.3 వేలకు కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

మనసంతా చేనేత

- మోదీని చేనేత కండువాతో సత్కరించిన లోకేశ్
- హర్షం వ్యక్తం చేస్తున్న మంగళగిరి చేనేతలు

మంగళగిరి, మే 6: ఎన్నికల ప్రచారంలో భాగంగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఎక్కడ పర్యటిస్తున్నా... ఆయన మనసంతా మంగళగిరి.. చేనేతలతోనే ఉందనేందుకు సోమవారం జరిగిన ఘటనే ఉదాహరణ. మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గానికి పోటీ చేస్తున్న లోకేశ్ వారం రోజులుగా యువగళం సభలతో బిజీగా ఉంటున్నారు. తాజాగా సోమవారం రాజమహేంద్రవరంలో జరిగిన ప్రధాని నరేంద్రమోదీ సభలో మంగళగిరి చేనేతకు పెద్దపీట వేశారు. ప్రధాని మోదీకి మంగళగిరి చేనేత కండువాను కప్పి సత్కరించి చేనేతలపై తన ప్రేమను లోకేశ్ చాటుకున్నారు. తమపై లోకేశ్ చూపుతున్న అభిమానం, ప్రత్యేక శ్రద్ధపై మంగళగిరి చేనేతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మంగళగిరి చేనేతలకు మెరుగైన మార్కెటింగ్ సౌకర్యం కల్పించి, ఆర్థిక స్థితిగతులను మెరుగుపర్చాలన్న ఉద్దేశంతో మంగళగిరిలో లోకేశ్ వీవర్‌శాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ ఆధునిక మగ్గాలపై చేనేతలకు శిక్షణ ఇవ్వడంతో పాటు టాటా సంస్థతో ఒప్పందం చేసుకుని, మంగళగిరి చేనేత వస్త్రాలకు మార్కెటింగ్ సౌకర్యం కూడా కల్పిస్తున్నారు. మంగళగిరిలో ప్రస్తుతం సుమారు వెయ్యి లోపు ఉన్న చేనేత మగ్గాలను ఐదు వేలకు పెంచి చేనేతల జీవన స్థితిగతులను మెరుగుపరచడమే లక్ష్యమని ప్రకటించి ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. ఇందుకు లోకేశ్‌తల్లి భువనేశ్వరి, భార్య బ్రాహ్మణి సైతం తమ వంతు సహకారం అందిస్తున్నారు.



ప్రధాని మోదీకి చేనేత కండువాను కప్పుతున్న నారా లోకేశ్

వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి

- ఓటుతో జగన్‌రెడ్డికి బుద్ధి చెప్పండి
- ల్యాండ్ టైటిల్‌తో రైతులకు ముప్పు
- సూపర్‌సిక్స్‌తో అన్నివర్గాలకు లబ్ధి
- కూకట్లపల్లి, కొత్తూరు ప్రచారంలో

టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి రవికుమార్

బల్లికురవ, మే 6 : ఐదేళ్ల కిందట అభివృద్ధి బాటపట్టిన రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన వైసీపీ పార్టీకి ప్రజలు ఓటు ద్వారా ఈ ఎన్నికలలో బుద్ధి చెప్పాలని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని కొత్తూరు అనుణగిరి తండా, కూకట్లపల్లి యానాది సంఘం కాలనీలో ఎమ్మెల్యే రవికుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలతో ఆయన మాట్లాడుతూ ప్రజలకు తాగు నీరు వసతి కల్పించడంతో పాటు ప్రతి ఒక్కరికీ నివేశన స్థలాలు అందజేస్తామన్నారు. అలానే మురుగు కాలువల నిర్మాణం చేపడతామన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు చూసి ప్రజలు సైకిల్ గుర్తుపై ఓట్లు వేయాలని ఆయన కోరారు. అనంతరం ఆయన వారితో మా ట్లాడుతూ వైకాపాకు ఒక్క చాన్స్ ఇస్తే వారు అన్ని వర్గాల ప్రజలను తీవ్రంగా మోసం చేశారని ఆయన ధ్వజమెత్తారు. ఎన్నికలలో ఇచ్చన హామీలను అమలు చేయడం చేతకాని జగన్‌రెడ్డి మళ్లీ ప్రజలను మోసం చేసేందుకు రోజుకో ఎత్తులు వేస్తున్నారన్నారు. ప్రజలు వారి మాటలు నమ్మవద్దు అని ఆయన అన్నారు. ఈ ప్రభుత్వం తీసుకువచ్చిన ల్యాండ్ టైటిల్ చట్టంతో రైతుల భూముల మీద రైతులకు హక్కులు ఉండవన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే టైటిల్ చట్టాన్ని రద్దు చేస్తామన్నారు. అలానే నిరుద్యోగులకు మెగా డీఎస్సీపై తొలి సంతకాన్ని చంద్రబాబు చేస్తారన్నారు. మహిళలకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇవ్వడంతో పాటు 59 ఏళ్లలోపు మహిళలకు నెలకు రూ.1500 ఇవ్వడంతో పాటు తల్లికి వందనంపేరుతో ఇంట్లో ఎంత మంది విద్యార్థులున్నా అందరికీ రూ.15వేల వంతున చెల్లిస్తామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు ఏడాదికి రూ.20వేల పెట్టుబడి సాయం బీసీలకు 50ఏళ్లకే పింఛన్ అందిస్తామని సామాజిక పింఛన్ ఇకపై రూ.4వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు అందిస్తామన్నారు. నిరుద్యోగులకు నెలకు రూ.3వేల వంతున నిరుద్యోగ భృతి చెల్లిస్తామన్నారు. ఉచిత ఇసుక విధానం తెస్తామని ప్రజలందరూ ఎమ్మెల్యేగా గొట్టిపాటిని, బాపట్ల ఎంపీగా కృష్ణ ప్రసాద్‌ను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నేతలు ఇప్పుల అంజిరెడ్డి, పెం ట్రాల అంజనేయులు, దొడ్డా వేణుగోపాల్, శ్రీనివాసరావు, రామకోటేశ్వరరావు, ముంద్రు దానయ్య, పాపసాని రాఘవ, కల్లూరి రమేష్, అబ్రహం పాల్గొన్నారు.



కూకట్లపల్లిలో ఎస్టీ మహిళలతో మాట్లాడుతున్న గొట్టిపాటి

వైసీపీ పాలనలో దళితులకు అన్యాయం

టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి

అద్దంకి, మే 6 : వైసీపీ ప్రభుత్వ పాలనలో దళితులకు తీరని అన్యాయం జరిగిందని టీడీపీ కూటమి అభ్యర్థి, ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఉదయం అద్దంకి పట్టణంలోని 3 వ వార్డులో రవికుమార్ ఇంటింటికి తిరిగి సూపర్ సిక్స్ పథకాను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులపై అసాంఘిక శక్తులు, వైసీపీ మూకలు దాడులు చేస్తున్నా ప్రభుత్వం చర్యలు తీసుకోలేదన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో 6 వేలకు పైగా దాడులు, 158 మందిని హత్య చేశారన్నారు. 27 సంక్షేమ పథకాలను రద్దు చేశారన్నారు. జగన్‌రెడ్డి సొంత నియోజకవర్గంలోనే నాగమ్మ అనే మహిళపై అత్యాచారం చేసి హత్య చేసినా నిందితులను శిక్షించలేకపోయారన్నారు. టీడీపీ పాలనలోనే ఎస్సీల సంక్షేమం జరుగుతుందన్నారు. అంబేడ్కర్ విదేశీ విద్యా పథకం ద్వారా ఎస్సీ పేద విద్యార్థులకు విదేశాల్లో గొప్పగొప్ప చదువులు చదివించిన ఘనత టీడీపీదే అన్నారు. బాబు పాలనలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు ఆదుకున్నారన్నారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీమ్ ద్వారా ఎస్సీ విద్యార్థులకు కార్పొరేట్ విద్యను ఉచితంగా అందించామన్నారు. ఎస్సీలకు ప్రమోషన్లలో రిజర్వేషన్ అమలు చేశామన్నారు. ఎస్సీలకు భూమి కొనుగోలు పథకం కింద 2386 ఎకరాలు మంజూరు చేశామన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని అమలు చేయడానికి సత్వర న్యాయం చేయడానికి జిల్లాకొక మొబైల్ కోర్టును ఏర్పాటు చేస్తామన్నారు. దేశ చరిత్రలోనే మొదటి సారి ఎస్సీ రైతులకు 90 శాతం సబ్సిడీ పథకాలను టీడీపీ ప్రవేశ పెట్టిందన్నారు. ఎస్సీ పేద విద్యార్థులకు నూరుశాతం ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను అందజేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని రవికుమార్ అన్నారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి గొట్టిపాటి పూలమాలవేసి నివాళులర్పించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు కాకాని అశోక్, బొడ్డపాటి రవిబాబు, సందిరెడ్డి శ్రీనివాసరావు, గోవాడ శ్రీకాంత్, బొజంకు నాగరాజు పాల్గొన్నారు.



10వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న హర్షవర్ధన్

టీడీపీతోనే అన్నివర్గాల సంక్షేమం

హర్షవర్ధన్ ఇంటింటి ప్రచారం

అద్దంకి, మే 6 : అన్ని వర్గాల ప్రజల సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని గొట్టిపాటి హర్షవర్ధన్ అన్నారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ విజయాన్ని కాంక్షిస్తూ తనయుడు హర్షవర్ధన్ సోమవారం రాత్రి అద్దంకి పట్టణంలోని 10వ వార్డులో ప్రచారం నిర్వహించారు. హర్షవర్ధన్ ఇంటింటికీ తిరిగి సూపర్‌సిక్స్ పథకాలను ఓటర్లకు వివరించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో డీఎస్సీ లేక, పరిశ్రమలు రాక నిరుద్యోగులు ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లారన్నారు. రకరకాల చెత్త పన్నులతో పేద, మధ్య తరగతి ప్రజల నడ్డి విరిచిన తుగ్లక్ జగన్ అన్నారు. పట్టణంలో టీడీపీ హయాంలో రూ.85 కోట్లతో ప్రారంభించిన మంచి నీటి పథకాన్ని పూర్తిచేయలేని చేతగాని పాలకులు వైసీపీవారన్నారు. అభివృద్ధి కావాలంటే కూటమి జట్టుకు జై కొట్టాలన్నారు. ఎమ్మెల్యేగా గొట్టిపాటిని, ఎంపీగా కృష్ణప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కుందారపు రామారావు, ధర్మవరపు నాగేశ్వరరావు, గార్లపాటి శ్రీనివాసరావు, వీరనారాయణ, పీసీహెచ్ కోటయ్య, శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఛైర్మన్ నర్రావుల కొండలు, పూనూరి నరేంద్ర, కరి రవి, నాయుడు, కరి సతీష్, శర్మ, చెన్నా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి దేవస్థాం ట్రస్ట్ బోర్డు మాజీ డైరెక్టర్ చెన్నా వెంకటేశ్వర్లు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ చెన్నా విజయలక్ష్మి దంపతులు సోమవారం రాత్రి గొట్టిపాటి రవికుమార్ తనయుడు హర్షవర్ధన్ సమక్షం లో టీడీపీలో చేరారు.

టీడీపీలోకి వలసల జోరు

వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్న కొండయ్య

వేటపాలెం(చీరాల), మే 6 : ఎన్నికల వేళ టీడీపీలోకి చేరే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం కొండయ్య వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నారు. అందులో భాగంగా మండల పరిధిలోని అక్కాయిపాలెంలో సోమవారం పలువురు నాయకులు, కార్యకర్తలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఇతర పార్టీల నుంచి టీడీపీలోకి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు చే రారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ టీడీపీ కూటమి ప్రభుత్వంతోనే అన్ని వర్గాల ప్రజలు అభ్యున్నతి సాధ్యమ న్నారు. అందుకు అనుగుణంగా టీడీపీకి ఆదరణ పెరుగుతోందన్నారు. సోమవారం పలు ప్రాంతాలకు చెందినవారు పార్టీ కార్యాలయం లో కొండయ్య సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి టీడీపీ కండువాలు వేసి కొండయ్య సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో పార్టీలకు అతీతంగా కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కార్యోన్ముఖులు కావాలన్నారు.



కొండయ్య సమక్షంలో టీడీపీలో చేరిన నాయకులు, కార్యకర్తలు



ప్రచారం చేస్తున్న కొండయ్య కుమార్తె శివనారాయణదేవి

గెలుపు మనదే .. అశ్రద్ధ వద్దు

రానున్న ఎన్నికలలో గెలపు మనదే. అయితే అశ్రద్ధ వద్దని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొండయ్య అన్నారు. మున్సిపల్ పరిధిలోని 16, 17, 18, 21 వార్డులలో కొండయ్య ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ కూ టమి మేని ఫెస్టోతో ఒనగూరే ప్రయోజనాలను వివరించారు. తాజాగా నెలకొ న్న పరిస్థితులు, అందుకు అనుగుణంగా పార్టీ శ్రేణులు వేయాల్సిన అడుగులుపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చంద్రబాబు సీఎం అయితేనే సమస్యలకు పరిష్కారం

రాష్ట్రంలో నెవలకొన్న సమస్యల పరిష్కారంకు చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రి కావడం ఒక్కటే మార్గమని టీడీపీ కూటమి అభ్యర్థి కొండయ్య కుమార్తె శివనారాయణదేవి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఆమె నాయకులు, కార్యర్తలతో కలసి పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఆ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ కూటమి గెలుపుకు ఎమ్మెల్యేగా తన తండ్రి కొండయ్యను, ఎంపీ అభ్యర్థిగా తెన్నేటి కృష్ణప్రసాద్‌కు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు, రేపు హోం ఓటింగ్

చీరాల, మే 6 : హోం ఓటింగ్ కోసం దరఖాస్తు చేసుకున్నవారు మంగళ, బుధ వారాల్లో ఇంటి వద్దనే తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చని ఆర్డీవో, ఈఆర్వో సూర్యనారాయణరెడ్డి తెలిపారు. హోం ఓటింగ్ ప్రక్రియ నిర్వహించేందుకు ఆరు టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఈ నేపథ్యంలో హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్న ఓటర్లు మంగళ, బుధ వారాల్లో ఇంటి వద్ద అందుబాటులో ఉండాలని సూచించారు. కావున అవకాశాన్ని హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్న ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పర్చూరు ఉప విద్యాశాఖాధికారిగా నిర్మల

పర్చూరు, మే 6 : పర్చూరు ఉప విద్యాశాఖాధికారిగా ఎం.నిర్మల సోమవారం బాధ్యతలు చేపట్టారు. బాపట్ల జిల్లా వలపర్ల జిల్లా తెనాలి డివిజన్ ఉప విద్యాశాఖాధికారిగా విధులు నిర్వహిస్తూ బదిలీపై పర్చూరు వచ్చారు. గతంలో ఈమె వలపర్ల జడ్పీ పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయునిగా పనిచేశారు. నిర్మలకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రి కావాలి

వేటపాలెం(చీరాల), మే 6 : రాష్ట్రం పురోగమనంలో సాగాలంటే చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రి కావాల్సిందేనని టీడీపీ నేతలు సజ్జా వెంకటేశ్వరరావు, డాక్టర్ సజ్జా హేమలత అన్నారు. వేటపాలెంలో సోమవారం వారు నాయకులు, కార్యకర్తలతో కలసి ఇంటింటి ప్రచా రం నిర్వహించారు. ప్రధానంగా ఎన్నికల మ్యానిఫెస్టో, సూపర్ సిక్స్ పథకాలు, బీసీ డిక్లరేషన్‌పై అవగాహన కల్పిస్తూ ఎమ్మెల్యే అభ్యర్థిగా కొండయ్య, ఎంపీ అభ్యర్థిగా తెన్నేటి కృష్ణప్రసాద్‌లకు సైకిల్ గుర్తులపై ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న టీడీపీ నేతలు

చేనేతలకు టీడీపీతోనే పురోగతి

చేనేతలకు టీడీపీతోనే పురోగతి సాధ్యమని ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ అన్నారు. చీరాల మండలం దేవాంగపురిలో సోమవారం నిర్వహించిన చేనేతల ఆత్మీయ సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ కూటమి అధికారంలోకి వస్తే నేతన్నలకు ఒనగూరే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దళితులను మోసగించిన జగన్‌ను ఓడిద్దాం

సంతమాగులూరు, మే 6 : దళితులను మోసగించిన జగన్‌రెడ్డిని ఓడిద్దామని టీడీపీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు వలపర్ల సుబ్బారావు పిలుపునిచ్చారు. బండివారిపా లెం, గురిజేపల్లి, తంగేడుమల్లి, మినెకల్లు గ్రా మాల్లో సోమవారం ప్రచారం నిర్వహిం చారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ అభ్యర్థిగా కృష్ణప్రసాద్‌ను సైకిల్ గుర్తుపై ఓటువేసి గెలిపించాలని కోరారు. దళితుల ఓట్లతో గెలిచిన జగన్‌రెడ్డి దళితులను నిలువునా మోసగించారన్నారు. టీడీపీ పాలనలో అనేక పథకాలతో దళితులు లబ్ధిపొందారన్నారు. ఎస్సీ కార్పొరేషన్ నిధులను దారిమళ్లించి జగన్‌రెడ్డి దళితుల సంక్షేమానికి తూట్లు పొడిచారన్నారు. కార్యక్రమంలో అమోస్, రాధాకృష్ణమూర్తి, రేణింగవరం మాజీ సర్పంచి అమర్తపూడి ఏసోబు (చిన్న), పాత మాగులురు సర్పంచి విజయబాబు, రమేష్ పాల్గొన్నారు.



బండివారిపాలెంలో ప్రచారం చేస్తున్న శ్రేణులు


ఓటు హక్కు వినియోగించుకునేందుకు క్యూలో ఉన్న పీవోలు, ఏపీవోలు

ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్ పోలింగ్

చీరాల, మే 6 : వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రక్రియ సోమవారం ప్రశాంతంగా జరిగింది. పీవోలు, ఏపీవోలు 759 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఈఆర్వో సూర్యనారాయణరెడ్డి తెలిపారు. ఆదివారం 882 మంది ఓపీఓలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో ఇప్పటి వరకు మొత్తం 1641 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్న ఈఆర్వో తెలిపారు. ఇదిలావుంటే ఒంగోలు కేంద్రంగా పనిచేస్తున్న పలువురు తమ పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునేందుకు వచ్చినవారికి అవకాశం లేదని అక్కడి పోలింగ్ అధికారులు చెప్పారు. దీంతో వారు ఉసూరుమంటూ వెనుదిరిగారు. కొందరైతే చీరాల నియోజకవర్గంలో నివాసం ఉంటున్న తమకు ఇక్కడే ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవకాశం కల్పించాలని కోరినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఈక్రమంలో తాము ఒంగోలులో పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకునే క్రమంలో తాము చీరాల అసెంబ్లీ అభ్యర్థికి, ఎంపీ అభ్యర్థికి ఓటు వేయాలంటే అక్కడ ఇచ్చే బ్యాలెట్ పేపర్లో ఇక్కడి వారి పేర్లు, గుర్తులు ఉంటాయా అనే సందేహాన్ని వెలిబుచ్చారు. ఒంగోలులో ఓటు హక్కు వినియోగించుకునేవారికి కూడా స్థానిక అభ్యర్థుల పేర్లు, ఎన్నికల గుర్తులు కనిపిస్తాయాని, ఇక్కడ ఏ బ్యాలెట్ పేపర్ ఇస్తారో, అదే విధంగా అక్కడ కూడా బ్యాలెట్ పేపర్ ఉంటుందని, ఎవరినైతే ఎన్నుకోవాలనుకుంటారో, ఆ అభ్యర్థి పేరు ఎదురుగా ఉన్న గుర్తుపై ఓటు వేయాలని అధికారులు తెలిపారు.

పర్చూరులో 93 శాతం ఓట్లు పోల్

పర్చూరు : పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగింది. రెండవ రోజు ఆదివారం పోలింగ్ ఆఫీసర్ (పీవో), అదనపు పోలింగ్ ఆఫీసర్ (ఏపీవో)కు పోస్టల్ బ్యాలెట్ ద్వారా స్థానిక ఎస్ఎఫ్ఎస్ హైస్కూల్‌లో ఎన్నిక నిర్వహించారు. పీవో, ఏపీవోలకు సంబంధించి మొత్తం 387 మంది ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉండగా అందులో 369 మంది ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఆర్వో గంధం రవీందర్ తెలిపారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జరిగిన పోలింగ్‌లో 93శాతం ఓట్లు పోలైనట్లు ఆయన తెలిపారు. ఎలాంటి వివాదాలకు తావు లేకుండా పర్చూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీ.శీతారామయ్య నేతృత్వంలో ప్రత్యేక పోలీసు బందోబస్తు నిర్వహించారు.


కలవకూరులో మహిళలకు పథకాలను వివరిస్తున్న గొట్టిపాటి

ప్రజల భూములు కొట్టేసేందుకే ల్యాండ్ టైటిల్ చట్టం

- టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి

అద్దంకి, మే 6 : ప్రజల భూములను కొట్టేసేందుకే జగన్‌రెడ్డి ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను తీసుకొచ్చారని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని కలవకూరు, గుర్రంవారిపాలెంలో సోమవారం రాత్రి గొట్టిపాటి రవికుమార్ ఇంటింటికీ తిరిగి సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ దేశంలో ఇప్పటి వరకు బీజేపీ పాలిత రాష్ట్రాలతో సహా ఏ రాష్ట్రం లాండ్ టైటిల్ యాక్ట్‌ను అమలు చేయలేదని, మరి జగన్ రెడ్డి మాత్రం ఎందుకు తొందర పడ్డారని రవికుమార్ ప్రశ్నించారు. ప్రజల భూములు కబ్జా చేసేందుకే ఈ యాక్ట్ అన్నారు. ఎన్నికలలో ప్రజలను మోసం చేయడానికి చట్టానికి ఇంకా మార్గదర్శకాలు ఇవ్వలేదని నాటకాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు. ల్యాండ్, శాండ్, వైన్, గంజాయి, మైన్, డ్రగ్స్, ఎర్రచందనం, రేషన్ బియ్యం అక్రమ అమ్మకాలతో వైసీపీ నేతలు రూ.8లక్షల కోట్లు కొల్లగొట్టారన్నారు. పాపపు సొమ్మును భూముల్లోకి తరలించడానికి సివిల్ కోర్టులు అడ్డంకిగా ఉన్నాయని, కోర్టుల రక్షణను తొలగించడానికి రెవెన్యూ అధికారులకు సివిల్ కోర్టు అధికారాలను కట్టబెడుతూ ల్యాండ్ టైటిల్ చట్టం తెచ్చారన్నారు. జగన్ భూ మాఫియా లక్షలాది ఎకరాలను కబ్జా చేసేందుకు కుట్ర చేస్తోందన్నారు. జగన్‌రెడ్డికి ఓటేస్తే మన ఆస్తుల హక్కును వారిచేతిలో పెట్టడమేనన్నారు. వైసీపీని ఓడించి, భూములను రక్షించుకుందామని పిలుపునిచ్చారు. టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు కఠారి నాగేశ్వరరావు, గుర్రం నాగరాజు, సురేష్, కొండలు పాల్గొన్నారు.


నేతలతో టీడీపీ ఎన్నికల కోఆర్డినేటర్ గరటయ్య

వైసీపీ పాలనలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం

బాపట్ల పార్లమెంట్ టీడీపీ ఎన్నికల కోఆర్డినేటర్ చెంచుగరటయ్య

అద్దంకి, మే 5 : వైసీపీ పాలనలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం అయ్యాయని బాపట్ల పార్లమెంట్ టీడీపీ ఎన్నికల కోఆర్డినేటర్ బాచిన చెంచుగరటయ్య అన్నారు. సోమవారం అద్దంకిలోని క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గరటయ్య మాట్లాడుతూ వైసీపీ పాలనలో బటన్ నొక్కుడు తప్ప అభివృద్ధి శూన్యమన్నారు. ప్రజా సమస్యలను పూర్తిగా గాలికి వదిలివేశారన్నారు. అద్దంకి నియోజకవర్గంలో ప్రధానమైన యర్రం చినపోలిరెడ్డి కొరిశపాడు ఎత్తిపోతల పథకం పనులు గురించి ఎన్నిసార్లు జగన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినా కనీసం శ్రద్ధ పెట్టలేదన్నారు. ప్రతిపక్ష నేతలపై కక్షసాధింపే లక్ష్యంగా పాలన సాగించారన్నారు. వచ్చే ఎన్నికలలో కూటమి ప్రభుత్వం అధికారం చేపడుతుందన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ అభ్యర్థి కృష్ణ ప్రసాద్ విజయానికి కృషి చేయాలని కోరారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు బాచిన చెంచు ప్రసాద్, నేతలు శ్రీనివాసరెడ్డి, చింతల పేరయ్య, సాధినేని మస్తాన్‌రావు, రావి శ్రీధర్, సందిరెడ్డి రమేష్ పాల్గొన్నారు.

ఏలూరి గెలుపు కోసం నర్సిరెడ్డి ప్రచారం

నూతలపాడు (పర్చూరు), మే 6 : ఒక్కచాన్స్‌తో జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టారని తెలుగుదేశం పార్టీ జాతీయ అధికార ప్రతినిధి నన్నూరి నర్సిరెడ్డి అన్నారు. టీడీపీ ప్రజా కూటమి ఎమ్మెల్యే ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు గెలుపు కోసం సోమవారం పర్చూరు మండలంలోని నూతలపాడు, నాగులపాలెం, చెరుకూరు గ్రామాల్లో నర్సిరెడ్డి ప్రచారం నిర్వహించారు. నర్సిరెడ్డి తనదైన శైలిలో జగన్ పాలనపై చలోక్తులతో మాట్లాడించి అందరినీ నవ్వించారు. సాంబన్నకు ఓటువేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఇంటింటికీ తిరిగి సూపర్ సిక్స్ పథకాల మేనిఫెస్టో కరపత్రాను పంచిపెట్టారు. పార్టీలకు అతీతంగా అభివృద్ధే లక్ష్యంగా పనిచేసే ఎమ్మెల్యే ఏలూరి గెలుపుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. పర్చూరు అభివృద్ధి ఏలూరితోనే సాధ్యమన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారంలో తెలుగుదేశం జాతీయ అధికార ప్రతినిధి నర్సిరెడ్డి

జగన్ పాలనలో అంతా ఆర్భాటమే
ఐదేళ్లలో చేతివృత్తులకు మొండిచేయి
ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్‌లో నిధులు నిల్
పెరిగిన ధరలతో సగటు జీవి బతుకు భారం
మళ్లీ వైసీపీ వస్తే ఊరొదిలి పోవాల్సిందే

కులవృత్తులు కుదేలు

జగన్ ప్రభుత్వం రెక్కాడితేగాని డొక్కాడని బడుగుజీవుల పొట్టగొట్టింది. పేదల ప్రభుత్వం అంటూ ప్రతిసారి గొప్పలు పోయే వైసీపీ నేతలు ఒక్కసారైనా చేతివృత్తుల వారి పరిస్థితుల గురించి ఆలోచించలేదు. వారి సంక్షేమం కోసం ఒక్క పైసా విడుదల చేయలేదు. కనీసం రుణాలు పొందే వీలు కూడా లేకుండా చేసింది. టీడీపీ హయాంలో 'ఆదరణ' ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజికవర్గాల చేతివృత్తుల వారి ఆర్థికాభివృద్ధి కోసం యంత్రాలు, పరికరాలు ఇచ్చి అండగా నిలిచిన పథకాన్ని దుర్మార్గంగా రద్దుచేసింది. ఆయా కార్పొరేషన్లకు ఒక్కపైసా నిధులు లేకుండా చేసి, ఉపయోగం లేని పదవులు కట్టబెట్టింది. దీనిపై ఆయా సామాజికవర్గాలను ఉద్ధరించినట్లుగా గొప్పలు పోవడంపై ఆయా వర్గాలు మండిపడుతున్నాయి.



ఒంగోలు (కార్పొరేషన్) మే 6 : చేతివృత్తులపై ఆధారపడి జీవించేవారి పరిస్థితి వైసీపీ ప్రభుత్వంలో దారుణంగా తయారైంది. మేదర, కుమ్మరి, కంసాలి, రజకులు, క్షురకులు, స్వర్ణకారులు, కార్పెంటర్లు, చెప్పులు కుట్టేవారు. ఎలక్ట్రీషియన్లు ఇలా ఒకటేమిటి అన్ని చేతివృత్తిదారుల కుటుంబాల పరిస్థితి దయనీయంగా మారింది. ఒక్క చాన్స్ అంటూ ఓటేస్తే బాగానే ఉద్ధరించాడని వాపోతున్నారు. ఒక ప్రభుత్వ పథకం అమలు చేయకపోగా, ఒక్కపైసా రుణం కూడా ఇవ్వలేని ప్రభుత్వంపై వారు మండిపడుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే తమకు మేలు జరిగిందని బహిరంగంగానే చెబుతున్నారు. చేతివృత్తిదారులకు, పరికరాలు ఇవ్వడంతోపాటు, ఆయా కార్పొరేషన్ల ద్వారా రుణాలు అందించి అండగా నిలిచారని తెలిపారు. ఈసారి నమ్మి ఓటేస్తే ఇక నట్టేట మునిగిపోవాల్సిందేనని, ఊరూవాడ వదిలి వలసలు పోయే పరిస్థితికి తీసుకొస్తాడని, వద్దు బాబోయ్.. జగన్ పాలన మాకొద్దు అంటున్నారు.

పేదలకు చేరని ప్రభుత్వ పథకాలు

టీడీపీ హయాంలో పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలను వైసీపీ ప్రభుత్వం రాగానే పేదలకు దూరం చేసింది. చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో అన్నివర్గాల ప్రజలకు ఆర్థిక చేయూత నిచ్చేందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కాపు, బ్రాహ్మణ కార్పొరేషన్‌ల ద్వారా రుణ సౌకర్యం కల్పించారు. ఆర్థికంగా అండగా నిలిచారు. అయితే గడిచిన ఐదేళ్లలో పలు పథకాల కోసం దరఖాస్తు చేసుకున్నా, పాలకులు హామీలు ఇస్తున్నా బ్యాంకులు మాత్రం ముందుకు రావడం లేదు. ఎలాంటి హామీలు లేకుండానే ప్రభుత్వం అందించే ముద్ర రుణాలు కూడా దక్కని పరిస్థితులు ఉన్నాయి.

కడుపు నింపని కుల వృత్తి

తరతరాలుగా కులవృత్తిపై ఆధారపడిన మేదర కుటుంబాలు నేడు కుల వృత్తికి దూరమైపోతున్నారు. రోజంతా కష్టపడి పనిచేసినా కనీసం కడుపునిండా కూడు తినలేని పరిస్థితులు నేడు చూస్తున్నారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలు వారి దాకా చేరడం లేదు. కొంతమంది కనీస రేషన్‌కార్డులకు కూడా అర్హులుగా గుర్తించలేదు. గత టీడీపీ హయాంలో పథకాలు అందరికీ అందేవని, ధరలు అదుపులో ఉండటంతో రోజు సంపాదించిన దాంట్లో సంతోషంగా జీవించామని, కొంత ఆదా కూడా చేసుకునే పరిస్థితులు ఉండేవన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క పథకం కూడా రాలేదంటున్నారు. తాము ఉన్నామన్న సంగతి కూడా మరిచి పోయారని మేదరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఐదేళ్లలో పనులు జరుగుతున్నా పైసా కూడా దాచిపెట్టలేని పరిస్థితి ఉందని, రోజంతా కష్టపడినా పెరిగిన ధరలతో పెట్టుబడులతో చేతికొచ్చేదేమీ లేదని వాపోతున్నారు.

గంగిరెద్దుల గోడు పట్టించుకునేవారు కరువు

జిల్లాలోని పశ్చిమ ప్రాంతానికి చెందిన నాగెళ్లముడుపు గ్రామం. గంగిరెద్దుల వాళ్లకు పెట్టింది. పొట్ట చేతపట్టుకుని పట్నం వచ్చిన గంగిరెద్దుల వాళ్ల గోడు పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఒంగోలు నగరంలోని గాంధీనగర్‌లోని ఓ ఖాళీ స్థలంలో తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకుని ఇల్లిల్లూ తిరుగుతూ పొట్ట నింపుకొంటున్న వందల కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు దూరమయ్యాయి. సంక్రాంతి సంబరాలు, ప్రత్యేక ప్రభుత్వ కార్యక్రమాలు, పెద్దోళ్ల గృహ ప్రవేశాలకు మాత్రమే వారిని గుర్తించి ఆహ్వానించడం తప్ప ఆ తర్వాత పట్టించుకునే వారే కరువు. ఇతర కులస్థుల మాదిరిగానే తమకు గుర్తింపుకార్డులు, రేషన్‌కార్డులు, రిజర్వేషన్లు కల్పించి ఆదుకోవాలని కోరుతున్నారు.

దయనీయంగా చర్మకారులు

మారుతున్న కాలానుగుణంగా చేతివృత్తులు, కులవృత్తులు అంతరించి పోతున్నాయి. వాటిలో చర్మకార వృత్తి ఒకటి. గతంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో చర్మకారులు (చెప్పులు కుట్టేవారికి) చేతినిండా పని ఉండేది. అప్పట్లో ప్రతి ఒక్కరు స్వయంగా తమ సైజులలో కోరిన విధంగా కుట్టించుకుని మరీ వాడేవారు. గ్రామీణ ప్రాంతాల్లో అనాదిగా వస్తున్న ఈ వృత్తిని నమ్ముకునే అనేక కుటుంబాలు జీవించేవి. ఒక్కో జత రూ.100 అమ్మకాలు చేయగా, అందులో వచ్చే రూ.30లతోనే ఆ రోజు కుటుంబం గడిచిపోయేది. అయితే నేడు ఆ పరిస్థితి లేదు. నేటి ఆధునిక కాలానుగుణంగా చెప్పుల తయారు చేసేవారు లేకపోగా అక్కడక్కడ రిపేరు చేసేవారు మాత్రమే కనిపిస్తున్నారు. అయినప్పటికి వీరికి ఆదరణ కరువైపోతుంది. వైసీపీ పాలనలో రోజురోజుకు అడ్డగోలుగా పెరుగుతున్న నిత్యావసర ధరలతో జీవనం దుర్భరంగా మారిందని పలువురు చర్మకారులు వాపోతున్నారు. వారికి ప్రభుత్వ సాయం అంతంతమాత్రంగానే అందుతోంది.

స్వర్ణం వెలవెలబోతుంది

స్వర్ణకారుల కుటుంబాలు నేడు వెలవెలబోతున్నాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలకు తక్కువ రేటుతో చూడ ముచ్చటైన నగలు తయారీ చేసి అందించిన బంగారం వృత్తిదారులు ప్రస్తుతం కార్పొరేట్ షాపులు రాక, రెడీమేడ్ వస్తువులు అందుబాటులోకి రావడంతో పనులు లేక ఖాళీగా ఉంటున్నారు. జిల్లాలో 1500 వరకు బంగారు ఆభరణాల తయారీ షాపులు ఉండగా, సుమారు 3వేలకుపైగా స్వర్ణకారులు (గోల్డ్‌స్మిత్‌లు) చేతి వృత్తిని ఆధారం చేసుకుని జీవనం సాగిస్తున్నారు. పలువురు పెద్ద బంగారు దుకాణాలను ఆధారంగా చేసుకుని పనిచేస్తున్నారు. కొందరు సొంతంగా పనులు ఒప్పుకుని జీవనం సాగిస్తుండగా, కొందరు చిన్న చిన్న దుకాణాలు పెట్టుకుని జీవిస్తున్నారు. వారిలో 80శాతం మంది బంగారు, వెండి అమ్మకాల షాపులపై ఆధారపడి జీవిస్తుండగా, 20శాతం మంది సొంతంగా పని ఒప్పుకొని కుటుంబపోషణ సాగిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎలాంటి రుణాలు, పథకాలు కూడా లభించలేదు.

జగన్‌రెడ్డిని గద్దె దించండి

- కూటమి గెలుపుతోనే రాష్ట్రానికి పూర్వవైభవం
- ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి
- గంగవరం, పావులూరులో ఘనస్వాగతం

గంగవరం (ఇంకొల్లు), మే 6 : బాధ్యతలేకుండా.. అవినీతి పాలన కొనసాగించిన జగన్‌రెడ్డిని గద్దె దింపాలని, ప్రతి ఒక్కరూ ఓటును వినియోగించుకొని టీడీపీ కూటమి అభ్యర్థులను గెలిపించి రాష్ట్రానికి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు చేయిచేయి కలపాలని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు ప్రజలకు పిలుపునిచ్చారు. మండలంలోని గంగవరం, పావులూరు, చిననక్కలపాలెం గ్రామాలలో ఎన్నికల ప్రచారంలో ఏలూరి విస్తృతంగా పాల్గొన్నారు. గంగవరం, పావులూరు గ్రామాలలో ప్రజలు ఏలూరికి బ్రహ్మరథం పట్టారు. మీవెంటే మేమంటూ హామీ ఇచ్చారు. ఐదేళ్ల జగన్‌రెడ్డి పాలనలో అన్నివర్గాల ప్రజలు తీవ్రంగా నష్టపోయారన్నారు. సాగు నీరు లేక రైతుల కూడా పొరుగు రాష్ట్రాలకు వలసపోయే దుస్థితికి తీసుకొచ్చారన్నారు. ప్రజలకు పనులు లేక పొట్టచేతపట్టుకొని ఊళ్లను విడిచారన్నారు. నిరుద్యోగ యువత పరిస్థితి మరీ దారుణంగా మారిందన్నారు. రాష్ట్రంలో కొత్త కంపెనీని ఒక్కదానినీ ఏర్పాటు చేయలేని అసమర్థ జగన్‌రెడ్డి ఉన్న కంపెనీలనూ వెళ్లగొట్టారన్నారు. రాష్ట్రంలో మద్యం, ఇసుక వ్యాపారంతో వైసీపీ పాలకులు కోట్లు కొల్లగొట్టారన్నారు. గంగవరం ప్రధానవీధుల్లో, ఎస్సీ కాలనీలో ప్రచారం నిర్వహించి ఓట్లు అభ్యర్థించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కరి వీరాంజనేయులు, బోడెంపూడి సుబ్బారావు, రమేష్, కరి రామారావు, కరి సుధాకర్, ఆరె విజయలక్ష్మీ, నాగేంద్రమ్మ, పార్వతి, రవి,వాసు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు గుంజి వెంకట్రావు, శ్రీనివాసరావు, జనసేన నాయులు ప్రవీణ్, మహిళలు, యువత, నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు. నాగండ్ల గ్రామానికి చెందిన ఎస్టీ కుటుంబాలు సోమవారం ఏలూరి సమక్షంలో చేరగా, పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.


గంగవరంలో ప్రచారంలో పాల్గొన్న ఏలూరి

అన్నదాతలకు అండగా ఉంటాం

పావులూరు (ఇంకొల్లు) : అన్నదాతలకు కూటమి అండగా ఉంటుందని, రైతుల శ్రేయస్సు కోసం కట్టుబడి పనిచేస్తామని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు హామీ ఇచ్చారు. మండలంలోని పావులూరులో జరిగిన ప్రచారంలో ఆయన మాట్లాడారు. రైతులను జగన్‌రెడ్డి నిలువునా ముంచేశారన్నారు. మద్దతు ధరల స్థిరీకరణ కోసం రూ.3వేల కోట్లతో గిట్టుబాటు ధరలు కల్పిస్తామని జగన్ మోసం చేశారన్నారు. తుఫాన్లతో పోయిన పంటలకు నష్టపరిహారం చెల్లించలేదన్నారు. కనీసం రైతుల బాధలను వినే పరిస్థితి కూడా జగన్‌రెడ్డి కల్పించలేదన్నారు. చంద్రబాబు పాలనలో కృష్ణా డెల్టాకి నీరిచ్చి రైతులను ఆదుకున్న విషయాన్ని ఏలూరి గుర్తు చేశారు.

సాంబన్నకు జై కొడుతున్న వైసీపీ నేతలు

- మేమ సైతం అంటూ తరలివస్తున్న శ్రేణులు
- పార్టీలోకి ఆహ్వానించిన ఏలూరి

పర్చూరు, మే 6 : అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే ఏలూరి వెంట మేము సైతం అంటూ వైసీపీ నేతలు, కార్యకర్తలు జై కొడుతున్నారు. పెద్దఎత్తు వైసీపీని వీడి ఊళ్లకుఊళ్లు టీడీపీలో చేరుతున్నారు. అందరినీ ఎమ్మెల్యే ఏలూరి పార్టీలోకి ఆహ్వానిస్తున్నారు. కలిసికట్టుగా పనిచేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఇప్పటికే పర్చూరు నియోజకవర్గ వ్యాప్తంగా వేలాది మంది వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ చేరికల జోరు మరింత పెరిగింది. కొత్తగా చేరినవారికి సముచితమైన గౌరవం ఉంటుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అందరం కలిసి కృషి చేద్దామన్నారు.

కారంచేడులో గుడ్డుపోతుల శ్లేవరాజు, కోటపూరి జోసఫ్ కోటపూరి పౌలు, కుమ్మరి అరుణ్ కుమార్, గోపతోటి సురేష్ మేడికొండ సుదర్శన్, కుమ్మరి ప్రేమ్ కుమార్, నంగలం శ్రీను, ఎడవల్లి కొండలరావు, గోపతోటి సామేలు, వేముల మోషే, షైల ప్రసాద్ మండే ఏసేబు, కుమ్మరి దాసు, పులి కృష్ణ, శీలం రాయప్ప, షేక్ బాషా ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో టీడీపీలో చేరారు.

మార్టూరులో నాగండ్ల గోపి, తాటిపర్తి ప్రేమయ్య, నాగండ్ల పరుశురాం, నాగండ్ల శ్రీనివాసరావు, హనుమంతురావు, నాగండ్ల రామారావు, దుర్గ, సూర్యపల్లి రాంబాబు, నాగండ్ల బాలు, నాగండ్ల అంజయ్య వైసీపీని వీడి సైకిలెక్కారు.

జీడిచెట్లపాలెంలో పీత వెంకటరావు, సింగోతు నాగయ్య, పిన్ని శ్యాంప్రసాద్, గొల్లపోతు నాగేంద్రం, రేవు సింగయ్య వైసీపీని వీడి ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో టీడీపీలో చేరారు.

గొల్లపాలెంలో నంబూరి శ్రీను, యాక్సరి నాగరాజు, ఎండోటి పల్లయ్య, భాస్కరావు, తాళ్లూరి ఏసు, కందుల బాబు, నంబూరి ఏసు రాజు, మెలిక రాంబాబు, పొట్లూరి చెంచయ్య, ఏండోటి చిన్న వెల్ల వెంకటేశ్వర్లు, ఎల్ల చెంచయ్య, శ్రీను, నంబూరి వెంకటేష్, తాకూరి నాగరాజు, తాకూరి కాటంరాజు, ఎల్ల కోటేశ్వరరావు, రచ్చగిరి అంకమ్మరావు టీడీపీలో చేరారు.

దేవరపల్లిలో పర్చూరు మండలం దేవరపల్లి గ్రామానికి చెందిన జంగం షాలేం, గుజ్జర్లపూడి రాజేష్, గుజ్జర్లపూడి నాగేశ్వరరావు, ఆనందబాబు, నూతలపాటి సునీల్, అనిల్, గజ్జర్లపూడి పెద్దజన్ వైసీపీని వీడి ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో సైకిలెక్కారు.

సూపర్ సిక్స్ పథకాలతో మహిళలకు మేలు

చినగంజాం, మే 6 : సూపర్‌సిక్స్ పథకాలతో మహిళలు ఆర్థిక లబ్ధి చేకూరుతుందని టీడీపీ సీనియర్ నాయకులు యార్లగడ్డ లక్ష్మి అన్నారు. చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని మహాలక్ష్మి, రామకోటేశ్వరకాలనీ. సంతరావూరు గ్రామంలో ఎస్టీ కాలనీ, మోటుపల్లి, మున్నంవారిపాలెం గ్రామంలో ఎస్సీ కాలనీల్లో టీడీపీ కూటమి ఎమ్మెల్యేగా ఏలూరిని, ఎంపీగా కృష్ణప్రసాద్‌ను గెలిపించాలని కోరుతూ శ్రేణులు విస్తృత ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ కూటమి మేనిఫెస్టోలోని పథకాలు, వాటి ప్రయోజనాలను ఒకొక్కటిగా వివరిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.


టీడీపీలో చేరిన నాగండ్ల ఎస్టీలు


ఏలూరి సమక్షంలో సైకిలెక్కిన కారంచేడు ఎస్సీలు


పట్టణ నడిబొడ్డులో రోడ్డుపై తాగి వేసిన బీరు సీసాలు

చీరాలలో మద్యం పరవళ్లు

చీరాలటౌన్, మే 6 : అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మందు బాబులకు బాగానే గిట్టుబాటు జరుగుతున్నట్లు ఉంది. పట్టణంలోని ప్రధాన రదారుల్లో సైతం ఖాళీ బాటిళ్ల దర్శనమిస్తున్నాయి. నిత్యం ఏదో ఒక ప్రదేశంలో మద్యం సీసాలు జోరుగానే పడి ఉంటున్నాయి. నడిరోడ్లపై తాగడం విసిరి వెళ్లిపోవడం వంటివి చేస్తున్నారు. మద్యం మత్తులో వాహనాలను డ్రైవ్ చేస్తున్నారు. ఈక్రమంలో అధికారులు తక్షణమే జోక్యం చేసుకోకుంటే ప్రమాదాలు జరిగే అవకాశముందని ప్రజలు అంటున్నారు.



మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

సుభానీకి ఏలూరి నివాళి

పర్చూరు, మే 6 : టీడీపీ పర్చూరు మండల అధ్యక్షుడు షేక్ షంషద్దీన్ తండ్రి షేక్ మహబూబ్ సుభానీ(74) మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సోమవారం పర్చూరు వెళ్లి సుభానీ మృతదేహానికి నివాళులర్పిం చారు. తెలుగుదేశం పార్టీకి మహబూబ్ సుభానీ చేసిన సేవలను ఏలూరి కొనియాడారు. ఆయనతోపాటు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులున్నారు.

పలు కుటుంబాలను పరామర్శించిన ఏలూరి

టీడీపీ నాయకులు మంగళగిరి కోటేశ్వరరావు తల్లి ఇటీవల మృతి చెందగా ఏలూరి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే పఠాన్ సుభానీ మృతి చెందగా, ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను ఏలూరి ఓదార్చారు.


మాట్లాడుతున్న ముస్తఫా అహ్మద్

కల్లబొల్లి మాటలతో మోసగించిన జగన్‌రెడ్డి

ఇంకొల్లు, మే 6 : జగన్ కల్లబొల్లి మాటలు చెప్పి ముస్లిం మైనారిటీలకు తీవ్ర అన్యాయం చేసారని టీడీపీ ముస్లిం మైనారిటీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మౌలానా ముస్తాఫా అహ్మద్ ధ్వజమెత్తారు. ఇంకొల్లులో రామకృష్ణ గోడౌన్ ఆవరణలో సోమవారం రాత్రి ఇంకొల్లు ప్రాంత ముస్లింల ఆత్మీయ సమావేశం జరిగింది. సమావేశంలో పలువురు రాష్ట్ర ముస్లిం నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అహ్మద్ మాట్లాడుతూ చంద్రబాబు హయాంలోనే ముస్లింలకు గుర్తింపు లభించిందన్నారు. పెళ్లికానుక, రంజాన్ తోఫా, మసీద్‌ల అభివృద్ధి, షాదీఖానాల నిర్మాణాలు, కార్పొరేషన్ ద్వారా అభివృద్ధి పనులు జరిగాయని వివరించారు. జగన్‌రెడ్డి దుర్మార్గ పాలనలో ముస్లింలను పట్టించుకోలేదన్నారు. ముస్లింలతోపాటు అన్ని వర్గాల ప్రజలు జగన్‌రెడ్డిని గద్దె దింపాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో మైనార్టీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షరీఫ్‌బాషా, ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ అబ్దుల్ రజాక్, ఇంకొల్లు మైనార్టీసెల్ నాయకులు బాబర్‌బాషా, మీరావలి, డాక్టర్ రఫీ, ఆయెషాబుడే, మాబాషాఆరీపా, ఇంతియాజ్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

హత్య కేసు నిందితులకు యావజ్జీవం

తీర్పు వెలువరించిన ఒంగోలు పీడీజే కోర్టు న్యాయాధికారి
తొమ్మిదేళ్ల తర్వాత వెలువడిన వైనం

చెరుకూరు(పర్చూరు), మే 6: వివాహేతర సంబంధం నేపథ్యంలో జరిగిన హత్య కేసులో నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ ఒంగోలు పీడీజే కోర్టు న్యాయాధికారి ఏ.భారతి సోమవారం తీర్పు చెప్పారు. వివరాల్లో వెళితే బాపట్ల జిల్లా, పర్చూరు మండలం చెరుకూరు గ్రామానికి చెందిన నవాబు సురేష్ 2015 ఫిబ్రవరి 2న హత్యకు గురయ్యాడు. అతని భార్యతో అరుద్ర సాంబశివరావు అనే వ్యక్తి వివాహేతర సంబంధం కలిగి ఉండడమే ఈ హత్యకు కారణమైంది. కేసు వివరాల్లోకి వెళితే..అరుద్ర సాంబ శివరావుకు సురేష్ భార్యతో వివాహేతర సంబంధం ఉంది. ఆ విషయం తెలిసిన గ్రామస్థులు, భర్త వారిని మందలించారు. అప్పటి నుంచి సురేష్‌పై కక్ష పెంచుకున్న సాంబశివరావు 2015వ సంవత్సరం ఫిబ్రవరి 2వ తేదీ రాత్రి సుమారు 8.45 గంటల సమయంలో ఎన్టీఆర్ సెంటర్ వద్ద నడిచి వెళుతున్న సురేష్‌ను వెనుక నుంచి కత్తితో దాడిచేసి తలపైన గొంతుపైన నరికాడు. దీంతో నవాబు సురేష్ (36) అక్కడికక్కడే మృతి చెందాడు. అతని సోదరుడు గోపీ నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై కె.మాధవరావు కేసు నమోదు చేశారు. అప్పటి ఇంకొల్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాసరావు దర్యాప్తు అధికారిగా సాక్షుల వాంగ్మూలాన్ని నమోదు చేశారు. సాక్షాధారాల ఆధారంగా నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిపుణుల నివేదికలను, భౌతిక సాక్షాధారాలను సేకరించి న్యాయస్థానంలో నిందితులపై అభియోగ పత్రాలు దాఖలు చేశారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు మార్టూరు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సి.శీతారామయ్య కేసు ట్రైల్‌ను స్వయంగా పర్యవేక్షించారు. హత్య కేసు రుజువు కావడంతో అరుద్ర సాంబశివరావు, సురేష్ భార్య (ఏ2 నిందితురాలు)పై యావజ్జీవ కారాగార శిక్షతోపాటు, రూ.5000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పినట్లు పోలీసులు వివరించారు. హత్య కేసులోని నిందితులకు యావజ్జీవం పడేలా కృషి చేసిన పోలీస్ అధికారులు, సిబ్బందిని, కోర్టు మానటరింగ్ సిబ్బందిని ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు.

ఎన్నికలకు సహకరించాలి

మిన్నెకల్లు (సంతమాగులూరు), మే 6 : ఎన్నికల సందర్భంగా గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు గ్రామ ప్రజలందరూ సహకరించాలని సంతమాగులూరు ఎస్ఐ సురేష్ తెలిపారు. సంతమాగులూరు మండలం మిన్నెకల్లు గ్రామంలో సోమవారం పోలీసు కవాతు నిర్వహించారు. గ్రామ ప్రజలందరూ స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

తైక్వాండోలో ఏడుకొండలుకు గోల్డ్‌మెడల్

చినగంజాం, మే 6 : మండలంలోని రాజుబంగారుపాలెం గ్రామానికి చెందిన బక్కా ఏడుకొండలురెడ్డి జాతీయ స్థాయి ఓపెన్ తైక్వాండో పోటీలలో గోల్డ్ మెడల్‌ను సాధించారు. గోవాలో ఈనెల 4,5,6 తేదీలలో యూత్ అండ్ డెవలప్‌మెంట్ స్పోర్ట్స్ ఆఫ్ ఇండియా నిర్వహించిన ఓపెన్ తైక్వాండో పోటీలలో సీనియర్ విభాగంలో అండర్-74 కేటగిరీలో గోల్డ్ మెడల్ సాధించినట్లు ఏడుకొండలురెడ్డి సోమవారం తెలిపారు. జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించిన ఏడుకొండలురెడ్డిని తైక్వాండో కోచ్ సయ్యద్ సల్లా ఉద్దీన్, పి.ప్రశాంత్‌బాబు, గ్రామ పెద్దలు అభినందించారు.

విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు : డీఎంహెచ్‌వో

మనుబోలు: వైద్యసిబ్బంది విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో పెంచలయ్య హెచ్చరించారు. సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన అదనపు డీఎంహెచ్‌వో ఎస్‌కే ఖాదర్‌వల్లీ, ఉప వైద్య, ఆరోగ్య అధికారి డా. పి దయాకర్‌తో కలిసి తనిఖీ చేశారు. వచ్చే నెలలో కేంద్ర ఆరోగ్యశాఖ బృందం తనిఖీలు చేయనున్నదని, తప్పనిసరిగా సిబ్బంది విధులు జాగ్రత్తగా నిర్వహించాలని, రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండా లని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు గేయపూజిత, మొహసీనా సుల్తానా, సీహెచ్‌వో రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

నేను విన్నాను.. నేను మరిచాను

● డీఎస్సీ లేదు.. ఒక్క టీచరు పోస్టూ భర్తీ లేదు!

- ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో నిబంధనలతో నోటిఫికేషనా!?
- భారీగా తగ్గిపోయిన పోస్టులు
- వైసీపీ సర్కారు తీరుపై అభ్యర్థుల్లో ఆగ్రహం





గడిచిన ఐదేళ్లలో ఒక డీఎస్సీ లేదు. తీరా రెండు నెలల్లో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించినా అందులో ఆశించిన మేర పోస్టులు లేవు. ఇన్నాళ్లు లక్షలాది రూపాయలు వెచ్చించి డీఎడ్, బీఈడీ కోర్సులు పూర్తి చేసిన తమ పరిస్థితి ఏమిటంటూ వైసీపీ ప్రభుత్వంపై యువత మండిపడుతోంది. కేవలం ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను కప్పిపుచ్చుకోవడానికే డీఎస్సీ అంటూ మభ్యపెట్టిందని వాపోతున్నారు. ఇంతకాలం ఎదురుచూసినా ఉపయోగం లేకుండా పోయిందని వారు కన్నీటి పర్యంతమవుతున్నారు.

నెల్లూరు (విద్య), మే 6 : రాష్ట్రవ్యాప్తంగా 35వేల ఉపాధ్యాయ పోస్టులకు కేవలం 6,100 పోస్టులు మాత్రమే భర్తీ చేయాలని నిర్ణయించారు. ఉన్న ఖాళీలను 117 జీఓ ముసుగులో కుదించడంతో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తి తగ్గించారు. దీనికిగాను జిల్లాలో 346 పోస్టులను భర్తీ చేయాలని ప్రకటించారు. ఇందులో ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్, టీజీటీ పోస్టులు మాత్రమే ఉన్నాయి. వేలమంది నిరుద్యోగులు డీఎస్సీ కోసం ఐదేళ్ల నుంచి ఎదురు చూస్తున్నారు. జిల్లాలో కొన్ని పోస్టులు మాత్రమే భర్తీ చేయడంపై వారు తీవ్ర నిరాశకు గురయ్యారు. జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పెద్ద ఎత్తున ఖాళీలు ఉన్నా భర్తీ చేయకుండా పోస్టులను దాచేయడంపై పలు విమర్శలు వెల్లువెత్తాయి. ఇటీవల డీఎస్సీ ప్రకటన ద్వారా నియామకాలు చేపడుతున్నామని చెప్పినా వాస్తవ ఖాళీల్లో మూడోవంతు కూడా భర్తీ అయ్యే అవకాశం లేకుండా నోటిఫికేషన్ ఇచ్చారని చెపుతున్నారు. అన్ని పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్ల కొరత, ఎస్‌జీటీల కొరత ఉండటంతో ఈ ఏడాది విద్యార్థుల చేరిక కూడా తగ్గిపోయినట్లు గణాంకాలు చెబుతున్నాయి. అలాగే పలు ఏకోపాధ్యాయ పాఠశాలలు కొనసాగుతుండగా ఈ పాఠశాలల్లో బోధన నామమాత్రంగానే ఉంటోంది. మరికొన్ని చోట్ల సీఆర్పీలు ఉపాధ్యాయులుగా కొనసాగుతుండగా ఆయా ప్రాంతాల్లో మాత్రం పోస్టులను భర్తీ చేసే దిశగా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు.

● వేలాది మంది నిరాశ

గడిచిన ఐదేళ్లలో డీఎడ్ పూర్తి చేసిన వారు 10వేల మంది, బీఈడీ పూర్తి చేసిన మరో 10వేల మంది కలిపి 20 వేల మంది వరకు నిరుద్యోగులు డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్నారు. వీరిలో అత్యధిక శాతం గ్రామీణ, బడుగు, బలహీన వర్గాలకు చెందిన యువత లక్షలాది రూపాయలు వెచ్చించి కోర్సులను పూర్తి చేశారు. ఫిబ్రవరిలో ప్రభుత్వం నామమాత్రంగా డీఎస్సీ ప్రకటన చేయడంతో వేలాదిమంది యువత భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. రాష్ట్ర విభజన తరువాత ఇప్పటి వరకు రెండు డీఎస్సీలు నిర్వహించగా ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తక్కువ సమయంలో మూడో డీఎస్సీ విడుదల చేసింది. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం 2014, 2018లో మెగా డీఎస్సీలు ప్రకటించడంతోపాటు ఉన్న పోస్టులన్నీ బహిర్గత పరచి ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోస్టుల భర్తీ ప్రక్రియ చేపట్టారు. కానీ ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం మాత్రం నాలుగున్నరేళ్ల తరువాత ఎన్నికల సమయంలో డీఎస్సీని హడావుడిగా ప్రకటించి నిరుద్యోగులను మోసం చేసిందని నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధ్యాయ విద్యకు అభ్యర్థులేరీ!?

ఉపాధ్యాయ అర్హత కోర్సులైన బీఎడ్, డీఎల్‌ఈడీలకు అభ్యర్థులు కరువయ్యారు. ఉమ్మడి జిల్లాలో వీరి సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. గడిచిన ఐదేళ్లలో కనీసం 20శాతం కూడా సీట్లు భర్తీ కాలేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ కలిపి మొత్తం 30 వరకు కళాశాలలు ఉండగా వీటిలో 6వేల సీట్లు అందుబాటులో ఉన్నాయి. అయితే ఈ ఏడాది 610 మంది మాత్రమే ప్రవేశ పరీక్ష రాశారు. దీంతో ఆయా కళాశాలల ఉనికి ప్రశ్నార్థకంగా మారడంతో కొన్ని కళాశాలలు మూసివేత దిశగా అడుగులు వేస్తున్నాయి. కొన్ని యాజమాన్య కోటాలో ప్రవేశాలపై ఆధారపడుతున్నాయి. ప్రధానంగా డీఎస్సీ ప్రకటన లేకపోవడంతోనే ప్రవేశాలకు అభ్యర్థులు నిరాసక్తత చూపుతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఒక్క ప్రకటన కూడా వెలువడకుండా మే నెలలో ఎన్నికలు వస్తుండడంతో ఫిబ్రవరిలో షరతులతో కూడిన నోటిఫికేషన్ విడుదల చేశారు. అది కూడా అతి తక్కువ పోస్టులు భర్తీ చేస్తున్నట్లు ప్రకటించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో 2018లో పోస్టుల మంజూరుకు చర్యలు చేపట్టినా న్యాయపరమైన సమస్యలతో నియామకాల్లో జాప్యం జరిగింది. ఈ క్రమంలో గత ఏడాది 1998, 2008 డీఎస్సీల్లో నష్టపోయిన అభ్యర్థులకు ఎంటీఎస్ విధానంలో అవకాశం కల్పించారు.

● భర్తీకాని సీట్లు..

జిల్లాలో బీఈడీ కోర్సుకు 2,500 వరకు సీట్లు ఉండగా 2021-22లో 605మంది, 2022-23లో 510 మంది, 2023-24లో 400 మంది చేరినట్లు సంబంధిత కళాశాలల యాజమాన్యాలు తెలిపాయి. అలాగే డీఈఈ కోర్సుకు 4వేల సీట్లు అందుబాటులో ఉండగా 2021-22లో 400 మంది, 2022-23లో 310 మంది, 2023-24లో 150 మంది చేరినట్లు తెలిపారు.

డీఎస్సీ కోసం ఎదురు చూస్తున్నాం



ఐదేళ్లుగా డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నాం. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఒక్క డీఎస్సీ కూడా విడుదల చేయలేదు. మే నెలలో ఎన్నికలు పెట్టుకుని ఫిబ్రవరిలో మొక్కుబడి డీఎస్సీ విడుదల చేశారు. అది కూడా నిబంధనలను కఠినతరం చేస్తూ తక్కువ పోస్టులు విడుదల చేశారు. వేలాది మంది అభ్యర్థులు ఉద్యోగం వస్తుందన్న ఆశతో శిక్షణ పొందుతూ ఆశగా ఎదురు చూసినా నిరాశే మిగిలింది. పాఠశాలలను విలీనం చేసి పోస్టులన్నీ కుదించేశారు. దీనివల్ల యువతకు పూర్తిగా అన్యాయం జరిగింది. రానున్న ప్రభుత్వమైనా మాపై జాలి చూపించి మూసివేసిన పాఠశాలలన్నీ పునరుద్ధరించాలి.

- ఆంజనేయులు, డీఎస్సీ అభ్యర్థి

పోస్టులను కుదించడం బాధాకరం




పదేళ్లుగా నేను డీఎస్సీలో శిక్షణ పొందుతున్నా. ఐదేళ్ల క్రితం డీఎస్సీలో ఒకసారి అవకాశం కోల్పోయాను. మళ్లీ డీఎస్సీ పడుతుందన్న ఆశతో తర్ఫీదు తీసుకున్నా. వేల మంది నిరుద్యోగులు డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం నామమాత్రంగా డీఎస్సీ ప్రకటన చేయడంతో నా లాంటి యువత భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. రాష్ట్ర విభజన తరువాత ఇప్పటి వరకు రెండు డీఎస్సీలు నిర్వహించగా వైసీపీ ప్రభుత్వం మాత్రం నాలుగున్నరేళ్ల తరువాత ఎన్నికల సమయంలో డీఎస్సీని హడావుడిగా ప్రకటించింది.

- గిరీష్, డీఎస్సీ అభ్యర్థి

● తప్పని నిరాస

పాఠశాలల విలీనంతో ఇప్పటికే కొన్ని పోస్టులు రద్దయ్యాయి. హేతుబద్ధీకరణ చర్యలతో ఖాళీల సంఖ్య భారీగా తగ్గింది. కొన్నిచోట్ల ఖాళీలు ఉన్నా అవరోహణ క్రమంలో సర్దుబాటు చేసినట్లు విద్యాశాఖ ప్రకటించింది. ఉపాధ్యాయుల అనుమతితో మిగులు పోస్టులను అవసరమైన సబ్జెక్ట్‌లకు మళ్లించి (కన్వర్షన్) కేటాయింపులు చేయడంతో డీఎస్సీకి ఖాళీలు లేకుండా పోయాయి. 2008కి ముందు బీఈడీ వారికి ఎస్జీటీతో పాటు సహాయక పోస్టులకు పోటీపడే అవకాశం ఉండేది. గత ఏడాది డీఎస్సీలో ఎస్జీటీ పోస్టులను డీఎల్‌ఈడీ (డిప్లొమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్) వారికి 30శాతం కోటాను అమల్లోకి తెచ్చారు. తర్వాత వందశాతం కేటాయిస్తూ వచ్చారు. ఈ క్రమంలో చాలామంది న్యాయస్థానాన్ని ఆశ్రయించడం తో 2018 డీఎస్సీ నుంచే బీఈడీలకు రెండు పోస్టులకు అనుమతించారు. ఇప్పటికే బీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులు ఎక్కువ సంఖ్యలో ఉండటం, ఉన్నవారికే పోస్టులు తీయకపోవడం, పాఠశాలలు విలీనంతో ఎస్జీటీ పోస్టులు రద్దు కావడంతో కొత్తవారు కోర్సుల్లో చేరడం లేదు.

> మన ప్రభుత్వం రాగానే వంద రోజుల్లో మెగా డీఎస్సీ ప్రకటిస్తా. నిరుద్యోగులందరికీ ఉద్యోగాలు కల్పిస్తా.
> -గత ఎన్నికల సందర్భంగా నిరుద్యోగులను ఉద్దేశించి జగన్ అన్న మాటలివి.



నియోజకవర్గాల వారీగా ఆది, సోమవారాల్లో పోలైన పోస్టల్ బ్యాలెట్ ఓట్లు			
నియోజకవర్గం	ఓట్లు	పోలైనవి	శాతం
నెల్లూరు సిటీ	2419	1788	73.91
నెల్లూరు రూరల్	4304	3134	72.81
కందుకూరు	1635	1293	79.08
కావలి	2933	2050	69.89
ఆత్మకూరు	2352	1693	71.98
ఉదయగిరి	2336	1677	71.78
సర్వేపల్లి	1268	1603	78.47
కోవూరు	2587	1911	73.86
మొత్తం	19.834	15.149	76.37


రెండోరోజు జోరుగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

హక్కు వినియోగానికి బారులు ● పెరిగిన పోలింగ్‌శాతం

నెల్లూరు (హరనాథపురం); మే 6: ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు మండుటెండను సైతం లెక్కచేయకుండా రెండోరోజు సోమవారం పోస్టల్ బ్యాలెట్ ఓట్లను వినియోగించుకున్నారు. ప్రతి ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు భారీ సంఖ్యలో క్యూలైన్లలో నిలబడి ఉండటం కనిపించింది. ఆయా సెంటర్లలో ఓటర్లకు మంచినీరు, కుర్చీలు, ఎండ తీవ్రత దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు అందుబాటులో ఉంచారు. జిల్లా కలెక్టర్ హరినారాయణన్ జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్లలో తిరిగి పోలింగ్ సరళిని పరిశీలించారు. ముఖ్యంగా నెల్లూరు సిటీ, రూరల్, సర్వేపల్లి, కందుకూరు నియోజకవర్గాలో ఓటింగ్ శాతం బాగా పెరిగింది.జిల్లాలో మొత్తం 19,834 పోస్టల్ బ్యాలెట్లు ఉండగా, ఆది, సోమవారాల్లో 15,149 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్‌శాతం 76.37గా నమోదైంది. కందుకూరు నియోజకవర్గంలో అత్యధికంగా పోలింగ్ శాతం నమోదైంది. కాగా ఇతర జిల్లాల వారి పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 2,548 ఉన్నాయి. ఆది, సోమవారాల్లో నగరంలోని జడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్లో 1374 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిశాతం 53.92గా ఉంది.

కలెక్టర్ పరిశీలన

నెల్లూరు నగరంలో జరిగిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియను కలెక్టర్ హరినారాయణన్ సోమవారం పరిశీలించారు. వీఆర్ లా కళాశాల, డీకే డబ్ల్యు కళాశాలల్లో రెండో రోజు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సరళిని కలెక్టర్ పరిశీలించి, అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎన్నికల విధులకు కేటాయించిన ఉద్యోగులందరూ ఈనెల 8వ తేదీలోగా నియోజవర్గ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రాల్లో తప్పనిసరిగా వారి ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.



కోవూరులో పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

పేదోళ్ల ఇళ్లపై అక్కసు


- నాలుగున్నరేళ్లపాటు ఖాళీగా టిడ్కో ఇళ్లు
- టీడీపీకి మైలేజ్ వస్తుందనే వదిలేశారా!?
- ఆర్నెళ్ల క్రితం అరకొరగా కేటాయింపు
- సమస్యల నడుమ కాపురాలు చేయలేకున్న లబ్ధిదారులు

అర్హులైన ప్రతి ఒక్కరికీ సొంతిల్లు కల్పించాలన్నదే తెలుగుదేశం లక్ష్యం. ఆ మేరకే జిల్లావ్యాప్తంగా నాలుగు మున్సిపాలిటీల పరిధిలో 18,372 టిడ్కో ఇళ్లు నిర్మించింది. కొందరు లబ్ధిదారులతోనూ గృహప్రవేశాలు చేయించింది. పేదోళ్ల కల నెరువేరుతున్న తరుణంలో ఎన్నికల కోడ్ రావడంతో లబ్ధిదారులను ఎంపిక చేసి ఉన్నా, వారికి ఇళ్లు అప్పగించలేకపోయారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ సర్కారు ఈ ఇళ్లను పేదలకు అప్పగిస్తే టీడీపీకి మంచి పేరు వస్తుందనే అక్కసుతో నాలుగేళ్లపాటు నిర్లక్ష్యం చేసింది. శిథిలస్థితికి చేరుకున్న ఇళ్లను ఇటీవల కాలం నుంచి లబ్ధిదారులకు ఇచ్చి పాలకులు చేతులు దులుపుకున్నారు. సమస్యల నడుమ కాపురాలు చేయలేని లబ్ధిదారులకు ఇళ్లు వచ్చాయన్న ఆనందం కొన్ని రోజులకే ఆవిరైపోయాయి.

- ఆంధ్రజ్యోతి బృందం



నెల్లూరు : అక్కచెరువుపాడు వద్ద శిథిలస్థితికి చేరుకుంటూ..



నెల్లూరు : అల్లీపురంలో ప్రారంభానికి ముందే దెబ్బతిన్న టైల్స్



విద్యుత్ తీగలు ఇలా..



ఆత్మకూరులో ట్యాంకరు వస్తేనే దాహం తీరేది!

నెల్లూరు వెంకటేశ్వరపురంలో తెలుగుదేశం హయాంలో 4800 టిడ్కో ఇళ్లు నిర్మించారు. వైసీపీ ప్రభుత్వం ఈ ఇళ్లను ఉద్దేశపూర్వ కంగా నాలుగున్నరేళ్లపాటు అలాగే వదిలేసింది. ఆరు నెలల క్రితం వీటిని లబ్ధిదారులకు అప్పగించారు. అయితే మంచినీటి కొరత, డ్రైనేజీ సమస్య, దొంగల బెడద కారణంగా ఇంకా వెయ్యికిపైగా ఇళ్లు ఖాళీగా ఉన్నాయి. నెల్లూరు శివార్లలోని అల్లీపురంలో 5 వేలు, అక్కచెరువుపాడులో 500, కల్లూరిపల్లిలో 500, కొండ్లపూడిలో 3 వేలు చొప్పున టిడ్కో ఇళ్లు నిర్మించారు. వీటిల్లో లబ్ధిదారులు ప్రస్తుతం ఉండటం లేదు. ఈ ప్రాంతాలలో రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్, బాతురూములు వగైర సౌకర్యాలేవి పూర్తిగా అందుబాటులో లేవు. ఇళ్లు నిర్మించి సౌకర్యాలు కల్పన లేక సముదాయాలను వదిలేయడంతో గృహాలన్నీ సహజత్వాన్ని కోల్పోయాయి. టైల్స్ పగిలిపోవడం, ద్వారబంధ్రాలు పుచ్చిపోవడం, కిటికీ అద్దాలు పగిలిపోవడం, ఫ్యాన్లు చోరీకి గురవడంతో వాటిని లబ్ధిదారులకు ఇవ్వలేక అధికారులే అలా వదిలేశారు.

● ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో టీడీపీ హయాంలో 1052 టిడ్కో గృహాలు నిర్మించారు. వీటిని కూడా నాలుగేళ్లు ఖాళీగా ఉంచి ఇటీవలే లబ్ధిదారులకు ఇచ్చారు. అయితే తాగునీరు, డ్రైనేజీ సమస్యలు తీవ్రంగా ఉండటంతో సగం మంది ఆ ఇళ్లలో చేరలేదు. ప్రస్తుతం ఇక్కడ నివాసం ఉండేవారు తాగునీరు మూడు అంతస్తుల పైకి మోసుకొని వెళుతున్నారు.



కావలి : అపార్ట్‌మెంట్‌లోకి వెళ్లే దారేదీ!?

● కావలిలో 2,112 ఇళ్లను నాలుగేళ్లపాటు ఖాళీగా ఉంచి ఇటీవల పేదలకు కేటాయించారు. ఇందులో 350 మంది మాత్రమే కాపురాలు ఉంటున్నారు. కనీస వసతులు లేవని ఎవరూ అక్కడ చేరడం లేదు. వైసీపీ ప్రభుత్వం రంగులు వేసుకుంది తప్ప ఒక్క చిన్న పని కూడా చేయలేదు.

● కందుకూరులో 1408 ఇళ్లు నిర్మించగా, ఇటీవల 1200 ఇళ్లు పేదలకు పంపిణీ చేశారు. ప్రస్తుతం 150 మంది మాత్రమే కాపురాలు ఉంటున్నారు. కనీస వసతులు లేని కారణంగా లబ్ధిదారులు ఆ ఇళ్లలో చేరడం లేదు.

'మెట్టలో' ఈదురుగాలుల బీభత్సం

● వడగళ్ల వాన.. గాలులకు లేచిన రేకులు

ఉదయగిరి రూరల్/వరికుంటపాడు : ఉదయగిరి ప్రాంతంలో సోమవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వడగళ్ల వర్షం కురిసింది. ఉదయం నుంచి భానుడు దెబ్బకు ఉక్కపోతతో అల్లాడిన ప్రజలకు సాయంత్రం వర్షం కురవడంతో వాతావరణం చల్లబడి ఉపశమనం పొందారు. బలమైన ఈదురుగాలులు వీయడంతో ఉదయగిరి మండలంలోని దేకూరుపల్లిలో రామయ్య అనే రైతుకు చెందిన పశువుల షెడ్ రేకులు లేచిపోయాయి. పలు ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగి నేలకొరి గాయి. ఉదయగిరిలోని డ్రైనేజీ కాలువలు పొంగి పొర్లడంతో రహదారులు చెత్తాచెదారంతో నిండిపోయాయి. విద్యుత్ సరఫరాకు సైతం అంతరాయం కలిగింది. గాలుల కారణంగా మామిడి కాయలు నేలరాలడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. వరికుంటపాడు మండలంలోనూ ఉరుములు, మెరుపులతో వడగండ్ల వర్షం కురిసింది. చెట్ల కొమ్మలు విరిగి నేలకొరిగాయి.



దేకూరుపల్లిలో లేచిపోయిన రేకులు



ఉదయగిరిలో పడ్డ వడగళ్లు



ఉలవపాడు: కృష్ణనగర్‌లో టీడీపీలో చేరిన వారితో మాట్లాడుతున్న అభ్యర్థులు వేమిరెడ్డి, ఇంటూరి

ఉలవపాడుతో అవినాభావ సంబంధం

● రోడ్‌షోలో నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి

ఉలవపాడు, మే 6 : చిన్ననాటి నుంచే తనకు ఉలవపాడుతో అవినావభావ సంబంధం ఉందని నెల్లూరు ఎంపీ టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఉలవపాడు, రాజుపాలెం, కరేడు, ఆత్మకూరు, చాకిచర్ల గ్రామాలలో కందుకూరు టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి ఆయన పర్యటించారు. ఉలవపాడులో మహిళలు హారతులు పట్టి, గుమ్మడికాయ లతో దిష్టి తీసి సాదర స్వాగతం పలికారు. అనంతరం జూనియర్ కళాశాల నుంచి ప్రారంభమైన రోడ్డు షో ఎస్సీ కాలనీ మీదగా కొనసాగింది. ఈ సందర్భంగా వేమిరెడ్డి మాట్లాడుతూ ఉలవపాడులో జరిగే వేణుగోపాల స్వామి తిరునాళ్లకు వచ్చి తన బంధువు అయిన దేవరపల్లి వెంకట కృష్ణారెడ్డి ఇంటిలో గడిపేవాడినని గుర్తు చేసుకున్నారు. ప్రజల అభిమానం, జనసందోహం చూస్తుంటే టీడీపీకి తిరుగులేని విజయం చేకూర్చుతారనే నమ్మకం ఏర్పడిందని అన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు అవసరం ఉందని, ఆయన్ను గెలిపించుకోవాల్సిన బాధ్యత తమపై ఉందన్న కసితో ప్రజలు ఉన్నారని అన్నారు. కందుకూరు అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ రామాయపట్నం పోర్టు నిర్మాణం పూర్తయితే మండలంలోని యువతకు ఉపాధి భరోసా కల్పించే బాధ్యత మేం తీసుకుంటామని అన్నారు. అలాగే టీడీపీ అధికారంలోకి రాగానే స్థానిక సమస్యలను కూడా వేమిరెడ్డి సహకారంతో పరిష్కరిస్తామని చెప్పారు.

కావలి కందుకూరు

ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోండి

లింగసముద్రం, మే 6 : రాబోయే ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని గుడ్లూరు సీఐ బీవీవీ సుబ్బారావు చెప్పారు. ఆదివారం రాత్రి పెదపవనిలో టీడీపీ, వైసీపీ పార్టీల వర్గాల వారి మధ్య ఘర్షణలు జరిగిన నేపథ్యంలో సోమవారం రాత్రి 8 గంటల సమయంలో గుడ్లూరు సీఐ ఆధ్వర్యంలో తమిళనాడు పోలీసు బలగాలు, గుడ్లూరు సర్కిల్ పరిధిలోని పోలీస్ సిబ్బంది కవాతు నిర్వహించారు. ప్రజలు ప్రశాంత ఎన్నికల నిర్వహణకు సహకరించాలని కోరారు .ఈ కార్యక్రమంలో ఎస్సై ఎం బాజీబాబు పాల్గొన్నారు.

పెదపవనిలో టీడీపీ, వైసీపీ వర్గాల ఘర్షణ

లింగసముద్రం, మే 6 : మండలంలోని పెదపవని ఎస్సీ కాలనీలో ఆదివారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులతో వైసీపీకి చెందిన వారు ఘర్షణ పడ్డారు. ఈ ఘటనపై ఇరువర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసులు నమోదు చేశారు. ఎస్సై ఎం.బాజీబాబు కథనం మేరకు.. రాత్రి 9 గంటల సమయంలో ఎస్సీ కాలనీలో ప్రచారం చేస్తున్న టీడీపీకి చెందిన దిలీప్, కృష్ణ, తదితరులతో వైసీపీ నాయకుడు మంద కొండయ్య, ఆయన బంధువులు వాగ్వాదానికి దిగి ఘర్షణ పడ్డారు. వైసీపీకి చెందిన కర్రా కోటేశ్వరరావు ఫిర్యాదు మేరకు టీడీపీకి చెందిన రామిశెట్టి మాల కొండయ్య, గొర్రెపాటి సాంబయ్యలపై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేశారు. దిలీప్, కృష్ణలపై పలు సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశారు. అదేవిధంగా టీడీపీ నేత దిలీప్ ఫిర్యాదు మేరకు వైసీపీకి చెందిన మంద కొండయ్య, రవి, కర్రా రాజు మరో ముగ్గురిపై కేసులు నమోదు చేశారు.

రేపు కూడా పోస్టల్ బ్యాలెట్ ఓటుకు అవకాశం : ఆర్వో

కావలి, మే 6: ఎన్నికల పోలింగ్ డ్యూటీకి కేటాయించిన ఉద్యోగులు ఈ నెల 8వ తేదీన కూడా పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసుకునేందుకు అవకాశం కల్పించామని కావలి రిటర్నింగ్ ఆఫీసర్ శీనా నాయక్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కావలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 5 ఫెసిలిటేషన్ సెంటర్లలో ఈ నెల 5, 6, 7 తేదీలలో ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. ఆ రోజుకు పూర్తి కాకపోతే మిగిలిన ఓటర్ల కోసం ఈ నెల 8వ తేదీన ఆర్డీవో కార్యాలయంలో ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేసి అక్కడ ఓటు వినియోగానికి అవకాశం కల్పిస్తామన్నారు. అలాగే పోలింగ్‌కు కేటాయించి పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోని ఉద్యోగులు కూడా 8వ తేదీ నేరుగా ఆర్డీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకుని పోస్టల్ బ్యాలెట్ ఓటు వినియోగించుకోవచ్చన్నారు. ఈ విషయాన్ని గమనించి ప్రతి ఉద్యోగి తమ ఓటు వినియోగించుకోవాలని చెప్పారు.

టీడీపీ గూటికి వైసీపీ నాయకులు


రవిచంద్ర సమక్షంలో పార్టీలో చేరిన వైసీపీ నేతలు

దగదర్తి (బిట్రగుంట), మే 6: దగదర్తి మండలం యలమంచిపాడుకు చెందిన వైసీపీ నాయకులు శివనారాయణ, సోమశేఖర్‌లు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర సమక్షంలో సోమవారం టీడీపీ కండువా వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడు, మాలేపాటి రవీంద్రనాయుడు పాల్గొన్నారు.

ఓటు వినియోగంపై అవగాహన

కందుకూరు, మే 6: నియోజకవర్గంలో టీడీపీ నేతలు విస్తృత ప్రచారం చేస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ కూటమి విజయం సాధిస్తే అమలు చేయబోయే సంక్షేమ పథకాలను వివరిస్తూ ముద్రించిన కరపత్రాలతో పాటు ఈవీఎం నమూనాలో ఓటు హక్కు ఎలా వినియోగించుకోవాలో ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పిస్తున్నారు. అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావుకు ఈవీఎంలో ఒకటో నెంబరులో, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి ఈవీఎంలో సీరియల్ నెంబరు 2 సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని అవగాహన కల్పిస్తున్నారు. పట్టణంలోని 7, 14వ వార్డుల పరిధిలోని బండపాలెం, శ్రీరామ్‌నగర్ కాలనీ, శ్రీనగర్ కాలనీ ఏరియాలలో యువత, మహిళలు సోమవారం సాయంత్రం పెద్దఎత్తున ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అలాగే తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు వాసవీనగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గట్టమనేని హరిబాబు, జొన్నాదుల రాఘవయ్య, మన్నేపల్లి వరప్రసాదరావు, కొమ్మి నరసింగరావు, టీడీపీ నాయకులు కొత్తూరి సుధాకర్‌రావు, తాతా లక్ష్మీనారాయణ, కోట కిషోర్, కోటా నరసింహం, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయండి : బొల్లినేని


స్వామివారి సేవలో బొల్లినేని, మేకపాటి

కొండాపురం, మే 6: తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేసిన అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకట రామారావు అన్నారు. సోమవారం మండలంలోని గుడవళ్లూరు పంచాయతీలో రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖరరెడ్డితో కలసి దర్శించుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ అభ్యర్థుల గెలుపునకు తనతోపాటు మేకపాటి చంద్రశేఖరరెడ్డి కృషి చేస్తున్నారన్నారు. స్వామి ఆశీస్సులతో తెలుగుదేశం పార్టీని గెలిపించి రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడును చేసుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పోలినేని రమేష్, వట్టిగుంట పెరుమాళ్లనాయుడు, స్థానికులు సీహెచ్. వెంకటాద్రి, బీ.మాచెర్ల, వీ.మణికుమార్, తిమోతి తదితరులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నేడు నారా రోహిత్ పర్యటన

జలదంకి, మే 6: సినీహీరో, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సోదరుడి కుమారుడు నారా రోహిత్ మంగళవారం జలదంకిలో జరిగే రోడ్‌షోలో పాల్గొననున్నారు. సాయంత్రం 4గంటలకు జలదంకి ఎస్సీకాలనీ వద్ద రోడ్‌షో మొదలై చావిడి కూడలి మీదుగా బ్యాంకువీధి, బస్టాండు సెంటర్ ప్రాంతాల మీదుగా గట్టుపల్లి రోడ్డు కూడలి వరకు సాగనుంది. అనంతరం గట్టుపల్లి రోడ్డు కూడలిలో జరిగే సభలో ఎన్డీఏ కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కాకర్ల సురేష్‌లను గెలిపించాలని కోరుతూ ప్రసంగించనున్నారు. ఈ రోడ్‌షోలో మండలంలోని అన్ని గ్రామాల కూటమి నాయకులు, కార్యకర్తలు, ఎన్టీఆర్, బాలకృష్ణ, పవనకళ్యాణ్ అభిమానులు పాల్గొనాలని కోరారు.

అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేస్తా : ఇంటూరి


ఉలవపాడు మండలం ఆత్మకూరులో జరిగిన సభలో మాట్లాడుతున్న ఇంటూరి, పక్కన వేమిరెడ్డి


ఉలవపాడు కృష్ణానగర్‌లో టీడీపీ అభ్యర్థులు వేమిరెడ్డి, ఇంటూరి నిర్వహిస్తున్న ర్యాలీ

- వైసీపీ నుంచి టీడీపీలోకి బారీగా వలసలు
- మొగలిచెర్లలో ఫ్యాన్ రివర్స్

లింగసముద్రం, మే 6 : రాబోయే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటేసి తనకు ఒక్క అవకాశం ఇస్తే మన ప్రాంతాన్ని సమగ్రాభివృద్ధి చేస్తానని ఎన్డీఏ కూటమి నుంచి కందుకూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఇంటూరి నాగేశ్వరరావు కోరారు. సోమవారం ఆయన మండలంలోని మొగిలిచెర్లలో పర్యటించారు. టీడీపీ మండల అధ్యక్షుడు వేముల గోపాలరావు ఆధ్వర్యంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు స్వర్ణ చిన్న అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో గ్రామానికి చెందిన వైసీపీ నేతలు నవులూరి రవీంద్ర, మార్నేని వెంకటేశ్వర్లు, ఓరుగంటి చిన అంకయ్య, ఎంపీటీసీ సభ్యుడు వెన్నపూస కృష్ణారెడ్డి, వెన్నపూస చెన్నారెడ్డి, గద్దె లక్ష్మీనారాయణ, తదితరులు టీడీపీలో చేరారు. వారికి నాగేశ్వరరావు పసుపు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. దీంతో మండలంలో టీడీపీలోకి ప్రతిరోజూ వలసల పరంపర కొనసాగుతోంది. మొగిలిచెర్ల గ్రామంలో ఫ్యాన్‌కు షాక్ తగిలింది. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అంగుళూరి చినకొండయ్య, నవులూరి చినచెంచురామయ్య, బొల్లినేని నాగేశ్వరరావు, మద్దెల రామారావు, పల్లపోతు వెంగళరావు, చుండూరి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటూరి సౌజన్య ఇంటింటి ప్రచారం

వలేటివారిపాలెం : మండలంలోని పోకూరు, నూకవరం గ్రామాలలో టీడీపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి సౌజన్య సోమవారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. ముందుగా పోకూరు ఎస్టీ కాలనీలోని చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ఎమ్మెల్యేగా నా భర్త నాగేశ్వరరావును, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలంటే చంద్రబాబునాయుడను ముఖ్యమంత్రిని చేసుకోవలసిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దాచర్ల శ్రీనివాసులు, బద్దిపూడి శిఖామణి, ఇంటూరి యలమంద, ఇంటూరి రవి, మన్నం శ్రీనివాసులు, దాచర్ల హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.


వలేటివారిపాలెం : పోకూరులో ప్రచారం చేస్తున్న సౌజన్య


లింగసముద్రం : టీడీపీలో చేరిన వారితో ఇంటూరి

పదేళ్లుగా బోగోలు వాసుల కష్టాలు కనిపించలేదా ?

- ఎమ్మెల్యేని ప్రశ్నించిన కావ్య క్రిష్ణారెడ్డి


బిట్రగుంట : చిన్నారిని ఎత్తుకుని ప్రచారం రథంపై దగుమాటి

బిట్రగుంట, మే 6: బోగోలు వాసుల కష్టాలు పదేళ్లుగా ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి కనిపించలేదా అని టీడీపీ కావలి అభ్యర్థి దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి ప్రశ్నించారు. బోగోలు సోమవారం టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బేతనీపేట నుంచి ప్రారంభమైన దగుమాటి ప్రచారం బోగోలు, యాదవపాలెం, కుమ్మరవీధి, అరవపాలెం, బోగోలు కూడలి, బృందావనంలో జరిగింది. ఈ సందర్భంగా దగుమాటి క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఏమి చేశారని ప్రశ్నించారు. నియోజకవర్గంలో యథేచ్ఛగా సాగుతున్న గ్రావెల్, మట్టి, ఇసుక మాఫియాకు బాస్‌గా వ్యవహరించారన్నారు. ఆయన పర్సంటేజ్‌లు, అనుమతులు లేకుండానే రేయింబవళ్లు జరుగుతున్నాయన్నారు. భూకబ్జాలు, అన్యాయం అని అడిగిన వారిపై అక్రమ కేసులు బనాయించడం, వేధించడం ఎమ్మెల్యే అనుచరులు చేస్తున్న పనులన్నారు. కొత్తగా ఫిబ్రవరి నెలలో ఓ ఉపాధ్యాయుడు అమ్మవారి గుడికి దర్శనానికి వచ్చి తిరిగి వస్తున్న నాటి ఫొటోను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి అతని ఉద్యోగానికి ఎసరుపెట్టిన ఘనుడు ప్రతాప్‌రెడ్డి అన్నారు. బోగోలు రైల్వే ఎల్సీగేట్ గంటల తరబడి వేసి ఉండటం కారణంగా మండల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నా పట్టించుకోలేదన్నారు. కావలి ఎమ్మెల్యేగా నన్ను, నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గెలిపిస్తే కేంద్ర రైల్వే శాఖ ద్వారా బిట్రగుంట రైల్వే అభివృద్ధితో పాటు ఎల్సీ గేటు సమస్య పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమాలలో మాజీ ఎంపీటీసీ చిలకపాటి వేంకటేశ్వర్లు, సీనియర్ నేత గనిపినేని నాగరాజు, మాజీ సర్పంచు దొడ్డ అంజయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు, మహిళ అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. కాగా మాజీ మండల ఉపాధ్యక్షుడు కోడూరు లక్ష్మీరెడ్డి, ఆయన అనుచరులు పావన సుబ్బారెడ్డి, యర్రం చెన్నారెడ్డి, మూలిగ శ్రీనివాసులురెడ్డి, బత్తల ప్రసాద్‌రెడ్డి తదితర వంద మంది వైసీపీని వీడి దగుమాటి సమక్షంలో టీడీపీలో చేరారు. బోగోలుకు చెందిన వ్యాపార సంఘ నేత కాండ్ర శంకర్‌నాయుడు అతని అనుచరులతో టీడీపీ కండువ కప్పుకున్నారు.

కావలి : కావలి పట్టణం, రూరల్ మండలాల్లో సోమవారం పలువురు వైసీపీ నేతలు టీడీపీలో చేరారు. వారికి అభ్యర్థి దగుమాటి వెంకట(కావ్య) క్రిష్ణారెడ్డి టీడీపీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. రూరల్ మండలం చెంచుగానిపాలెంలో సర్పంచు దద్దాల ప్రభాకర్ గౌడ్, దద్దాల వెంకటస్వామి, దద్దాల రామకృష్ణ, దద్దాల వెంకట కృష్ణ ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన దద్దాల అచ్చయ్య, దద్దాల యానాది, దద్దాల మల్లికార్జున, పోసిన వెంకటరమణయ్య, దద్దాల రాజు తదితరులు టీడీపీలో చేరారు. సర్వాయపాలెం పంచాయతీ మాతినవారిపాలెంకు చెందిన వైసీపీ ముఖ్యనాయకుడు సందు రాములు వైసీపీని వీడి ఉప్పాల వెంకట్రావు ఆధ్వర్యంలో కావలి టీడీపీ కార్యాలయంలో టీడీపీలో చేరారు. అలాగే పురిణి శ్రీనివాసులు రెడ్డి, ఆత్మకూరు శ్రీనివాసులు తదితరులు మొగిలిశెట్టి ఆనందరావు ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. పట్టణంలోని 6వ వార్డు వెంగాయగారిపాలెంకు చెందిన వైసీపీ ముఖ్య నాయకులు మాతిన శ్రీనివాసులు, ఉప్పాల వినోద్‌లు వైసీపీని వీడి టీడీపీ నేతలు జంపాని ప్రసాద్, ఉప్పాల శ్రీనివాసులు, గుడిపల్లి శ్రీను ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. అలాగే 7వ వార్డుకు చెందిన వైసీపీ కాపునేత కందుల శ్రీనివాసులు టీడీపీలో చేరారు.


బిట్రగుంట : బోగోలులో ప్రచారంలో పాల్గొన్న దగుమాటి



కావలి : టీడీపీలో చేరిన వారితో కావ్య

సమాజసేవలో కావ్య కృష్ణారెడ్డి ట్రస్ట్

'గెలిపిస్తే ఎంతో సేవ చేస్తాం'... అనే రాజకీయ నాయకులు నేడు ఎంతోమంది ఉన్నారు. అసలు రాజకీయాల్లోకి రాకముందే ప్రజలకు తన కష్టార్జితం నుంచి కొంత మొత్తాన్ని ఖర్చు చేసేవారు చాలా అరుదు. అలాంటివారిలో దగుమాటి వెంకటకృష్ణారెడ్డి(కావ్య కృష్ణారెడ్డి) ఒకరు. రాజకీయాల్లోకి రావాలనే ఆలోచన రాకమునుపే సుమారు పదేళ్లుగా ఆయన పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కావ్య చారిటబుల్ ట్రస్ట్ స్థాపించి తద్వారా అందించిన సేవలతో ఆయన కావ్య కృష్ణారెడ్డిగా పేరొందారు. ఆయన సేవలకు ప్రతిఫలంగా తెలుగుదేశం టికెట్ వరించింది. తొలి జాబితాలోనే కావలి అభ్యర్థిగా దగుమాటి వెంకటకృష్ణారెడ్డి పేరును తెలుగుదేశం అధిష్ఠానం ప్రకటించిందంటే ఆయన చేసిన, చేస్తున్న సేవా కార్యక్రమాలే ఇందుకు కారణం.

- పదేళ్ల కృషి.. సాకారమయ్యే తరుణం
- సేవాకార్యక్రమాలతో గుర్తింపు పొందిన 'కావ్య'
- మంచితనానికి పెరుగుతున్న ప్రజామద్దతు
- కలిసొస్తున్న కొత్త శక్తులు

నెల్లూరు, మే6(ఆంధ్రజ్యోతి): దగుమాటి వెంకటకృష్ణారెడ్డికి విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు అలవడ్డాయి. ఏబీవీపీ నాయకుడిగా విద్యార్థి సమస్యలపై పోరాడారు. సమాజంలోని పలు రుగ్మతలపై విద్యార్థి నాయకుడిగా ఎన్నో పోరాటాలు చేశారు. అప్పటి నుంచే సేవా కార్యక్రమాలు చేయడం ప్రారంభించారు. విద్యార్థి నాయకుడిగా తనకున్న పరిధిలో తోటి విద్యార్థులకు, అందుబాటులో ఉన్న పేదలకు తన చేతనైనంత సాయం చేసేవారు. ఎవరికి ఏ సమస్య వచ్చినా అండగా నిలబడేవారు. ఇలా విద్యార్థి దశలో మొదలైన ఈ సేవాగుణం ఆయనతోపాటు పెరిగి నియోజకవర్గ స్థాయికి విస్తరించింది. కొన్ని వేలమందికి సాయం అందించే ఆపన్నహస్తంగా గుర్తింపు పొందింది.


నూతన వధూవరులకు పెళ్లికానుక కింద రూ.10వేల ఆర్థిక సాయం ఇస్తున్న కావ్య కృష్ణారెడ్డి

పేదల పెళ్లిళ్లకు సాయం

ఎవరికైనా సరే.. పెళ్లి ఓ మధురమైన ఘట్టం. అలాంటి సందర్భాన్ని ధనవంతులయితే ఘనంగా జరుపుకుంటారు. కానీ నిరుపేదలకు ఆ అదృష్టం ఉండదు. కాస్త సరదాకు కూడా డబ్బులుండవు. జీవితాంతం గుర్తుండిపోయే ఆ మధుర ఘట్టమైనాసరే వారు సాదాసీదాగా జరుపుకోక తప్పనిపరిస్థితి. అలాంటి నిరుపేదవర్గాల్లో కాసింత సంతోషం నిలపాలని, వారికి పెళ్లి అనేది ఓ సంబరం చేయాలనే మానవీయ దృక్పథంతో కావ్య కృష్ణారెడ్డి తన ట్రస్ట్ ద్వారా పెళ్లి కానుక పథకాన్ని ప్రారంభించారు. కొత్తగా పెళ్లి చేసుకునే పేద దంపతుల వివాహాలకు హాజరై పెళ్లి పీటలపైనే వధూ వరులకు రూ. 10వేల ఆర్థిక సాయం అందిస్తూ వస్తున్నారు. ఆ డబ్బుతో వారు కాసింత సంబరాలు చేసుకొని, ఆ జ్ఞాపకాలను జీవితాంతం గుర్తుంచుకునేలా చేశారు. కావలి, ఉదయగిరి నియోజకవర్గాల పరిధిలో వందలాదిమంది జంటలకు పెళ్లి కానుక కింద ఆయన ఆర్థికసాయం చేశారు.

కావ్య ట్రస్ట్ ద్వారా విస్తృత సేవలు

వ్యాపార రంగంలో స్థిరపడిన తరువాత వెంకటకృష్ణారెడ్డి సేవా కార్యక్రమాలను విస్తృతం చేశారు. తన సంపాదనలో కొంత పేదలకు పంచడం అలవాటుగా మార్చుకున్నారు. ఈ క్రమంలోనే కావలి, ఉదయగిరి నియోజకవర్గాల పరిధిలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.



విద్యకు, పాఠశాలల అభివృద్ధికి సాయం

మారుమూల ప్రాంతంలో సామాన్య రైతు కుటుంబం లో పుట్టిన కృష్ణారెడ్డి కష్టపడి ఎంకాం పూర్తి చేశారు. చదువుకు ఉన్న విలువ ఆయనకు తెలుసు. చదువు పూర్తయ్యాక అధ్యాపకుడిగా జీవితం ఆరంభించారు. ఆ సమయంలో పేద విద్యార్థులు అనుభవించే కష్టాలను కళ్లారా చూశారు. దీంతో ఆయన వ్యాపార రంగంలోకి అడుగుపెట్టిన తరువాత తన సంపాదనలో కొంతమొత్తాన్ని పేద విద్యార్థుల చదువుకు ఉపయోగపడేలా ఖర్చు చేయాలను కున్నారు. అందులో భాగంగా ఉదయగిరి, కావలి నియోజక వర్గాల పరిధిలోని వేలాదిమంది స్కూలు పిల్లలకు ఉచితంగా బ్యాగులు, పుస్తకాలు పంపిణీ చేశారు. తాగునీటి వసతిలేని పాఠశాలల్లో సొంత ఖర్చులతో బోర్లు వేయించారు. ఎన్నో పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు భారీగా ఖర్చు చేశారు. పాఠశాలల వార్షికోత్సవాలకు రూ. 25వేల చొప్పున విరాళం అందించారు.


పేదలకు మంచాలు అందజేస్తున్న కృష్ణారెడ్డి

పేదలకు మంచాల పంపిణీ

పొలాల గట్లపైనా, కొండల్లో, గుట్టల్లో... ఊరికి దూరంగా పూరిగుడిసెల్లో కాపురం ఉండే అణగారిన వర్గాలు పడుకోవడానికి చాప, దిండు కూడా సక్రమంగా ఉండవు. అలాంటివారి దీనస్థితిని గమనించిన దగుమాటి కృష్ణారెడ్డి తన ట్రస్ట్ ద్వారా వారికి సేవలందించారు. ఉదయగిరి, కావలి నియోజకవర్గాల పరిధిలోని కొన్ని వందల కుటుంబాల వారిని గుర్తించి, ఒక్కో ఇంటికి ఒక్కో మంచం చొప్పున పంపిణీ చేశారు. ఆయన అందించిన సాయంతో వందలాది కుటుంబాలవారు రాత్రి పూట హాయిగా నిద్రిస్తున్నారు.

దప్పిక తీర్చిన జలదాత

కరువు ప్రాంతాలయిన ఉదయగిరి, కావలి మెట్ట ప్రాంతాల్లోని పలుగ్రామాల దాహార్తి తీర్చిన జలదాతగా ఆయన గుర్తింపు పొందారు. ఈ రెండు నియోజక వర్గాల్లో తీవ్ర నీటిఎద్దడి నెలకొన్న సందర్భాల్లో కృష్ణారెడ్డి తన సొంత ఖర్చులతో ట్యాంకర్ల ద్వారా గ్రామాలకు నీటిని సరఫరా చేశారు. కొన్నేళ్లపాటు వేసవి ఎద్దడి నెలకొన్న ప్రాంతాలకు కొన్ని నెలల పాటు ఆయన ట్యాంకర్లతో ఉచిత ంగా మంచి నీటి సరఫరా చేశారు.



వ్యాపారవేత్తగా గుర్తింపు

అధ్యాపక వృత్తికి రాజీనామా చేసిన అనంతరం దగుమాటి కృష్ణారెడ్డి రియల్ ఎస్టేట్ రంగంలోకి అడుగుపెట్టారు. నీతివంతమైన వ్యాపారంతో తక్కువ రోజుల్లోనే ఎక్కువ గుర్తింపు పొందారు. 2011లో గురురాఘవేంద్ర ఇన్ఫ్రాస్ట్రక్చర్‌ను ప్రారంభించి పలు రాష్ట్రాల్లో కార్యకలాపాలను విస్తరించారు.



స్కూలు విద్యార్థులకు బ్యాగులు అందజేస్తున్న..

అంచలంచెలుగా ఎదిగిన రాజకీయ నాయకుడు

కావ్య కృష్ణారెడ్డి ఉన్న పళంగా రాజకీయాల్లోకి వచ్చిన వ్యక్తి కాదు. కిందస్థాయి నుంచి పైకి ఎదిగిన నేత. 2005-06లో జలదంకి సహకార సంఘ అధ్యక్షునిగా పనిచేశారు. 2006-2011 వరకు జలదంకి మండల పరిషత్ అధ్యక్షునిగా (ఎంపీపీ) సేవలందించారు. 2005 నుంచి కావలి, ఉదయగిరి నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీ క్రియాశీల నాయకునిగా వ్యవహరిస్తు వచ్చారు. 2019లో ఉదయగిరి నుంచి టీడీపీ టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నించారు. ఇన్నేళ్లపాటు ఆయన పార్టీకి చేసి న సేవలను గుర్తించిన తెలుగు దేశం అధిష్ఠానం ఈ ఎన్నికల్లో కావలి అభ్య ర్థిగా బరిలోకి దింపిం ది. సేవా గుణం, కార్యకర్తలను కాపాడుకునే నైజం, ప్రజల కు మంచి చేయాలనేత త్వం ఉన్న కృష్ణారెడ్డి పట్ల ప్రజల్లో మంచి సానుకూ లత వ్యక్తం అవుతోంది. ఆయన నిర్వ హిస్తున్న ఎన్నికల ప్రచారానికి విశేష స్పందన లభిస్తోం ది. ఆయన నాయకత్వాన్ని బలపరు స్తూ టీడీపీలో కొత్తగా చేరేవారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది.

కండలేరు ఎడమ కాలువ ఎత్తిపోతల పథకానికి విద్యుత్ బిల్లుల గ్రహణం పట్టుకుంది. బిల్లులు చెల్లించకపోవడంతో కండలేరులో నీరున్నా, పొదలకూరు మండలంలోని 12 వేల ఎకరాలను రైతులు బీడు పెట్టుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి సొంత మండలంలోనే అన్నదాతలు సాగునీరు లేక అవస్థలు పడుతుంటే, జిల్లావ్యాప్తంగా పరిస్థితి ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. సాగునీటి విషయమై విపక్షాలు ఆందోళన చేసినా పాలకులు, అధికారులు పట్టించుకోలేదు. దీంతో నిమ్మ, సవక, జామాయిల్, పత్తి రైతులు ఇబ్బందులు పడ్డారు.


కండలేరు ఎడమ కాలువ



- లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు కరెంటు చార్జీలు చెల్లించక కాలయాపన
- రెండేళ్లుగా ఆగిన కండలేరు లైనింగ్ పనులు
- సాగునీరు అందక బీడుగా 12వేల ఎకరాలు
- రైతులను ముంచిన పాలకులు
- జగనా... ఇదేనా రైతు సంక్షేమం?

'ఎత్తిపోతల'కూ షాక్!

రూ.68 కోట్లతో పథకం

సర్వేపల్లి నియోజకవర్గంలోని పొదలకూరు, వెంకటాచలం, మనుబోలు, ఆత్మకూరు నియోజకవర్గంలోని చేజర్ల, వెంకటగిరి నియోజకవర్గంలోని సైదాపురం మండలాల రైతులకు సాగునీరం దించేందుకు 2016లో టీడీపీ ప్రభుత్వం రూ.68కోట్లతో ఎత్తిపోతల పథకాన్ని నిర్మించింది. కండలేరు ఎడమ కాలువకు నీరు మళ్లిస్తే సుమారు 20,704 ఎకరాలకు అధికారికంగా, మరో 4వేల ఎకరాలకు అనధికారికంగా సాగునీరందించేలా పథకాన్ని రూపొందించారు. మూడు నెలలుగా వర్షాలు లేక నిమ్మ, మామిడి, సవక, పత్తి పైర్లు ఎండిపోతున్నాయి. ఈ విషయాన్ని పలుమార్లు రైతులు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి, ఉన్నతాధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. ప్రస్తుతం కండలేరు జలాశయంలో 13.8 టీఎంసీల నీరు నిల్వ ఉంది. విద్యుత్ బిల్లులు చెల్లించి పంటలకు నీరందించాలని వేడుకుంటున్నా రైతుల మొర ఆలకించే నాథుడే కరువయ్యాడు. గత టీడీపీ హయాంలో డెడ్‌స్టోరేజీ ఉన్న సమయంలో కూడా లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీటిని అందించిన నిమ్మ చెట్లను కాపాడిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని రైతులు అంటున్నారు.

పొదలకూరు, మే 6 : వైసీపీ ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక విద్యుత్ బిల్లులు చెల్లించపోవడంతో అప్పు లు చేసి పంటలు సాగు చేసిన రైతులంతా భారీగా నష్టపోయారు. నీటిని విడుదల చేయాలని రైతులు ఆందోళన చేసినా కనికరించలేదు. ఎన్నికలు సమీపించ డంతో మభ్యపెట్టేందుకు కొన్ని రోజుల క్రితం నీరు విడుదల చేశారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రెండేళ్లుగా ఆగిన పనులు

తెలుగుగంగ పథకంలో భాగమైన కండలేరు ఎడమ కాలువ లైనింగ్ పనులు ఏడు నెలలుగా ఆగిపోయాయి. ఈ కాలువ ద్వారా మూడు మండలాల్లోని 32 చెరువుల కు నీరు అందడంతోపాటు, 27వేల ఎకరాలకు నీరందు తోంది. తెలుగుగంగ హైలెవల్ స్లూయిజ్ నుంచి కనుపూరు కాలువ వరకు ఈ లైనింగ్ పనులకు రూ.39.12 కోట్లు మంజూ రయ్యాయి. ఈ మేరకు మంత్రి కాకాణి గత నెలలో పనులు ప్రారంభించారు. ప్రస్తుతం పులికల్లు స్పిల్‌వే దాటి, నరసింహ కండ్రిగ గ్రామ సమీపం వరకు పనులు (సుమారు 55 శాతం) చేశారు. మిగిలిన పనులను అసం పూర్తిగా వదిలేశారు. ఈ కాలువ లైనింగ్ పనులు పూర్తయితే ఆయకట్టు విస్తీర్ణం రెట్టింపు అయ్యే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం కాలువకు 350 క్యూసెక్కుల నీటిని మాత్రమే విడుదల చేసే సామర్థ్యం ఉండగా, లైనింగ్ పనులు పూర్తయితే 455 క్యూసెక్కుల నీటిని విడుదల అవకాశం ఉంటుంది. రెండేళ్లుగా వైసీపీ ప్రభుత్వం రైతుల ఆశలను అడియా శలు చేస్తూనే వస్తుంది. మంత్రి కాకాణి ప్రత్యేక చొరవ చూపు ఉంటే ఎప్పుడో లైనింగ్ పనులు పూర్తయ్యేవని, కమీషన్ మీద ఉన్న శ్రద్ధ లైనింగ్ పనులపై లేదని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి విమర్శిస్తూనే ఉన్నారు.


కండలేరు ఎడమ కాలువ లైనింగ్ పనులు

పంటలు ఎండుతున్నా.. పట్టించు కోలేదు !



కండలేరు లిఫ్ట్ ఇరిగేషన్‌కు మంత్రి కాకాణి కరెంటు బిల్లులు రూ.9 కోట్లు కట్ట లేకపోయారు. ఆయన సొంత మండలంలో పంటలు ఎండిపోతుంటే పట్టించుకోలేదు. రైతులకు సరైన సమయంలో నీరిచ్చి ఉంటే నిమ్మ, సవక, మామిడి, పత్తి రైతులకు మేలు జరిగేది. ఐదేళ్లపాటు కాలం గడిపేశారు. రైతులే త్వరలో బుద్ధి చెబుతారు.

- నెట్టెం పెంచలయ్య, నిమ్మరైతు, వావింటపర్తి

మూడేళ్లుగా పూర్తి కాని పనులు



ఏడాదిలో పూర్తి చేయాల్సిన కండలేరు ఎడమ కాలువ లైనింగ్ పనులను మూడేళ్లుగా చేస్తూనే ఉన్నారు. నాయకుల కమీషన్ కోసం లైనింగ్ పనులు చేస్తున్నారు. పనులు పూర్తి చేయకుండా ఇంకా అసంపూర్తిగా పెట్టడం సిగ్గుచేటు. ఈ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది.

- కోడూరు పెంచలభాస్కర్‌రెడ్డి, రాష్ట్ర రైతు సంఘం నాయకుడు, మొగళ్లూరు

క్షుద్రపూజల వస్తువుల కంటే మోసం చేసే నాయకులతోనే హాని

- రోడ్డు వేయలేని వారికి మళ్లీ ఓట్లు వేయాలా!?
- అల్లూరులో వినూత్న రీతిలో టీడీపీ నిరసన


ముగ్గువేసి, అందులో నిమ్మకాయలు, కోడిని ఉంచి నిరసన వ్యక్తం చేస్తున్న టీడీపీ నాయకులు

హంగామా!

అల్లూరు, మే 6 : క్షుద్రపూజల్లో వినియోగించే నల్లకోడి, నిమ్మకాయ, పసుపు కుంకుమలను సమాజానికి ఎటువంటి హానీ తలపెట్టవని, అయితే, నమ్మించి ఓట్లు వేయించుకొనే మోసపూరిత నాయకుల వల్లే సమాజానికి తీవ్ర హాని అని విశ్రాంత ప్రిన్సిపాల్, టీడీపీ నాయకుడు మేడా రామకృష్ణారెడ్డి తెలిపారు. కావలి, కోవూరు నియోజకవర్గాల సరిహద్దు ప్రాంతమైన పైడేరు వద్ద సోమవారం సాయంత్రం గుంతలమయమైన రాజుపాలెం-ఇస్కపల్లి రోడ్డును చూపుతూ నాయకులు వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ నాలుగేళ్లుగా రోడ్డు దుస్థితి కారణంగా వాహనదారులు అవస్థలు పడ్డారన్నారు. నమ్మించి ఓట్లు వేయించుకొని పదవులు పొంది లగ్జరీ కార్లలో తిరుగుతూ మనల్ని పట్టించుకోని నాయకుల వల్ల ప్రమాదమని కావలి, కోవూరు ఎమ్మెల్యేలు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి, నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో ప్రజలు ఆలోచనతో సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఇటువంటి దుస్థితి నుంచి విముక్తి పొందేలా మంచి నాయకులను ఎన్నుకోవాలని కోరారు. ఈ నిరసనలో నాయకులు అరగల రమణయ్య, కప్పిర విష్ణు, రామకృష్ణారెడ్డి, పోట్లూరు శీనయ్య, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఏమైంది నిఘా!

మూడో కన్ను

ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు ఖర్చుచేసే ప్రతి రూపాయిని వ్యయ పరిశీలకులు నిఘా ఉంచి లెక్కించనున్నారు. ఇందుకుగాను ఈ ఏడాది కొత్తగా విజిలెన్స్ అధికారుల కారుపై సీసీ కెమెరా అమర్చారు. అయితే అభ్యర్థులు తమ ప్రచారంలో విచ్చలవిడిగా లక్షలాది రూపాయలు ఖర్చు చేసినా, విజిలెన్స్ అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహ రిస్తున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎంపీ అభ్యర్థి రూ.95లక్షలు, ఎమ్మెల్యే అభ్యర్థి రూ.40 లక్షలు మాత్రమే ఖర్చు పెట్టాలి. అయితే ప్రధానపార్టీ అభ్యర్థులు ర్యాలీలు, విజయోత్సవ సభ లకు రోజుకు రూ.లక్షల్లో చేస్తున్నా నిఘా నేత్రాలకు మాత్రం కానరావడం లేదు.

- కలిగిరి



బస్సులు పెడుతున్నాం.. బయలు దేరండి !

వలస మా లక్ష్యం

ఈ సార్వత్రిక ఎన్నికలు అధికార, ప్రతిపక్ష పార్టీలకు ప్రతిష్ఠాత్మకంగా మారాయి. ఎన్నడూ లేని విధంగా వలస ఓటర్లను సైతం తీసుకు వచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో స్థానిక సంస్థల ఎన్నికలకు మాత్రమే వలస ఓటర్లను తీసుకువచ్చే వారు. ఈసారి ఎంత ఖర్చయినా గెలుపే ప్రధానమని అభ్యర్థులు చెబుతున్నారు. అందుకే వలస ఓటర్లకు ఫోన్ చేసి ఇక్కడకు రప్పించే ప్రయత్నాలు చేస్తు న్నారు. దూర ప్రాంతాల్లో ఉన్న వారి కోసం బస్సులు ఏర్పాటు చేస్తున్నారు. కందుకూరు నియోజకవర్గం వారు ఎక్కువగా హైదరాబాద్, చెన్నై, విజయవాడ, బెంగళూరు, తిరుపతి, పూణే, వైజాగ్ తదితర పట్టణాలలో స్థిరపడ్డారు. వారందరికీ ఫోన్లు చేసి బస్సులు పెడుతున్నాం.. ఓట్లు వేయడానికి రావాలని ఆహ్వానిస్తున్నారు. బస్సులు ఏర్పాటు చేయనిచోటుకు ప్రయాణ ఖర్చులకు డబ్బులు పంపుతున్నారు. ఇక్కడకు వచ్చాక మిగతా విషయాలు మాట్లాడతామని తెలియజేస్తున్నారు.

- పలేటివారిపాలెం




నాడు హుందాతనం.. నేడు గోల గోల !

ఆ రోజుల్లో

నేడు ఎన్నికల ప్రచారమంటే చెవులు తూట్లు పడేలా మైకుల గోల.. బాణసంచా పేలుళ్ల శబ్దాలు.. డప్పుల మోతలు... భారీగా అలంకరించిన ప్రత్యేక ప్రచార రథాలు... డీజే బాక్సులే.. ఇవి లేకుంటే ప్రచారం అనిపించు కోదేమో అన్నట్లు ఉంటున్నాయి. ఉదయం నుంచి రాత్రి 10గంటల దాకా ఆటోల్లో మైకులతో ప్రత్యర్థులపై విమర్శలు, అభ్యర్థుల సొంత డబ్బాలతో చెవులు తూట్లు పడేలా ఉపాన్యాసాలు ఉంటున్నాయి. అదే తొలినాళ్లలో ఎన్నికల ప్రచారం నిశ్శబ్దంగా ఉండేది. ఏదైనా పార్టీ అభ్యర్థి నలుగురితో కలిసి ఇంటింటికి వెళ్లి ఓటు వేయమని ప్రచారం చేసేవారు. అలాగే వివాహ ఆహ్వాన పత్రిక మాదిరిగా అభ్యర్థి గుణగణాలు తెలిపే కరపత్రాన్ని ముద్రించి ఇంటింటికి పంచేవారు. దాంతో ప్రచారం పూర్తయినట్లే.

- ముత్తుకూరు




'నన్ను గెలిపించండి.. అధికారంలోకి వచ్చాక గోపాలమిత్రలకు సరైన న్యాయం చేస్తాను... నమ్మండి... నన్ను దీవించండి'...అని జగన్ మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు అన్నమాటలివి. ఐదేళ్ల కిందట వారికిచ్చిన హామీ దేవుడెరుగు ..కనీసం గౌరవ వేతనంతోపాటు ప్రోత్సాహకాలు కూడా సక్రమంగా అందించని పరిస్థితి నేడు నెలకొంది. దీంతో జగన్ మమ్మల్ని నమ్మించి మోసం చేశారంటూ గోపాలమిత్రలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గోపాలమిత్రల గోడు పట్టదా ?

- ఉద్యోగ భద్రత హుళక్కే...
- ఏడాదిగా అందని ప్రోత్సాహకాలు

నెల్లూరు (వ్యవసాయం), మే 6: ప్రతిపక్షనేతగా పాదయాత్ర సమయంలో గోపాలమిత్ర లకు అండగా ఉంటామని, గౌరవ వేతనం రూ.16,000లు చేస్తామంటూ హామీ ఇచ్చిన జగన్‌రెడ్డి, ఐదేళ్లుగా ఒక్క రూపాయి కూడా పెంచలేదు. 2006లో గోపాలమిత్ర వ్యవస్థ మొదలైంది. అప్పట్లో వీరికి దాదాపు రూ.1,200ల గౌరవ వేతనం ఇస్తూ మూడు నెలలపాటు శిక్షణ ఇచ్చారు. అనంతరం నెలకు రూ.3,500 లకు పెంచారు. 2018లో టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు వీరికి రూ.6,500 లు గౌరవ వేతనం ఇచ్చారు. ప్రారంభంలో వీరు పాడిరైతుల ఇంటికి వెళ్లి సేవలందించేవారు. ఇది ఎంతో ఉపయోగకరంగా ఉండేది. అయితే గోపాలమిత్రలకు రూ.16వేలు గౌరవ వేతనం ఇస్తామంటూ హామీఇచ్చి అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం ఆఊసే మరచిపోయింది. రైతు భరోసా వ్యవస్థను ఏర్పాటు చేసి తమను పూర్తిగా విస్మరించారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశువులకు ఏదైనా జబ్బు చేస్తే వైద్యులకంటే ముందుగా వెళ్లి ప్రథమ చికిత్స చేసేది గోపాలమిత్రలే. అంతేకాక ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో అందించేది వారే. ప్రభుత్వ పథకాలైన కృత్రిమ గర్భధారణ, వైద్య సేవలు, డీవార్మింగ్, వ్యాక్సినేషన్లలో వీరు ఎంతో కీలకంగా పనిచేస్తున్నా గుర్తింపు లేదు. క్షేత్రస్థాయిలో పాడి అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్న వీరిని ప్రభుత్వం విస్మరించింది. గౌరవ వేతనం కూడా మూడు నెలలకు ఒక సారి అందుతోందని, అదికూడా అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగితే బిల్లులు పెడుతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రోత్సాహకాలూ కరువే..



క్షేత్రస్థాయిలో పశువులకు వైద్యసేవలందించే తమను ప్రభుత్వా లు నిర్లక్ష్యం చేస్తున్నాయి. ఉద్యోగ భద్రత కల్పిస్తామని సీఎం ఇచ్చిన హామీ నెరవేరలేదు. ఏళ్లగా సేవలందిస్తున్న తమను నిర్లక్ష్యం చేయ డం సరికాదు. గత మూడు నెలలుగా గౌరవ వేతనాలు రాలేదు. అదే మని ఎన్నికలు అయిన తరువాత ఇస్తామంటూ సమాధానం ఇస్తు న్నారు. జిల్లాలో దాదాపు 109 మంది గోపాలమిత్రలు సేవలం దిస్తున్నారు. వారికి గత ఏడాది కాలంగా కనీసం ప్రోత్సాహకాలు కూడా ఇవ్వలేదు. ఒక్కొక్కరికి సరాసరి కనీసం రూ.2వేలకు పైగా ప్రోత్సాహకాలు రావాల్సి ఉంది. ప్రభుత్వాలు తమను గుర్తించాల్సిన అవసరం ఉంది.

- సర్వేపల్లి వెంకటేశ్వర్లు, గోపాలమిత్ర

మూడు నియోజకవర్గాల్లోని ప్రాంతాల కలయికతో ఏర్పాటు


ఓసారి కాంగ్రెస్, రెండుసార్లు వైసీపీ విజయం

భిన్నవర్గాల సెగ్మెంట్

నెల్లూరు రూరల్

నెల్లూరురూరల్, మే 6 : 2009లో అసెంబ్లీ నియోజకవ ర్గాల పునర్విభజనలో జిల్లాలోని రాపూరు, అల్లూరు నియోజకవర్గాలను తొలగించారు. కొత్తగా నెల్లూరు రూరల్ నియోజకవర్గాన్ని ఏర్పాటు చేశారు. నెల్లూరు నగరంలోని కొన్ని మున్సిపల్ డివిజన్లతోపాటు, రాపూరు నియోజకవర్గంలోని 17 గ్రామాలు, సర్వేపల్లిలోని 16 గ్రామపంచాయతీలతో కలిపి నెల్లూరురూరల్ సెగ్మెంట్‌ను రూపొందించారు. ఈ మూడు సెగ్మెంట్లను కలుపుకుని ఏర్పాటుకాగా విభిన్నవర్గాల నియోజకవర్గంగా ఇది పేరొందింది. ఇక్కడ నుంచి మొదటి ఎమ్మెల్యేగా కాంగ్రెస్ నుంచి ఆనం వివేకానందరెడ్డి పోటీ చేసి గెలుపొందారు. ఆ తరువాత 2014, 19 ఎన్నికల్లో వైసీపీ నుంచి పోటీ చేసిన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందారు. కాగా 2009లో సీపీఎంకి టీడీపీ మద్దతు పలికింది. 2014లో బీజేపీ అభ్యర్థి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డికి టీడీపీ జైకొట్టింది. 2019 ఎన్నికల్లో టీడీపీ తరఫున బరిలోకి దిగిన అబ్దుల్ అజీజ్ ఓటమిపాలయ్యారు. వ్యవసాయ పరంగా డెల్టా, నాన్‌డెల్టాతోపాటు నెల్లూరు సిటీ నియోజకవర్గం కంటే విస్తీర్ణంలో పెద్దదిగా ఉంది. బీసీవర్గాలతోపాటు ముస్లింల ఓటర్లు ఇక్కడ కీలకం. నెల్లూరు సిటీకి లభించే సహజవనులన్నీ రూరల్లో నియోజకవర్గంలోనే ఉన్నాయి. నగర గ్రామ దేవత ఇరగాల పరమేశ్వరిదేవి రూరల్లోనే కొలువుతీరి ఉన్నారు. కమ్యూనిస్టులకు జిల్లాలోనే ఈ నియోజకవర్గ పంచాయతీల్లోనే కొంత పట్టుంది. ప్రస్తుతం 26 మున్సిపల్ డివిజన్లు, 18 గ్రామ పంచాయతీలతో ఈ నియోజకవర్గం విస్తరించి ఉంది.

ముఖచిత్రం




నెల్లూరు రూరల్ సెగ్మెంట్ వ్యూ